డిసెంబర్
2023

212

సంపుటి :19 సంచిక : 7

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

## ఈ సంచికలో........

పాఠ్యపుస్తకాలకు కాషాయ చెద
సాహిత్య కళారంగాల్లో కృషి
'అమృతకాలం'లో ఆకలి రాజ్యం
హిందూయిజం అంటే ఏమిటి?
విఫలమైన నయా-ఉదారవాదం
మూఢనమ్మకాలు - మన పాలకులు
వేద కాలంలో మహిళలు : లింగ వివక్ష
యుద్ధ విస్తరణకు ఉవ్విళ్లూరుతున్న ఇజ్రాయిల్, అమెరికా
దురాక్రమణే సమస్యకు మూలం
యుద్ధతంత్ర యోధుడు మార్షల్ చూ టే (ఝు డే)

# యుద్ధతంత్ర యోధుడు
# మార్షల్ చూ టే (ఝు డే)

**వై రాము**

"తడబడి కలబడి నిలబడూ... పోరాడే యోధుడు జడవడు... సంకల్పం నీకుంటే ఓటమికైనా వణుకేరా" అని ఒక సినీ రచయిత అంటాడు. ఈ వాఖ్యలు సరిగ్గా కామ్రేడ్ చూటే జీవితానికి సరిపోతాయి. చైనా విప్లవ విజయం లో మావో కి ఎంతటి ప్రాముఖ్యత ఉన్నదో అదే స్థాయిలో ప్రాధాన్యత కలిగిన వ్యక్తి మార్షల్ చూటే. మావో, చూటే, చౌఎన్‌లై ను అగ్రనాయ కత్వత్రయంగా అభివర్ణించేవారు. ఈ త్రయమె చైనా విప్లవ రథ సారథులు, కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు, పునాదికి ఆధ్యులు, ఎవరి ప్రత్యేకతలు వారివి. మావో రాజకీయ, సైద్ధాం తిక విషయాల్లో దిట్ట గెరిల్లా ఎత్తుగడలు, చాకచక్యంగా సైన్యాన్ని నడిపించడంలో చూటే ప్రతిభావంతుడు. దౌత్య వ్యవహారాలు, పరిపాలన దక్షుడు చౌఎన్ లై వీరి ముగ్గురి నాయకత్వాన చైనా విప్లవం ముందుకు సాగింది.

కమ్యూనిస్టు ప్రపంచ ప్రస్థానంలో మార్క్స్ – ఎంగిల్స్‌లు విప్లవ స్నేహితులు, వీరిరువురి స్నేహం ఉత్తేజపరుస్తుంది. అదేవిధంగా మావో – చూటేల స్నేహం కూడా అటువంటిదే, తరువాత కాస్ట్రో–చేగువేరా స్నేహగాథలు మనకు తెలుసు. ముఖ్యంగా మావో – చూటేల స్నేహం మరింత ప్రత్యేకమైనది. అధ్యయనం –ఆచరణ ఇద్దరి స్వభావంలో కనిపిస్తాయి.

**బాల్యం – చదువు**

1886 సం॥లో మార్షల్ చూటే సిచువాన్ ప్రావిన్స్ లో "యిలాంగ్ సియాన్" ఊరిలో డిసెంబర్–1 వ తేదిన వ్యవసాయ కుటుంబం లో పుట్టాడు అతని మామ ఆర్థిక సహాయంతో మాధ్యమిక విద్యను పూర్తిచేసి, జిల్లా సివిల్ సర్వీస్ పరీక్ష ఉత్తీర్ణత అయ్యారు. చెంగ్డులో వ్యాయామ విద్య అభ్యసించి అనంతరం వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేసాడు. చూటే పై తైపింగ్ విప్లవం యొక్క ప్రభావం ఉంది. తైపింగ్ అంటే మహాశాంతి సేన అని అర్థం. 1851లో అవతరించి దక్షిణ చైనా వరకూ విస్తరించింది. తైపింగ్‌లు భూమిని స్వాధీనం చేసుకుని రైతు కూలిలకు పంచి పెట్టారు. బానిస విధానాన్ని రద్దు చేశారు. నల్ల మందుని నియంత్రించారు. స్త్రీలకు విముక్తి కల్పించారు. ఈ తైపింగ్ తిరుగుబాటును చూటే అధ్యయనం చేశాడు.

1908లో చూటే కున్మింగ్‌లోని యనాన్ మిలటరీ అకాడమిలో చేరాడు. 1911లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి అకాడమిలో బోధిం చాడు. క్వింగ్ రాజవంశానికి వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటులో చూటే చేరాడు. అనంతరం మిడిల్ ర్యాంకింగ్ ఆఫీసర్‌గా బ్రిగేడియర్ జనరల్ స్థాయికి ఎదిగారు.

1919 లో తన కుటుంబాన్ని స్వగ్రామం నుంచి రప్పించాడు తల్లిదండ్రులు వద్దంటున్నా తన సొంత తమ్ముళ్లను మిలిటరిలో చేర్పిం చాడు. తూర్పు సెచువాన్‌లో ఓ యుద్ధ ప్రభువుతో జరిగిన భయంకర పోరాటంలో తమ్ముళ్లిద్దరూ మరణించారు. చూటే జీవితంలో విషాదకరమైన సంఘటన ఇది, చూటే అపరా ధం చేశానని కృంగిపోయాడు. క్రమంగా నల్ల మందుకు అలవాటు పడిపోయాడు. అనంతరం



సైనిక జీవితానికి వీడ్కోలు చెప్పి చదువు నిమిత్తం యూరప్‌లో అడుగు పెట్టాడు.

**కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలు**

తైపింగ్ తిరుగు బాటు, బాక్సర్‌ల తిరుగు బాటు, సన్‌యెట్‌సేన్ పోరాటాలను అధ్యయనం చేసిన చూటే. కార్మికుల పోరాటం గురించి చద వడం మొదలు పెట్టాడు. చైనా అంతటా కొత్త గాలి వీస్తోంది. పత్రికల నిండా నూతన కార్మికోద్యమం గురించి కమ్యూనిస్టు పార్టీ గురించి వ్యాసాలు, వార్తలు వస్తున్నాయి. వీటి ప్రభావం చూటే పై పడింది. ఈ కొత్త కమ్యూనిస్టు పార్టీలో చేరాలని నిర్ణయించు కున్నాడు. చైనా కమ్యూనిస్టు పార్టీ 1921, జూలై 1న అవతరించింది. అప్పటి చైనా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి కామ్రేడ్ చెన్ ని కలిశారు. కమ్యూనిస్టు పార్టీలో చేరతానని పార్టీ కార్యదర్శికి చెప్పగా, సైన్యంలో పనిచేసిన విధానం, యుద్ధ ప్రభువుల రాష్ట్రం నుండి వచ్చిన నేపద్యం కారణంగా చెన్ తిరస్కరిం చాడు. చూటే కి ఊహించని పరిణామం ఎదురైంది. అనంతరం తన స్నేహితుడు సుంగ్ పింగ్ తో కలిసి ఫ్రాన్స్ వెళ్ళాడు. అక్కడ చదువుకుంటున్న చైనా విద్యార్థులతో పరిచ యం ఏర్పడింది. అప్పటికే ఫ్రాన్సులో చైనా విద్యార్థులతో కమ్యూనిస్టు పార్టీ శాఖ ఏర్ప డింది. దానికి నాయకుడు చౌ.ఎన్.లై తన మిత్రుల ద్వారా చౌ.ఎన్.లై ని కలుసుకున్నాడు.

చౌ.ఎన్.లై తో నల్లమందును ఎలా మానేసాడో, సన్‌యెట్‌సేన్ ని కలుసుకున్న విషయాలని చెప్పి కమ్యూనిస్టు పార్టీలో పని చేస్తానని చెప్పాడు. చౌ.ఎన్.లై. చైనా కమ్యూనిస్టు పార్టీకి దరఖాస్తు పెట్టించి, బెర్లిన్

(మిగతా 35వ పేజీలో)

# ఈ సంచికలో...

1. యుద్ధతంత్ర యోధుడు
మార్షల్ చూ టే(ఝు డే)
వై రాము .......2
2. పాఠ్యపుస్తకాలకు కాషాయ చెద
రొమిల్లా థాపర్ .......4
3. సాహిత్య కళారంగాల్లో కృషి
మావో ........9
4. 'అమృతకాలం'లో ఆకలి రాజ్యం
ఎస్.వెంకట్రావు.......12
5. హిందూయిజం అంటే ఏమిటి?
సిబి జయమోహన్.........16
6. విఫలమైన నయా-ఉదారవాదం
సిపి చంద్రశేఖర్.........22
7. మూఢనమ్మకాలు - మన పాలకులు
పి.బి.చారి .......24
8. వేద కాలంలో మహిళలు : లింగ వివక్ష
జాఫర్ హబీబ్......27
9. యుద్ధ విస్తరణకు ఉవ్విళ్లూరుతున్న ఇజ్రాయిల్, అమెరికా
ఎంకె.భద్రకుమార్ ......29
10. దురాక్రమణే సమస్యకు మూలం
ఇఫ్లెఖర్ గిలానీ..........29

సంపాదకుడు :
ఎస్.వెంకట్రావు

సంపాదక వర్గం :
బి.వి.రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్.వీరయ్య
తెలకపల్లి రవి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
ఫోన్: ఎడిటర్ : 94900 99333

ముద్రణ: ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at: cpim.org

# జాతి నిర్మూలనం

భారత ప్రజలమైన మనం రెండు వందల సంవత్సరాల వలసవాదాన్ని ప్రత్యక్షంగా అనుభవించాం. దేశంలోని అన్ని జాతులు, అన్ని మతాలు, అన్ని ప్రాంతాల ప్రజలు ఏకతాటిపై నిలిచి రెండు శతాబ్దాల త్యాగపూరిత పోరాటం చేసిన ఫలిగంగా స్వాతంత్ర్యం పొందాం. సామ్రాజ్యవాదులు మన దేశాన్నే కాదు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని అనేక దేశాలను వలస పీడనతో పీల్చి పిప్పిచేశారు. కొన్ని దేశాలలో మూల వాసులను పూర్తిగా నిర్మూలించారు. లాటిన్ అమెరికాలో ఎంతో అభివృద్ధి చెందిన నాగరికతలనే నాశనం చేశారు. స్థానిక ప్రజలను తుపాకులతోనూ, అంటువ్యాధులు తగిలించి అంతం చేశారు. ఆస్ట్రేలియాలో మూలవాసులను నిర్దాక్షిణ్యంగా వధించి ఆ ఖండాన్ని తెల్లజాతీయుల దేశంగా మార్చేశారు. ఆఫ్రికా ఖండంలోని అనేక ప్రాంతాల్లో స్థానిక జాతులను నిర్మూలించారు, కోట్లాది మందిని బంధించి బానిసలుగా చేసుకున్నారు.

ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తున్నదంటే ఏనాడో శతాబ్దాల క్రితం జరిగిపోయి, మనం చరిత్రలో చదువుకుంటున్న జాతి నిర్మూలన కార్యక్రమం ఈ రోజు ఆధునిక ప్రపంచంలో మన కళ్ల ముందే జరుగుతున్న తీరును వివరించడం కోసం. ఒక జాతిని వారి స్వంత దేశం నుండి తరిమేసి మరోజాతి ఆ దేశాన్ని ఆక్రమించుకోవడం, ప్రపంచంలోని సామ్రాజ్యవాద పాలకవర్గాలన్నీ ముక్త కంఠంతో ఈ దురాక్రమణకు, జాతి నిర్మూలనకు మద్దతివ్వడం, పైగా పీడితులనే ఉగ్రవాదులుగా ముద్ర వేయడం అనేది నేడు పాలస్తీనాలో ప్రత్యక్షంగా చూస్తున్నాం.

1948 వరకు అక్కడ పాలస్తీనా దేశం మాత్రమే ఉంది. కానీ ఎక్కడెక్కడో ప్రపంచ మంతటి నుండి యూదులను తీసుకు వచ్చి, పాలస్తీనాలో సెటిల్‌మెంట్లు ఏర్పాటు చేసి, స్థానికులను తరిమేసి, ఇజ్రాయిల్ దేశంగా ప్రకటించింది బ్రిటిష్ సామ్రాజ్యవాదం. ఇజ్రాయిల్‌కు ఆయుధాలు, డబ్బు, అంతర్జాతీయ మద్దతు ఇచ్చి పాలస్తీనియన్లను చిన్న భూభాగాలైన గాజా ప్రాంతం, పశ్చిమ తీరాలకు పరిమితం చేయడమే కాకుండా ఆ భూభాగాలపైన కూడా ఇజ్రాయిలే పెత్తనం సాగించడంద్వారా పాలస్తీనాకు ఒక దేశం అంటూ లేకుండా చేయడానికి తోడ్పడింది అమెరికన్ సామ్రాజ్యవాదం. తమ స్వంత భూభాగంలో పాలస్తీనియన్లు నేడు ఎటువంటి హక్కులూ లేకుండా బానిసలుగా బ్రతుకుతున్నారు.

వంచితులైన పాలస్తీనియన్లు నేడు స్వాతంత్ర్యం కోసం పోరాడుతుంటే, వారిని ఉగ్రవాదులు గానూ, స్వంత భూమి నుండి వారిని వెళ్లగొట్టి, వేలాది మంది పాలస్తీనా స్త్రీ, పురుషులను, పసిపిల్లలను చంపేస్తున్న ఇజ్రాయిల్ నరహంతక దళాలను ఉగ్రవాదులపై దాడులు చేస్తున్న సైన్యంగానూ చూపించడం పరమ దుర్మార్గం. సామ్రాజ్యవాదులు, వారి ప్రసార సాధనాలు ఈ దుర్మార్గానికి పాల్పడుతుంటే నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వమూ, దేశంలోని కార్పొరేట్ మీడియా వారితో గొంతు కలపడం ఘోరం.

నిజానికి భారత స్వాతంత్ర్య పోరాటం, పాలస్తీనా స్వాతంత్ర్య పోరాటం ఒకదానికి మరొకటి మద్దతుగా ముందుకు నడిచాయి. పాలస్తీనా ప్రజల పోరాటానికి మద్దతివ్వడం స్వాతంత్ర్య పోరాటం నుండి ఇటీవలి వరకు మన దేశ విదేశాంగ విధానంలో భాగంగా ఉండేది. కాషాయ ప్రభుత్వాలు ఈ వారసత్వాన్ని తల్లకిందులు చేశాయి. మోడీ ప్రభుత్వం పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణకు మద్దతివ్వడమే కాదు, పాలస్తీనా ప్రజలపై జరుగుతున్న మారణకాండకు వ్యతిరేకంగా దేశంలో నిరసన ప్రదర్శనలకు కూడా అనుమతి నిరాకరిస్తున్నది. ఇజ్రాయిల్‌కు గట్టి మద్దతుదారులైన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీల్లోనూ లక్షల సంఖ్యలో ప్రజలు ఇజ్రాయిల్ దురాగతాలకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరుపుతుంటే మోడీ ప్రభుత్వం ఇక్కడ నిరసన ప్రదర్శనలు జరిపే వారిని జైళ్లలో పెడుతుండడం పరమ నీచం.

గాజాలో మారణకాండకు కొద్దిరోజుల విరామమిచ్చిన ఇజ్రాయిల్ మళ్లీ యుద్ధం ప్రారంభి స్తానని ఫీంకరిస్తున్నది. యుద్ధం అంటే ఇరు పక్షాలు ఒకదానిపై మరొకటి జరిపేది. కానీ నేడు పాలస్తీనాలో ముఖ్యంగా గాజాలో జరుగుతున్నది యుద్ధం కాదు. అది అమాయక పాలస్తీనా ప్రజలపై యూదు దురహంకార ఇజ్రాయిల్ సైన్యం సాగిస్తున్న ఊచకోత, మారణహోమం. నరహత్యలు. ఇది ఒక మతంపై మరో మతం జరుపుతున్న దాడి కాదు. ఒక జాతిని మరో జాతి నిర్మూలించే జాతిహననం. ప్రపంచంలో బర్బరత్వం రాజ్యమేలినప్పుడు చూసిన ఈ ఘోరకలి నేడు మన కళ్ల ముందే జరుగుతుంటే చూస్తూ ఊరుకోవడం, గొంతెత్తి నిరసించకుండా ఉండడం మానవత్వం కాదు. యూదు దురహంకార మారణకాండనూ, వారికి మద్దతిస్తున్న సామ్రాజ్య వాదులనూ, వారితో మిలాఖత్ అయి వ్యవహరిస్తున్న హిందూత్వ వాదులనూ ఖండించాలి. పాలస్తీనా ప్రజల స్వాతంత్ర్య పోరాటానికి మద్దతుగా ప్రజలను మనం సమీకరించాలి.

ఈ మాసం ముఖ్యాంశం

# పాఠ్యపుస్తకాలకు కాషాయ చెద

రొమిల్లా థాపర్



రచయిత ప్రఖ్యాత భారతీయ చరిత్రకారిణి. ప్రాచీన భారత చరిత్రపై ఆమె అనేక పుస్తకాలు రాశారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు.

జాతీయ విద్యా పరిశోధనా శిక్షణా మండలి (యన్‌సిఇఆర్‌టి) ఈ మధ్యకాలంలో 6 నుండి 9వ తరగతి వరకు చరిత్ర పాఠ్య పుస్తకాల నుండి కొన్ని అధ్యాయాలు తొలగించడం వివాదాస్పదం అయ్యింది. ఈ తొలగింపు అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రస్తుత విద్యావిధానంలోని ముఖ్యమైన చారిత్రక ఘట్టాలను, విభాగాలను కత్తిరించడం మీద ధర్మాగ్రహం వెల్లువెత్తింది. అనేక ఖండన మండిన ప్రకటనలు ఇప్పటికే వెలువడ్డాయి. ప్రస్తుతం నేను ఈ వివాదానికి సంబంధించి మూడు అంశాలనే ప్రస్తావిస్తాను. 1. విద్యకు పాఠ్యపుస్తకాలు ఎందుకు కీలకం. 2. ఈ మధ్య పుస్తకాల నుండి భారతీయ చరిత్ర నుండి కొన్ని భాగాల ఏకపక్ష తొలగింపును మనం ఎలా అర్థంచేసుకోవాలి. 3. ఈ తొలగింపు వెనుక ఉన్న ఉద్దేశ్యాలు ఏమిటి?

**విద్యకు పాఠ్యపుస్తకాలు ప్రాధాన్యత :**

పాఠ్యపుస్తకాలు మూడు విధాలా ఉపయుక్తమైనవి. పాఠ్యాంశానికి సంబంధించి ప్రాథమిక సమాచారం అంతా పాఠ్యపుస్తకాలు అందిస్తాయి. అందుకే పాఠ్యపుస్తకాలను తరగతుల వారీగా రూపొందిస్తారు. కింద తరగతుల పుస్తకాలు సులభంగా ఉంటాయి. పైపై తరగతులకు పోయే కొద్దీ సంక్లిష్టంగా ఉంటాయి. పునరుక్తాలు పేరిట పాఠ్యాంశాలను తొలగించడం సరికాదు. సమాచారం స్థాయిని పెంపొందించేందుకు పునరుక్తాలు దోహదం చేస్తాయి. ప్రశ్నలు అడగడం, ప్రశ్నించడం మన విజ్ఞానానికి పెంపొందిస్తాయి. కాబట్టి విద్య అనేది ప్రశ్నించే ధోరణిని ప్రోత్సహించేదిగా ఉండాలి.

ఇక రెండవ అంశం – పాఠ్యపుస్తకాలు విద్యార్థులల్లో ప్రశ్నించే దోరణిని ప్రోత్సహించేదిగా ఉంటేనే వారికి ఆయా సబ్జెక్టులను ఆకళింపు చేసుకునే అవకాశాలు ఉంటాయి. అందుకే విద్య ప్రశ్నించే దోరణిని నేర్పేదిగా, అలవరిచేదిగా ఉండాలి.

మూడవ అంశం – ఉపాధ్యాయుడు ఏదైనా పాఠ్యాంశాన్ని బోధించే క్రమంలో ఈ అంశానికి మన సమాజంతో, సంస్కృతితో ఉన్న ప్రాధాన్యత ఏమిటో అర్థం చేయించేదానికి పాఠ్య పుస్తకాలు సహాయకారిగా ఉంటాయి. పిల్లలకు మనం ఏం నేర్పిస్తున్నాం అనేదాన్ని బట్టి వారు ఆ రకమైన పౌరులుగా ఎదుగుతారు. మిషనరీ స్కూళ్ళలోగానీ, ఆర్‌ఎస్‌ఎస్ నిర్వహించే పాఠశాలలుగానీ ఇందుకు మినహాయింపు కాదు.

అందుకే యన్.సి.ఇ.ఆర్.టి రూపొందించే సెట్–1, సెట్–2, పుస్తకాల పట్ల మనం అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ దృష్ట్యా చూసినప్పుడు ఇవాళ యన్.సి.ఇ.ఆర్.టి. సిలబస్‌లో కొన్ని పాఠ్యాంశాల తొలగింపు ప్రధాన ఉద్దేశ్యం విద్యా సంబంధమైనవి కాదనీ. దానికి ఇతరేతర కారణాలు ఉన్నాయనీ ఎవరికైనా ఇట్టే బోధపడుతుంది. విద్యార్థులలో ప్రశ్నించే ధోరణి తలెత్తకుండా విద్య గరపడం అంటే మనం భవిష్య పౌరులను మట్టిముద్దలుగా తయారు చేస్తున్నట్లే. విద్య అంటే అక్షరాలు నేర్చుకుని పాఠాలు బట్టీ పట్టడం కాదు. సమకాలీన ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి వీలుగా ఉపాధ్యాయులను, విద్యార్థులను నిరంతరం ప్రశ్నించే ధోరణి పెంపొందించుకునే శిక్షణ గరిపేలా ఉండాలి. మన విద్యా విధానం, అలాంటి శాస్త్రీయ విద్యావిధానం కావాలంటే ఇవాళ కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి చేస్తున్న కేటాయింపులు ఎంత మాత్రం సరిపోవు. ఇవి మరింత పెరగాలి. శాస్త్రీయ విద్య పెంపొందించడంలో చరిత్ర కీలకపాత్ర పోషిస్తుంది.

**ఇంతకీ హేదబద్ధం (రేషనలైజ్) కాబడిన (అంటు తొలగించబడిన) పాఠ్యాంశాలు ఏమిటి?**

చరిత్ర అంటే గొలుసుకట్టు పరిణామాలను గుదిగుచ్చడం. అలాంటి చరిత్ర పాఠ్యాంశాలను పెద్ద ఎత్తున తొలగించడం అటు విద్యార్థులను, ఇతర ఉపాధ్యాయులను తీవ్ర గందరగోళానికి గురి చేస్తాయి. ప్రాచీన చరిత్ర నుండి ఇరవైయ్యవ శతాబ్ది చరిత్ర పాఠ్యాంశాలకు ఒకేసారి పెద్దగెంతు వెయ్యడం, అందునా ముస్లిం చరిత్రను విస్మరించడం ఎంత మాత్రం సరికాదు. నిర్దిష్ట పాఠ్యాంశాల తొలగింపు చరిత్ర గతిలో పరిణామాలను శాస్త్రీయంగా అర్థం చేసుకోవడానికి తీవ్ర ఆటంకంగా మారుతుంది. ఉదాహరణకు గాంధీ హత్యోదంతాన్ని చెప్పాల్సి వచ్చినపుడు హంతకుడు ఎవరనే వివరాలు పేర్కొనకపోతే అతని ఉద్దేశాలు ఏమిటి? గాంధీ హత్యోదంతం జరిగిన రాజకీయ పరిణామాలకు కారణాలు ఏమిటో విద్యార్థులు ఎలా అర్థం చేసుకుంటారు.

చరిత్ర అంటే కేవలం తారీఖులు, దస్తావేజులు కాదు. ఒక ఘటన నేపథ్యాన్ని చర్చించడం ద్వారా ఆ ఘటన చారిత్రకతను కీలకంగా అర్థం చేసుకోవచ్చు. ఒకానొక

నేపథ్యంలో ఒకే మతస్థులను లక్ష్యంగా చేసుకొని వందల మందిని హత్యకావించిన సంఘటనను అర్థం చేసుకోవాలన్నా దాని వెనుక ఉన్న చారిత్రిక నేపథ్యాన్ని తెలుసుకోవాలి. 2002లో గుజరాత్‌లో జరిగిన నరమేధాన్ని యన్.సి.ఇ.ఆర్.టి చరిత్ర పాఠ్యపుస్తకాల నుండి తొలగించడం ద్వారా చరిత్ర నుండి ఆ దారుణ మారణహోమాన్ని రూపుమాపలేరు. ప్రజల జ్ఞాపకాల నుండి అంతకన్నా రూపుమాపలేరు. పౌర సమాజం ఈ ఊచకోత గురించి బహిరంగంగా చర్చించడాన్నీ నిలవరించలేరు. హిట్లర్ హయాంలో యూదులపై జరిపిన జాతిహననాన్ని జర్మన్ చరిత్ర పాఠాల్లో నమోదు చెయ్యనంత మాత్రాన దాని గురించి ప్రపంచం చర్చించకుండా ఉందా? లేదు కదా. గుజరాత్ మారణ హోమం గురించిన పాఠ్యాంశాల్ని ప్రస్తుత పాలకులు పాఠ్యపుస్తకాల నుండి తొలగించినా దీని గురించి ప్రపంచంలోఎక్కడో ఒక చోట పాఠాలు నేర్పుతూనే ఉంటారు.

అఖిల భారత సిలబస్ నుండి యన్.సి.ఇ.ఆర్.టి తొలగించిన పాఠ్యాంశాలు, చేస్తున్న చేర్పులు మార్పులకు సంబంధించిన ఇదే గందరగోళం కొనసాగుతుంది. ఈ తొలగింపుల వెనుక ఉన్న పరమార్థం ఏమిటో యన్.సి.ఇ.ఆర్.టి యే స్పష్టం చేయలేకుండా ఉంది. కాసేపు పాఠ్యాంశాలను పునరుక్త దోషం లేకుండా హేతుబద్ధం చేసాం అని చెబుతుంది. అలా అయితే మరి ఇంటర్ స్థాయిలో (11,12 తరగతులు) కొన్ని వాక్యాలు, కొన్ని పేరాలు కొన్ని అధ్యాయాలు ఎందుకు తొలగించాల్సి వచ్చింది అని ప్రశ్నిస్తే 'బ్రాహ్మణుడు' అన్న వాక్యం తొలగించడం కోవిడ్ అనంతర దశలో పిల్లలపై చదువు భారాన్ని తగ్గిచండచంలో బాగంగా చేసిందని యన్.సి.ఇ.ఆర్.టి సమర్థించుకోవడం హాస్యాస్పదంగా లేదూ..

చరిత్ర పాఠ్యాంశాన్ని రూపొందించేటప్పుడు దాని వెనుక ఉన్న హేతువు, తార్కిక వివరణలు ఎలా ఉంటాయో సదరు పాఠ్యాంశాన్ని కానీ, పాఠ్యంశ భాగాన్ని కానీ తొలగించేటప్పుడు అందుకు తగ్గ హేతువు, తార్కిక వివరణలు ఏమిటో యన్.సి.ఇ.ఆర్.టి విశదపరచాలి కదా. ఏకపక్షంగానో, యధాలాపంగానో తీసేసాం అంటే తీసేసాం అని చెప్పడం సబబు కాదు కదా. అన్నిటికీ మించి ఒక రాజకీయ భావజాలానికి లొంగి ఆ పని చేశారు అన్న అప్రతిష్ట మాట కట్టుకథగాదు కదా. హేతుబద్ధం చేశాం కదా. కొన్ని వాక్యాలు, కొన్ని పేరాలు, కొన్ని అధ్యాయాలు ఎంపిక చేసి తొలగించడం కిందకు

**"ఇవాళ యన్.సి.ఇ.ఆర్.టి చరిత్ర పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాల తొలగింపు తీరుచూస్తే ఇంతకు మించిన మతి మాలిన పని వేరొకటి ఉండదు అని పిస్తుంది. యన్.సి.ఇ.ఆర్.టి పాల్పడిన ఈ చర్య చరిత్ర పాఠ్యపుస్తకాలను మరింత ప్రామాణికంగా తీర్చిదిద్దడానికి మాత్రం కాదు. కేవలం 'పై' నుండి వచ్చిన ఆదేశాల మేరకు చేపట్టిన చర్చ అని ఇట్టే బోధపడుతుంది. మనదేశ విద్యావ్యవస్థ మేధోస్వాంతత్ర్యానికి ఎలాంటి గతి పట్టిందో చూశారా?!"**

వస్తుంది. హేతుబద్ధం (రేషనలైజ్) చేయ్యడానికి నియంత్రించడానికి (రేషనింగ్) మధ్య ఉన్న తేడా తెలియకుండా ఉందా యన్.సి.ఇ.ఆర్.టికి. విద్యార్థులపై చదువుల భారాన్ని తగ్గించడం పేరిట యన్.సి.ఇ.ఆర్.టి చరిత్ర పాఠ్యాంశాల తొలగింపుకు, సంక్షిప్తీకరణకు, కుదింపుకు పాల్పడింది అనేది స్పష్టమవుతోంది.

నిజంగానే కోవిడ్ అనంతరకాలంలో విద్యార్థులపై చదువుల బారాన్ని తగ్గించడమే యన్.సి.ఇ.ఆర్.టి ఉద్దేశ్యమైతే పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాల తొలగింపుకు పూనుకోకుండా పుస్తకాలను యధావిధిగా అందుబాటులో ఉంచి ఫలానా ఫలానా అధ్యయాలు పరీక్షా పత్రాల నుండి మినహాయింపబడ్డాయి అని ప్రకటించి ఉండవచ్చు. ఆసక్తిగల విద్యార్థులు ఆ అధ్యాయాలను చదువుకునే వీలు కల్పించి ఉండొచ్చు. అప్పుడు యన్.సి.ఇ.ఆర్.టి వాదనల్లో నిజాయితీ ఉంది. అని నమ్మ ఉండేవాళ్ళం. కానీ ఎంపిక చేసిన పాఠ్యాంశాల తొలగింపు ద్వారా యన్.సి.ఇ.ఆర్.టి పాలక పక్ష రాజకీయ భావజాలానికి అడుగులకు మడుగులు ఒత్తెలా వ్యవహరించిందని స్పష్టమవుతుంది. యన్.సి.ఇ.ఆర్.టి ఈ విధంగా ఏకపక్షంగా పాఠ్యాంశాలను తొలగించి రూపొందించే సెట్-3, పాఠ్యపుస్తకాలు ఇదే అంశాన్ని నిస్సందేహంగా నిర్ధారిస్థాయి చూడండి.

12వ తరగతి చరిత్ర పాఠ్యపుస్తకాల్లో ఏ అంశాన్నీ తీసుకున్నా అది ఎప్పుడు జరిగింది. ఏం జరిగింది. ఎలా జరిగింది. ఎందుకు జరిగింది అన్న చర్చకు ఆస్కారం ఉంటుంది. మధ్యయుగాల చరిత్ర అంటే క్రీ.శ. 1200-1800 సంవత్సరాల మధ్య ఉన్న 600 ఏళ్ల చరిత్ర. దీన్ని కుదించాలంటే మధ్యలో 300 ఏళ్ల చరిత్రను తుడిచి పెట్టడం కాదు. సుదీర్ఘంగా ఉన్న ప్రధాన చారిత్రిక అంశాలను సంక్షిప్తీకరించాలి. ఇలా సంక్షిప్తీకరించేటప్పుడు ఏవిధంగా ప్రాధాన్యతగల అంశాలు అనేది నిర్ధారించాల్సిన బాధ్యత చరిత్రకారులికే వదిలిపెట్టాలి.

అంతే తప్ప ఇవాళ యన్.సి.ఇ.ఆర్.టి చరిత్ర పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాల తొలగింపు తీరుచూస్తే ఇంతకు మించిన మతిమాలిన పని వేరొకటి ఉండదు అని పిస్తుంది. యన్.సి.ఇ.ఆర్.టి పాల్పడిన ఈ చర్య చరిత్ర పాఠ్యపుస్తకాలను మరింత ప్రామాణికంగా తీర్చిదిద్దడానికి మాత్రం కాదు. కేవలం 'పై' నుండి వచ్చిన ఆదేశాల మేరకు చేపట్టిన చర్చ అని ఇట్టే బోధపడుతుంది. మనదేశ విద్యావ్యవస్థ మేధోస్వాంతత్ర్యానికి ఎలాంటి గతి పట్టిందో చూశారా?!

**పాఠ్యపుస్తకాల మూలాలు**

ఇంతకీ ఇప్పుడు తొలగించబడుతున్న చరిత్ర పాఠ్యాంశాలు ఎవరి చరిత్రలు, ఏ చరిత్రకారులు రాసినవి? ప్రస్తుతం ఉన్న చరిత్ర పుస్తకాలు 1960-70 దశకాల కాలంలో రూపొందించినవి. రొమిలా థాపర్, అర్జున్ దేవ్, ఆర్‌యస్ శర్మ, సతీష్ చంద్ర, బిపిన్ చంద్ర మున్నగు చరిత్రకారులు రూపొందించినవి. మొరార్జీదేశాయ్ ప్రభుత్వం ఈ పుస్తకాలను నిషేధించడానికి ప్రయత్నించింది. ఆ ప్రయత్నాలు సఫలం కాకముందే ఆ ప్రభుత్వం ఆయువు తీరిపోయింది.

బిజెపి మొదటి నుండీ 'ఈ చరిత్రకారులు రాసిన పాఠ్యపుస్తకాలు పట్ల తన తీవ్రవ్యతిరేకతలను ఏనాడూ దాచిపెట్టుకోలేదు. ఈ చరిత్రకారులు మార్క్సిస్టులు, వామపక్షవాదులు, భారతదేశ చరిత్రను వక్రీకరించారు' అని ఆరోపించడమే కాకుండా తరచూ అశ్లీల భాషలో నిందకు పూనుకునేవారు. చరిత్రను పుక్కింటి పురాణాలతో కలగాపులగం చేసి అదే సనాతన భారతీయ ఔన్నత్య సంస్కృతి అనే బలమైన నమ్మికతో ఉన్నవారికి హేతువాద దృష్టితో ఉండే చరిత్ర పుస్తకాలు మింగుడు పడకపోవడం వింతకాదనుకోండి. 1999లో

> "ప్రభుత్వాలు మారినప్పుడల్లా పాఠ్యపుస్త కాలను మార్చాలనే తలంపు పరిహాసాస్పదంగా మారిపోయింది. ప్రభుత్వం మారినప్పుడల్లా పాఠ్యపుస్తకాలు మారుస్తూపోతే విద్యార్థుల భవిష్యత్ ఏమవుతుంది? అందుకే 2005లో యుపిఎ ప్రభుత్వానికి మేం ఒక లేఖ రాసాం. పాఠ్యపుస్తకాల రూపకల్పన ప్రభుత్వ నియంత్ర ణలో ఉండడం ఎంత మాత్రం సరికాదు. ఆయా సబ్జెక్టులకు సంబంధించిన నిపుణుల బృందానికి ఆ పని అప్పచెప్పాలి అని డిమండు చేసాం."

బిజెపి కేంద్రంలో అధికారం చేపట్టాక చరిత్ర పుస్తకాలను సంఘపరివార్ భావజాలానికి అనుగుణంగా తిరగరాయడానికి అదే భావజాలానికి చెందిన చరిత్రకారులు అనబడేవారితో ఒక కమిటీ కూడా వేసింది. అయితే 2004లో బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారం కోల్పోవడంతో పాఠ్య పుస్తకాలు వెలుగు చూడలేదు.

కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో అధికారం చేపట్టిన యు.పి.ఏ ప్రభుత్వం చరిత్ర పాఠ్యపుస్తకాలు రాసి 40 ఏళ్లు దాటిన మూలాన వాటిని నవీనీకరించే దానికి ఉపక్ర మించింది. సెట్-2 పుస్తకాలను రూపొందిం చేపనిని కూడా యన్.సి.ఇ.ఆర్.టి కోసం గతంలో చరిత్ర పాఠ్యపుస్తకాలను రూపొందించిన చరిత్రకారులకే అప్పగించింది. వాళ్ళు ఆ పని నూతన ఒరవడితో పూర్తి చేశారు. సంఘపరివార్ ఈ చరిత్రకారుల మీద మార్క్సిస్టు చరిత్రకారులు అని ముద్ర వేసినప్పటికీ వీళ్ళు రూపొందించిన పాఠ్యపుస్తకాలు సరైన దృక్పథంతో ఉన్నాయని వృత్తిగత చరిత్రకారులు ఎందరో నిర్ధారించారు. ఈ సెట్-2 పుస్తకాలను ప్రస్తుత ప్రభుత్వం నిరాకరిస్తుంది. కానీ ఆ చరిత్రకారులు ఎవరనేది పేరెత్తకుండా మిన్నకుండిపోయింది. అంటే ఈ ప్రభుత్వం పనిగట్టుకుని విమర్శిస్తూ అభాసు పాల్జేయ్యాలని చూస్తుంది. సెట్ -1 రాసిన చరిత్రకారులనేది స్పష్టం అవుతుంది. అయితే ఇవి గత రెండు దశాబ్దాలుగా వినియోగంలో లేవు అదీగాక ఈ పాఠ్యపుస్తకాలు రూపొందించిన ఐదుగురు చరిత్రకారులలో నలుగురు మరణించి ఉన్నారు. మిగిలిన ఒక్కరూ (రొమిల్లా థాపర్) మందిమి వయసులో ఉన్నారు.

ప్రభుత్వాలు మారినపుడల్లా పాఠ్యపుస్త కాలను మార్చాలనే తలంపు పరిహాసాస్పదంగా మారిపోయింది. ప్రభుత్వం మారినపుడల్లా పాఠ్యపుస్తకాలు మారుస్తూపోతే విద్యార్థుల భవిష్యత్ ఏమవుతుంది? అందుకే 2005లో యుపిఎ ప్రభుత్వానికి మేం ఒక లేఖ రాసాం. పాఠ్యపుస్తకాల రూపకల్పన ప్రభుత్వ నియంత్ర ణలో ఉండడం ఎంత మాత్రం సరికాదు. ఆయా సబ్జెక్టులకు సంబంధించిన నిపుణుల బృందానికి ఆ పని అప్పచెప్పాలి అని డిమండు చేసాం. ప్రస్తుతం ప్రభుత్వం కొన్ని సబ్జెక్టులకు ఎంపిక చేసిన నిపుణుల బృందాన్ని పరిశీలిస్తే వీరి కన్నా గతంలో పనిచేసిన నిపుణులు వందరెట్లు మెరుగయిన వారు అని ఎవరైనా అంగీకరిస్తారు. ఏ సబ్జెక్టుకి చెందిన పాఠ్య పుస్తకం రూపొందించాలన్నా ఆ సబ్జెక్టు మీద బాగా పట్టుఉండి బోధనా విధానం మీద లోతైన అవగాహన కలిగి ఉండినవారయి ఉండాలి అని యుపిఎ ప్రభుత్వానికి స్పష్టం చేసాం. కాని మా ఉత్తరాలు, ఉత్తరాల మీద ప్రభుత్వానికి ఎటువంటి స్పందన లేకుండా పోయింది. మా విజ్ఞప్తిని అంగీకరించడానికి ఏ రాజకీయ పార్టీ కూడా సిద్ధంగా లేదు. ఈ రాజకీయ పార్టీలకు యువజనం అవసరం - అదీ కేవలం ఓట్లు వేసేవారిగా తప్ప, బుద్ధివికసించే వారిగా కదు. చుట్టూ ఉన్న ప్రపంచాన్నీ అర్థం చేసుకుని ప్రశ్నించగలిగే తత్వాన్ని పొంపొందించే విద్యాశిక్షణ, అందించాల్సిన అవసరం ఉన్నవారిగా రాజకీయపార్టీలు పరిగణించడం లేదు. సరైన, శాస్త్రీయమైన విద్య అందిస్తే వీళ్ళు రేపటి రోజున బాధ్యతాయుతమైన పౌరులుగా ఏదిగి తమ అధికారాన్ని తమ విధానాలను ఎక్కడ ప్రశ్నిస్తారో అని భయం ఈపార్టీలకి. విద్య అంటే పరీక్షలు, ప్రశ్నావళి అధ్యయనాలుగా మార్చేస్తున్నారు. భావిపౌరులతో స్వతంత్ర్యం ఆలోచనలకు తోవ లేకుండా చేస్తున్నారు.

ఏ తరగతి విద్యకయినా సిలబస్ రూపొందించడం ఎంతటి సంక్లిష్టమైన ప్రక్రియో, ఎంత కాలం గడపాలో సామాన్యుల ఊహకు అందదు. యన్.సి.ఇ.ఆర్.టి సెట్-1 పాఠ్యపుస్తకాలు రూపొందించడానికి ఆ పుస్తక రచయితలుగా, మేం ప్రతి అంశం మీదా, ప్రతి అధ్యాయం మీద ఎంతటి లోతయిన చర్చలు నడిపామో, ఎంత శ్రమకు ఓర్చామో, అది ఎంతటి సుదీర్ఘ ప్రక్రియో ఇప్పుడు తలచుకున్నా చాలు ఆశ్చర్యం కలుగుతుంది. ప్రతి అంశాన్ని సాక్ష్యాల ఆధారంగా చర్చించి వడపోసాం. చరిత్రలో ప్రతిఘటన వెనుక ఉన్న నేపథ్యాన్ని, తదనంతర పరిణామాలను, చరిత్రలో ఆ ఘటన తీవ్ర గురించి సవివరంగా, కూలంకుషంగా అధ్యయనం చేసి పాఠ్యపుస్త కాల్లో పొందుపరిచాం. ఆయా ఘటనలను, భిన్న కోణాల్లో ఆలోచించి మరీ నిర్ధారించాం. ప్రతి అధ్యాయాన్ని రుపొందించకోవడానికి ఇంతటి సంక్లిష్టమైన ప్రక్రియను అను సరించాం.

**తొలగించిన భాగాల ప్రాధాన్యత**

యన్.సి.ఇ.ఆర్.టి సెట్-2 పాఠ్యపుస్త కాల తయారీలో కూడా అదే తరహా ప్రక్రియను అలవంబించాం. అంతే లోతుగా విశ్లేషణ గాత్మకంగా ప్రతి అంశాన్నీ, అధ్యాయాన్నీ చర్చించాం. చరిత్ర పాఠాలను నవీకరించాం. అందుకు కూడా అదే ప్రక్రియను అవలంబించాం. పాఠ్యాంశంగా ఏ విషయాన్ని తొలగించాలన్నా, అదనంగా చేర్చాలన్నా ఇదేక్రమాన్ని అనుసరించాం. ఈ చర్చను కేవలం కమిటీ సభ్యులకే పరిమితం చెయ్యకుండా సబ్జెక్టు మీద నిష్ణాతులైన వారిని కొంతమందిని కూడా ఇందులో భాగం చేసాం. అయితే ప్రస్తుతం యన్.సి.ఇ.ఆర్.టి ఏ పాఠ్యాంశాలను, పాఠ్యభాగాలను తొలగించిందో, అలా తొలగించే క్రమంలో ఈ పద్ధతులు ఏవీ పాటించలేదు. పాఠ్యంశాల తొలగింపు యన్.సి.ఇ.ఆర్.టి ప్రతినిధులు బహిరంగంగా ప్రకటించిన ఏకైక కారణం - కోవిడ్ అనంతర కాలంలో పిల్లలపై చదువుల భారం తగ్గించాలనే ఉద్దేశ్యం అనే కానీ పునరుక్తాల పేరిట 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఉన్న పాఠ్యపుస్తకాల్లో భాగాల తొలగింపుకు ఈ కారణం వర్తించదే. ఎందుకంటే 6వ తరగతిలో చెప్పే పాఠానికి, పదవ తరగతిలో చెప్పే పాఠానికి చాలా తేడా ఉంటుంది. అదీగాక ఇప్పుడు తొలగించబడిన పాఠ్యాంశాలు గానీ, అధ్యాయాలకు గానీ చారిత్రక ప్రాముఖ్యత ఉంది. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకుంటే పాఠ్యభాగాల తొలగింపుకు అసలు కారణం వేరే ఉంది. అది కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ చరిత్రను ఏ దృష్టితో వక్రీకరించి చూస్తుందో ఆ దృష్టికోణానికి తిగిన విధంగా

ఈ తొలగింపుల ప్రక్రియ జరిగిందని స్పష్టమవుతుంది. నిజంగానే విద్యార్థుల మీద చదువుల భారాన్ని తగ్గించడమే యన్.సి.ఇ.ఆర్.టి అసలు ఉద్దేశ్యం అయి ఉంటే ఇలా తొలగింపుల ద్వారా కాకుండా సిలబస్‌ను పునర్మించే ప్రక్రియ చేపట్టి ఉండేది.

12వ తరగతి చరిత్ర పాఠాలు రెండు విభాగాలుగా ఉంది. ఇందులో మొదటి భాగంలో ఎలాంటి మార్పులు చెయ్యలేదు గానీ రెండవ భాగంలో ఏకంగా 30 పేజీల అధ్యాయాన్ని తొలగించింది. 16,17 శతాబ్దాలలో మొఘలుల పరిపాలనలో న్యాయస్థానాలు అన్న అధ్యాయం ఇది. 8వ తరగతి పాఠ్యపుస్తకంలో ఇందుకు సంబంధించిన సమాచారం ఉంది కాబట్టి 12వ తరగతిలో ఈ అధ్యాయాన్ని తొలగించాం అని యన్.సి.ఇ.ఆర్.టిలు సమర్థించుకుంది. కానీ అసలు వాస్తవం ఏంటంటే ఇవాళ కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీకి సైద్ధాంతికంగానే మొఘలులు పరిపాలన పట్ల తీవ్ర ద్వేషభావం, వక్రీకరణలతో కూడిన అవగాహన ఉంది. మన దేశాన్ని పరిపాలించిన ముస్లిం పాలకులలో మొఘలాయిల పరిపాలన స్వర్ణయుగం లాంటిది. కాబట్టి మొఘలాయిల పాఠాన్ని చరిత్ర నుండి తొలగిస్తే ముస్లిం విద్వేష భావప్రచారానికి ఆదరువు దక్కినట్టే కదా. చరిత్ర పట్ల కనీస అవగాహన లేనివారు మాత్రమే ఇలాంటి దౌర్భాగ్యపు పనికి పూనుకుంటారు.

ఎవరికి ఇష్టం ఉన్నా లేకపోయినా, నచ్చినా నచ్చకపోయినా 16,17 శతాబ్దాల బహుళ సంస్కృతి, బహు ముఖమైన సామాజిక తరగతులు, పటిష్టమైన ఆర్థిక వ్యవస్థలతో విలసిల్లాయి అనేది కఠోర సత్యం. ఆ కాలంలో హిందూ, జైన అరబ్బు వ్యాపార వర్గాలు, వాణిజ్యంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లి వాణిజ్య వ్యవస్థను పటిష్ట స్థాయిలో నిలిచాయి. భూ నియమాలు వ్యాపార వర్గాల మధ్య ఉన్న స్నేహం ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలకు దోహదం చేసింది. మొఘలుల కాలంలో అత్యద్భుత శిల్ప స్థాయిలో నిర్మాణాలు, కట్టడాలు వెలిసాయి. రాజాస్థానంలో అత్యద్భుత చిత్రకళ వెల్లివిరిసింది. అనూష్య స్థాయిలో పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. ఇవాళ్ళ అన్య మతస్తుల మధ్య వివాహాలను లవ్-జిహాద్ పేరిట తీవ్ర నేరంగా ప్రచారం చేస్తున్నారు కానీ మొఘలుల కాలంలో హిందూ రాజ్‌పుత్, అమ్మాయిలు, ముస్లిం అబ్బాయిలు మధ్య వివాహాలు అతి సర్వసాధారణమైన విషయంగా కొనసాగింది. మొఘలుల పరిపాలనలో రాజపుత్రులు అత్యున్నత పదువులను అలంకరించారు. భారతావనిని పరిపాలించిన రాజరికంల్లో మొఘలుల పరిపాలనకు ఇతర రాజుల పరిపాలనకు మధ్య ఉన్న ఈ తేడాను ఈ దేశప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నదా, లేదా?

> “మొఘలుల పరిపాలనా కాలంలో మాతాచారాలు, భావాలలో కూడా పెనుమార్పులు సంభవించాయి. అవి ఇప్పటికీ హిందూ మత విశ్వాసాలలో, ఆరాధనలలో కొనసాగుతున్నాయి. హిందూ మతాన్ని భక్తి ఉద్యమం ఉచ్ఛస్థితికి తీసుకువెళ్ళింది ఈ కాలంలోనే. సూఫీలు హిందూ సాధు సింతుల మధ్యన ఆసక్తికరమైన చర్చలు నడిచాయి.”

మొఘలుల పరిపాలనా కాలంలో మాతాచారాలు, భావాలలో కూడా పెనుమార్పులు సంభవించాయి. అవి ఇప్పటికీ హిందూ మత విశ్వాసాలలో, ఆరాధనలలో కొనసాగుతున్నాయి. హిందూ మతాన్ని భక్తి ఉద్యమం ఉచ్ఛస్థితికి తీసుకువెళ్ళింది ఈ కాలంలోనే. సూఫీలు హిందూ సాధు సింతుల మధ్యన ఆసక్తికరమైన చర్చలు నడిచాయి. హిందీతోపాటు అనేక ఇతర ప్రాంతీయ భాషలలో కూడా అత్యద్భుత సాహిత్యం వెలువడింది. భారతావని వలస పాలకుల చెరలో చిక్కకొక ముందున కాలంలో మేధోవికాసం గొప్పగా జరిగిన కాలం ఏదన్నా ఉందంటే అని మొఘలుల పరిపాలనా కాలమే. హిందూ-ముస్లింలు కలిసి కృష్ణ భక్తి గీతావళిని రచించారు. ఈ రోజుకీ శాస్త్రీయ సంగీత ప్రదర్శనలలో ఈ గీతాలు జనావళిని అలరిస్తున్నాయి. గణితం, గ్రహశాస్త్రం, వైద్యశాస్త్రాలు యావత్ భారతావనికి విస్తరించడమే కాదు, సరిహద్దుల కావల దేశాలకు కూడా పాకాయి. అలాంటి మొఘలుల చరిత్ర పాఠ్యాన్ని ఏకపక్షంగా తొలగించడం సరైనదేనా?

అంతేకాదు భారతావనికి తగిన న్యాయ శాస్త్రాలు కూడా ఈ కాలంలో రూపొందాయి. అప్పటికే దేశంలో ఉన్న 'ధర్మ శ్నాస్త్రాలు' జనాభాలో కొన్ని కులాలకు చెందిన వారిని నిమ్నకులాలుగా పరిగణిస్తూ వారి పట్ల అంటరాని తనాన్ని పాటించేవారు. ఈ ధర్మ శాస్త్రాల ప్రభావం ఇతర మతాల మీద కూడా పడింది. తత్ఫలితంగానే ముస్లింలలో 'ప్రస్నీ, నందీ,' సిక్కులలో 'యజహబీస్'ల పేరిట నిమ్నతరగతులు ఉనికిలోకి వచ్చాయి. అల్లా దృష్టిలో మనుషులందరూ సమానమే అని ఇస్లాం చెబుతుంది కానీ 'షరియా' చట్టాలు సామాజిక అంతరాలను స్థిరపరిచాయి. ఒకే మతానికి చెందినవారు అయినప్పటికీ ఈ నిమ్నకులాల జనాభా దాదాపు రెండు వేల సంవత్సరాల పాటు వివక్షకు, పీడనకు, గురయ్యారు. ఈ వివరాలతో కూడిన పాఠ్యాంశాలను ఇప్పుడు యన్.సి.ఇ.ఆర్.టి తొలగించింది. ఇందుకు బదులుగా సాధ్యమైన ప్రతి సందర్భంలోనూ ముస్లింలు హిందువులను పీడించారు అన్నపునాది లేని ఆరోపణలను, వక్రీకరణలను పాఠ్యాంశాలలో చొప్పించారు.

### మేధోవ్యతిరేక ఆధిపత్యం

భారతదేశ ఆధునిక చరిత్రను లిఖించేపేరిట బ్రిటీష్ వలస సామ్రాజ్య రచయితలు మనదేశ చరిత్రను వక్రీకరించి 1817లో జేమ్స్ మిల్ చేసినట్లు ద్విజాతి సిద్ధాంతం ఆధారంగా రుపొందించారు. ఈ చరిత్ర పాఠాలనే పరమాద్భుతంగా ప్రచారం చేశారు, కీర్తించారు. అయితే ఆనాడు కొంతమంది దేశభక్తియుత, వలసవాద వ్యతిరేక భారతీయ చరిత్రకారుల ఈ వాదనలను తోసిపుచ్చారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదుల రచించిన చరిత్రను ప్రామాణికంగా పరిశీలించిన మతతత్వవాదులు ముస్లింలకు పాకిస్తాన్ ఏర్పాటు చేస్తే ఇహ మిగిలేది హిందూరాష్ట్ర ఆవిర్భావమే అన్న ధోరణితో ఉన్నారు. పాకిస్తాన్‌లో మెజారిటీగా ఉన్న ముస్లింలు పరిపాలకులయితే మనదేశంలో హిందువులు మెజారిటీ కాబట్టి హిందుమతాధిపత్య పాలన వస్తుంది అని ఆశించారు. బ్రిటిష్ సామ్రాజ్యవాద రచయితల వాదన ఒట్టి చెత్త ఈ రచనలను సున్నిశితంగా విచారించి హేతు బద్ధంగా తర్కించాలి అని వాదించినవాళ్ళను వీళ్ళంతా మెకాలే మానసపుత్రులు అంటూ

> **“ చరిత్రను లిఖించే క్రమంలో జరిగిన పోరాటం మెజారిటీ మత ఆధిపత్య సిద్ధాంతిక భావజాలానికి, వ్యతిరేకంగా జరిగి పోరాటం అని మనం గుర్తించాలి. ఇవాళ మనం ఎదుర్కొంటున్న ప్రమాదం ఇంత తీవ్రమైనది. చరిత్ర పాఠాలు కానీ ఇతరాత్ర సామాజిక శాస్త్రాలను రూపొందించేటపుడుగానీ పాటించాల్సిన పద్ధతులను, విధి విధానాలను, అనుక్రమణికను పూర్తిగా పూర్వపక్షం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ”**

మతతత్వ జాతీయవాదులు విమర్శించారు. విచిత్రం ఏంటంటే అసలు ఈ హిందూ, ముస్లిం మతతత్వ జాతీయవాదులే ద్విజాతి సిద్ధాంతానికి వంత పాడడం ద్వారా పరోక్షంగా బ్రిటీష్ వలసపాలకులకు సమర్థులుగా, మోకాలే మానసపుత్రులాగా తయారయ్యారు అన్న వాస్తవం వాళ్ళు గ్రహించ లేకపోవడం.

చరిత్రను లిఖించే క్రమంలో జరిగిన పోరాటం మెజారిటీ మత ఆధిపత్య సిద్ధాంతిక భావజాలానికి, వ్యతిరేకంగా జరిగి పోరాటం అని మనం గుర్తించాలి. ఇవాళ మనం ఎదుర్కొంటున్న ప్రమాదం ఇంత తీవ్రమైనది. చరిత్ర పాఠాలు కానీ ఇతరాత్ర సామాజిక శాస్త్రాలను రూపొందించేటపుడుగానీ పాటించాల్సిన పద్ధతులను, విధి విధానాలను, అనుక్రమణికను పూర్తిగా పూర్వపక్షం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ పద్ధతులు ఇప్పటికీ భారతీయ మేధోవర్గంలో వేళ్ళూనకోవాల్సిన అవసరం ఎంతైనా కనబడుతుంది. మన భారతీయ సైంటిస్టులు కొందున్నారు – వారి వారి రచనలన్నీ శాస్త్రీయమైన పద్ధతులను అనుసరించి చేసినవే అని చెప్పేనోటితోనే చరిత్ర పాఠాలు రూపొందించడానికి సునిశిత తార్కిక పద్ధతులు, విధివిధానాలు అవసరం లేదని విశ్వసిస్తుంటారు. పతిష్టమైన ఆధారాల అధారంగా రూపొందించిన చరిత్రను 'వక్రీకరించబడిన చరిత్ర' అనో, ఇదంతా వామపక్ష వాదుల ఆలోచనలు అనో తేలిగ్గా కొట్టి పారేస్తుంటారు. చరిత్ర గురించి వీసమెత్తు అవగాహనలేని అజ్ఞానులు ప్రవచించే పుక్కిట పురాణాలనే చరిత్ర అని బలంగా నమ్ముతుంటారు.

యన్.సి.ఇ.ఆర్.టి చరిత్ర పుస్తకాల నుండే కాదు సామాన్య శాస్త్ర పుస్తకాల నుండి కొన్ని పాఠ్యాంశాలను తొలగించింది. డార్విన్ జీవపరిణామవాద సిద్ధాంతం మీద పాఠ్య భాగం మొత్తాన్ని తొలగించింది. ఈ అధ్యాయాన్ని తొలగించేటపుడు ఏ కారణాల రీత్యా దీన్ని తొలగించాల్సి వస్తుంది అనే కనీస చర్చ కూడా చెయ్యలేదు. యన్.సి.ఇ.ఆర్.టి ఇదేదో వామపక్ష ఉదారవాదులకు – మితవాద హిందూ శక్తులకు మధ్య ఉన్న తగాదాగా చూడరాదు. యన్.సి.ఇ.ఆర్.టి ఈ రకంగా శాస్త్రీయ ఆలోచన అనే సూత్రాల ప్రాతిపదికన రూపొందిన సిద్ధాంతాలను కూడా తొలగించకుంటూ పోతే విద్య అంటే అక్షరాలు, అంకెలు నేర్చుకోవడంగా మిగిలిపోతుంది. ఇవాళ ఆధిపత్యం చలాయిస్తున్న పాలక శక్తులు కరడుగట్టిన మేధోవ్యతిరేకులు. చరిత్ర పాఠ్యపుస్తకాలను ఇష్టారాజ్యంగా మార్చేస్తున్న క్రమంలోనే పాతక శక్తుల ఆచారకత్వం బయటపడుతుంది. ఇప్పుడు దేశం ముందున్న సవాలు ఏంటేంటే – మేధావులు, ఆలోచనాపరులు ప్రజాస్వామ్య ప్రియులు, లౌకికవాదులు తిరిగి తమ సత్తానిప్పుడు చాటిచెబుతారు అనేదే. ప్రజాక్షేత్రంలో ఉన్న వ్యక్తులు బహిరంగంగా తప్పుడు ప్రచారాలకు దిగినప్పుడల్లా వారిని నిలదియ్యడం మేధావులు మీద ఉన్న గురుతరు బాధ్యత. సాధారణ ప్రజానీకం అది తప్పుడు ప్రచారం అని తెలిసి కూడా తప్పులెన్నగలిగే స్థితిలోనో, నిలదీసే స్థితిలోనో లేరు. మనం ఇప్పుడుమేధో రాహిత్య కాలంలో జీవిస్తున్నాం. సరైన ఆలోచనల ద్వారా తప్పుడు ప్రచారాలను సవాలు చేసే గుణాన్ని కల్పోతున్నాం.

ఒక పథకం ప్రకారం పాఠ్యాంశాలను తొలగిస్తున్న క్రమంలో అలాంటి చదువులు చదివిన తరం ఎలా తయారవుతుంది అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. మన చదువులు మన దేశ భౌగోళిక పరిధులకు మాత్రవే పరిమితమై ఉంటే విద్యా వాషయకంగా మనం మాత్రమే వెనుకుండిపోతాం. ప్రపంచానికి ఏం తేడా పడదు. కానీ విషయం ఇది కాదు. ప్రపంచవ్యాప్తంగా సైన్సు, మానవీయ శాస్త్రాలు విజ్ఞానపరంగా ధృత వేగంతో అభివృద్ధి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో భారతీయ విద్యార్థులు వక్రీకరించబడుతున్న పాఠాలు నేర్చుకుని బయట ప్రపంచంలో ఎలా నెగ్గుకు రాగలరు. చరిత్ర అంటే మానవజాతి పరిణామక్రమం శాస్త్రం. అందుకే చరిత్ర పఠనం ద్వారా మనం స్పష్టమైన దృక్పథం అలవరుచుకుని, నాణ్యమైన విజ్ఞానం ద్వారా మన జీవితాలను మెరుగుపరుచుకోవాలి.

ఇవాళ కేంద్రంలో అధికారం చాలాయిస్తున్న పాలక శక్తులు తమ రాజకీయ భావజాలానికి అనుగుణంగా చరిత్రలో అనేక పాఠ్యాంశాలను ఏకపక్షంగా తొలగించడం ద్వారా చరిత్రను తుడిచిపెట్టడం అనేది జరిగే పనికాదు. ఆది భారతదేశ చరిత్ర అధ్యయన కేంద్రాలు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో ఉన్నాయి. అనేక మంది మేధావులు, విద్యార్థులు, అధ్యాయనశీలురు మన దేశ చరిత్ర మీద రీసెర్చి చేస్తున్నారు. సరికొత్త విశ్లేషణ పద్ధతుల ద్వారా మనదేశ చరిత్రకు సంబంధించిన మరింత విజ్ఞానాన్ని అందించే కృషిలో నిమగ్నమై ఉన్నారు. ఈ విజ్ఞానం ఒక్కమన దేశంలో తప్ప మిగిలిన ప్రపంచ దేశాలకు అందుబాటులో ఉంటుంది. ఇంత కన్నా వేరే దౌర్భాగ్యం ఉంటుందా? అధికార పక్షం పసుపున యన్.సి.ఇ.ఆర్.టి తొలగించిన చరిత్ర పాఠ్యాంశాలను, పాఠ్యభాగాలను గురించి మనం ఎప్పటికీ తెలుసుకోలేని నిస్సహాయ పరిస్థితిని నెట్టబడతాం.

**ప్రపంచంలో వివిధ దేశాల్లో ఉన్న భారతీయ అధ్యయన కేంద్రాలు**

మన దేశంలో ఉన్న వివిధ సంస్కృతులు ఏమిటి? వాటి ఔన్నత్యం ఏమిటి అనే అంశాలను భారతీయ చరిత్ర సంస్కృతిలో అంతర్భాంగా అధ్యయనం చేస్తాయే తప్ప ఏమతానికి చెందిన పాలకులు పరిపాలనా కాలంలో ఏ అద్భుతాలు సాధించారు అనే సంకుచిత దృష్టిలతో పరిశీలించవు. యూనివర్శిటీలలో లైబ్రరీలలో, మ్యూజియంలలో ఎక్కడికైనా తృతీయ దేశ చరిత్రను ఈ దృష్టితోనే అధ్యయనం చేస్తారు. మన దేశ చరిత్ర ఔన్నత్యం గురించి పరాయి దేశాల్లో తెలిసినంతగా కూడా మన దేశ పౌరులకి తెలియని దుస్థితికి నెట్టబడుతున్నాం మనం. ఇంతకన్నా విషాదం ఏముంటుంది. మన ఘనమైన చారిత్రిక సాంస్కృతిక వారసత్వం మసకబారకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిదీ అని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను.

**(తెలుగు సేత : కె. సత్యంరజన్)**

# సాహిత్య కళారంగాల్లో కృషి



మావో జెడాంగ్

కామ్రేడ్స్, మిమ్మల్ని యివాళ ఈ ఫోరమ్‌కు ఆహ్వానించినది. సాహిత్య కళా రంగాలలో జరిగే కృషికి, సాధారణ విప్లవాదరణకూ గల సంబంధాన్ని పరిశీ లించడానికి గాను అభిప్రాయాలు కలబోసుకోవడానికి. మన లక్ష్యం ఏమిటంటే విప్లవ సాహిత్యమూ, కళలు సరియైన మార్గంలో అభివృద్ధి చెంది, మన జాతీయ శత్రువును నిర్మూలించడంలోనూ, జాతీయ విమోచనోద్యమాన్ని సఫలం చేయడంలోనూ ఇతర విప్లవ కార్యక్రమాలు మరింత ముందు కు తీసుకుపోవడంలోనూ సహకరించేట్లు చూడటం.

మన ప్రజల విముక్తి పోరాటంలో అనేక రంగాలున్నాయి. వాటిలో కలమూ, తుపాకి సంబంధించిన రంగాలు, సాంస్కృతిక, సమరానికి సంబంధించిన రంగాలు వున్నాయి. శత్రువును జయించడానికి మనం ప్రధానంగా తుపాకులు పట్టిన సైన్యం మీదనే ఆధారపడాలి. కాని ఈ సైన్యం ఒకటే చాలదు. మన శ్రేణులను ఐక్యం చేసి శత్రువును ఓడించడానికి మనకు సాంస్కృతిక సైన్యం కూడా అత్యావశ్యకం. మే 4 ఉద్యమం లగాయతు చైనాలో అలాంటి సాంస్కృతిక సైన్యం రూపొంది, చైనా విప్లవానికి సహాయ పడింది. ఇది సామ్రాజ్యవాద దురాక్రమణకు సేవ చేసే ఫ్యూడల్ సంస్కృతి, దళారీ సంస్కృతుల ప్రభావాన్ని క్రమంగా తగ్గించి, బలహీన పరిచింది. ఈ నూతన సంస్కృతిని ప్రతిఘటించడం కోసం చైనాలోని అభివృద్ధి నిరోధకులు ఇప్పుడు సాంస్కృతిక రంగంలో నాణ్యతను మాత్రమే మనకు పోటీ పెట్టగలరు. అంటే ఈ అభివృద్ధి నిరోధకుల దగ్గిర డబ్బున్నది. వాళ్ళు మంచిది ఏమీ సృష్టించలేక పోయినా, శాయశక్తులా మంచి నాణ్యత సృష్టించగలరు.

మే 4 ఉద్యమం మొదలుకొని సాంస్కృతిక రంగంలో సాహిత్యమూ, కళా అతి ముఖ్యమైన, విజయవంతమైన పాత్ర నిర్వహిస్తున్నాయి. పది సంవత్సరాల అంతర్యుద్ధ కాలంలో విప్లవ సాహిత్య, కళా ఉద్యమం ఎంతగానో పెరిగింది. సాంస్కృతికోద్యమం, విప్లవ పోరాటం రెండూ స్థూలంగా ఒకే దిశలో పయనించినా కార్యాచరణలో వీటి మధ్య అనుసంధానం లేకపోయింది. ఎందుకంటే అభివృద్ధి నిరోధకులు వాటి మధ్య సంబంధం లేకుండా చేశారు. అదృష్టవశాత్తు జపాను వ్యతిరేక ప్రతిఘటన యుద్ధం ప్రారంభమైన దగ్గర నుంచీ విప్లవ రచయితలు, కళాకారులు అంతకంతకూ అధిక సంఖ్యలో యేనాన్‌కూ, మన ఇతర జపాన్ వ్యతిరేక స్థావరాలకూ రావటం సాగించారు. అయితే వారు స్థావరాలకు వస్తూనే ఇక్కడి ప్రజలతో అప్పుడే పూర్తిగా మమేకం అయిపోయారని కాదు. మనం విప్లవ కార్యాచరణను చురుకుగా కొనసాగించాలంటే విప్లవకారులు, సాహిత్య ఉద్యమకారులు పూర్తిగా ఏకమై పోవాలి. మనం ఇవాళ సమావేశమైనది కూడా సాహిత్యమూ, కళలు విప్లవ యంత్రంలో అంతర్భాగంగా ఇమిడి, ప్రజలను ఏకం చేయడం కోసం, శత్రువును ప్రతిఘటించి నిర్మూలించడం కోసం శక్తివంతమైన సాధనాలుగా ఉండేటట్టు చూడటానికే. ఈ లక్ష్యం సాధించడం కోసం పరిష్కరించాల్సిన సమస్యలేమిటి? రచయితల, కళాకారుల వర్గ దృక్పథానికి, వారి వైఖరికి, వారి ప్రేక్షకులకు, వారి కృషికి, వారి అధ్యయనానికి సంబంధించినవే ఈ సమస్యలని నేను భావిస్తున్నాను.

**వర్గ దృక్పథం సమస్య :** మనది కార్మిక వర్గ, ప్రజా బాహుళ్య దృక్పథం. దీని తాత్పర్యమేమంటే కమ్యూనిస్టు పార్టీ సభ్యులు పార్టీ దృక్పథానికీ, పార్టీ చైతన్యానికి, పార్టీ విధానానికి కట్టుబడి ఉండాలని. మన సాహిత్యకారుల్లోనూ, కళాకారులలోనూ ఈ సమస్యనుగురించి తప్పుడు అవగాహన కలవాళ్ళూ, స్పష్టమైన అవగాహన లేనివాళ్ళూ ఇంకా ఎవరైనా ఉన్నారా? ఉన్నారనుకుంటాను. మన కామ్రేడ్లలో చాలామంది తరచుగా సరి అయిన దృక్పథం కలిగి వుండటం లేదు.

**వైఖరి సమస్య :** మనలో కొన్ని నిర్దిష్ట విషయాలను గురించి నిర్దిష్ట వైఖరులు వర్గ దృక్పథం నుంచే పుట్టుకొస్తాయి. ఉదాహరణకు పొగడటమా? దోషాలు బయటపెట్టడమా? ఏది అవసరమైన వైఖరి? రెండూ కావాలంటాను. ఎవరి పట్ల నన్నదే ప్రశ్న. మూడు రకాల వ్యక్తులున్నారు. శత్రువులూ, ఐక్యసంఘటనకు చెందిన మన మిత్రులు, మనవాళ్ళూనూ. మన వాళ్ళంటే ప్రజా బాహుళ్యమూ, వారి నాయకులు. ఈ మూడు రకాల వ్యక్తుల పట్లా మనం భిన్న వైఖరులు అవలంబించడం అవసరం. శత్రువుల పట్ల అంటే జపాన్ సామ్రాజ్యవాదులు, తదితర ప్రజా శత్రవులు పట్ల విప్లవ రచయితలూ, కళాకారులూ పాటించవలసిన కర్తవ్యం ఏమిటంటే, వారి వంచననూ, క్రౌర్యాన్ని బయటపెట్టాలి. వారి పతనం అనివార్యమని చూపి, వారి పతనం కోసం ఏకదీక్షతో పట్టుదలగా పోరాడటానికి జపాను వ్యతిరేక సైన్యాలనూ, ప్రజలనూ ప్రోత్సహించాలి. ఐక్య సంఘటనలో చేరిన మన వివిధ మిత్రుల పట్ల మన వైఖరిలో మైత్రి, విమర్శ రెండూ వుండాలి. మైత్రిలోనూ, విమర్శలోనూ వైవిధ్యం ఉండాలి. జపానును ప్రతిఘటిస్తున్నందుకూ, విజయాలు సాధిస్తున్నందుకూ మనం వారిని సమర్థిస్తాం,

> "శ్రామికులూ, గ్రామాలలో ఉండే కర్షకులూ.. అందరూ అక్షరాస్యత లభించగానే పుస్తకాలూ, పత్రికలూ చదవాలనుకుంటారు. అక్షరాస్యులు కానివారు నాటకాలనూ, సంగీత నాటకాలనూ చూడాలనుకుంటారు. బొమ్మలు, చిత్రాలు చూడగోరు తారు. పాడాలనీ, సంగీతం వినాలనీ అనుకుంటారు. మన రచనలకూ, కళా వస్తువులకూ వారే ప్రేక్షకులు."

మెచ్చుకుంటాం. కాని వారు చురుకుగా ప్రతిఘటన పోరాటం సాగించక పోతే విమ ర్శించాలి. ఎవరైనా కమ్యూనిస్టు పార్టీని వ్యతిరే కించి, వ్యతిరేక మార్గంలో దిగజారి పోతుంటే వాళ్ళను మనం గట్టిగా ఎదు ర్కొంటాం.

ఇక ప్రజాబాహుళ్యమూ, ప్రజల శ్రమ, పోరాటాలు, ప్రజాసైన్యం, పార్టీ ...వీటి విషయానికి వస్తే మనం వీటిని విధిగా మెచ్చు కోవాలి. ప్రజలలో లోపాలుండవని కాదు. కార్మికుల్లో చాలామందికి పెటీ బూర్జువా భావాలు పోవు. రైతులకూ, నగరవాసులైన పెటీ బూర్జువాలకూ తిరోగమన భావాలుం టాయి. వీటి వల్ల వారి పోరాటం కుంటు పడుతుంది. మనం ఓపిక వహించి, వారు ఈ బరువును దించేసుకుని, తమ లోపాలను తామే సరిచేసుకుని, చురుకుగా ముందుకు సాగేటట్టు తోడ్పడటానికి వారికి దీర్ఘకాల శిక్షణ ఇవ్వాలి. వారు పోరాటం ద్వారా సంస్కారం పొందితే, లేదా పొందుతుంటే మన సాహిత్య మూ, కళలూ ఈ పరిణామాన్ని చిత్రించాలి. తప్పుదోవనే అంటిపెట్టుకొని ఉండాలన్న పట్టుదల వారిలో లేనంతకాలమూ మనం వారి లోపాలను ప్రస్తావిస్తూ వారిని అవహేళన చేయడం తప్పు. వారి పట్ల శత్రుభావం ప్రదర్శించడం మరింత తప్పు. వారు ఏకం కావడానికీ, పురోగమించడానికీ ఏకదీక్షతో ముందుకు సాగటానికీ, తిరోగమన లక్షణాలను విడనాడి విప్లవ లక్షణాలను అభివృద్ధి చేసుకోవ డానికీ మన రచనలు తోడ్పడాలి. అందుకు విరుద్ధంగా ఉండటం ఏమాత్రమూ కూడదు.

**ప్రేక్షకుల సమస్య :** ప్రేక్షకుల సమస్య అంటే, మన రచనలూ, కళలు ఎవరి కోసం సృష్టిస్తున్నామో ఆ ప్రజల సమస్య, షెన్సీ – కాన్సూ – నింగ్సియా సరిహద్దు ప్రాంతం లోనూ, ఉత్తర, మధ్య చైనా ప్రాంతాలలోని జపాన్ వ్యతిరేక స్థావరాలలోనూ ఈ సమస్య ఉంది. ఇది కొమింటాంగ్ ప్రాంతాలలో ఉ ండిన దానికి భిన్నంగా ఉంటుంది. ప్రతిఘటన యుద్ధం ముందుకాలంలో షాంఘైలో ఉన్న సమస్యకు భిన్నంగా ఉంటుందీ సమస్య. షాంఘై దశలో విప్లవ సాహిత్యమూ, కళలూ విద్యార్థులనూ, ఆఫీసు గుమస్తాలనూ, దుకాణాల గుమస్తాలనూ ఆకర్షించించాయి. ఒక వర్గాన్ని ప్రతిఘటించే యుద్ధం ఆరంభ మైన తరువాత కొమింటాంగ్ ప్రాంతాలలో వీటి చేత ఆకర్షించబడినవారు ఇంకా ఎక్కువయ్యారు. కాని వారందరూ ముందు చెప్పినవారి వంటివారే. ఎందుకంటే అక్కడి ప్రభుత్వం_శ్రామికులకూ, కర్షకులకూ, సైనికులకూ విప్లవ సాహిత్యమూ, కళా అందుబాటులోకి రాకుండా చేసింది. మన స్థావరాలలోని పరిస్థితి చాలా భిన్నమైనది. ఇక్కడ సాహిత్యానికీ, కళకూ శ్రామికులు, కర్షకులూ, సైనికులే ప్రేక్షకులు. విప్లవ కేడర్లూ, స్థావరాలలో విద్యార్థులు కూడా వీరిలో వున్నారు. కాని వీరు పాతతరం విద్యార్థుల వంటి వారు కాదు. వారు కేడర్లు, లేదా కేడర్లుగా ఎదిగే వారు. అన్ని రకాల కేడర్లు, విప్లవ సైన్యంలో ఉండే యోధులూ, ఫ్యాక్టరీలలో ఉండే శ్రామికులూ, గ్రామాలలో ఉండే కర్షకులూ.. అందరూ అక్షరాస్యత లభించగానే పుస్తకాలూ, పత్రికలూ చదవాలను కుంటారు. అక్షరాస్యులు కానివారు నాటకా లనూ, సంగీత నాటకాలనూ చూడాలను కుంటారు. బొమ్మలు, చిత్రాలు చూడగోరు తారు. పాడాలనీ, సంగీతం వినాలనీ అనుకుం టారు. మన రచనలకూ, కళా వస్తువులకూ వారే ప్రేక్షకులు.

అచ్చంగా కేడర్లనే తీసుకోండి. వారు అల్ప సంఖ్యాకులనుకోవద్దు. కొమింటాంగ్ ప్రాంతాలలో ప్రచురించే పుస్తకాల పాఠకుల సంఖ్య కన్నా వీరిది చాలా హెచ్చు. అక్కడ పుస్తకాలు 2,000 కాపీలు మాత్రమే ముద్రణ అవుతాయి. మూడు ముద్రణలు కలిపితే 6,000 మాత్రమే అవుతాయి. కాని మన స్థావరాలలో ఉండే కేడర్లను తీసుకుంటే, ఒక్క యేనాన్‌లోనే పుస్తకాలు చదివేవారు 10,000 మంది ఉన్నారు. అంతేగాక, వారిలో చాలామంది చాలాకాలంగా కాకలు తీరిన విప్లవకారులు, దేశంలోని అనేక ప్రాంతాల నుండి వచ్చినవారు, అనేక ప్రాంతాలలో పనిచేయడానికి వెళ్ళేవారు. అందుచేత వారి విద్యాభివృద్ధి అత్యంతావశ్యకం. ఇందుకుగాను మన సాహిత్యకారులూ, కళాకారులూ చక్కగా కృషి చేయాలి.

మన సాహిత్యానికీ, కళకూ ప్రేక్షకులు శ్రామికులూ, కర్షకులూ, సైనికులూ, వారి లీడర్లూ కనుక వారిని అర్థం చేసుకోవడమూ, పరిచయం చేసుకోవడమూ అన్న సమస్య ఏర్పడుతుంది. వారిని అర్థం చేసుకోవడానికి, బాగా తెలుసుకోవడానికి పార్టీలోనూ, ప్రభుత్వ శాఖలలోనూ, గ్రామాలలోనూ, ఫ్యాక్టరీలలోనూ, ఎనిమిదవ రూట్, న్యూఫోర్త్ సేనలలోనూ ఉండే రకరకాల ప్రజలనూ, విషయాలనూ బాగా అర్థం చేసుకుని, పరిచయం చేసుకోవడానికి ఎంతో కృషి జరగాలి. మన రచయితలకు రచనా వ్యాసంగమూ, కళాకారులకు కళా వ్యాసంగమూ ఉన్నప్పటికీ, వారి ప్రథమ కర్తవ్యం మనుషులను అర్థం చేసుకోవటమూ, వారిని బాగా ఎరగట మూనూ.

ఈ విషయంలో మన రచయితలూ, కళాకారులూ ప్రస్తుతం ఏ స్థితిలో ఉన్నారు? వారికి విజ్ఞానమూ, గ్రహణ శక్తి లోపించి ఉ న్నదని నేను భావిస్తున్నాను.. వారు "అవకాశం వస్తే తమ ప్రతాపం చూపడానికి సిద్ధంగా ఉన్న వీరుల్లా"గా ఉన్నారు. జ్ఞానం లోపించ దమంటే ఏమిటి? ప్రజలను గురించి తెలుసు కోకపోవడం. మన రచయితలకూ, కళాకా రులకూ తాము వర్ణించే వారిని గురించి కానీ, తమ ప్రేక్షకులను గురించి గానీ సరి అయిన జ్ఞానం లేదు. వారికి శ్రామికుల గురించి గానీ, కర్షకుల గురించి గానీ, సైనికుల గురించి గానీ ఎక్కువగా తెలియదు.. నాయకుల గురించి కూడ బాగా తెలియదు.

ప్రేక్షకులను అర్థం చేసుకోకపోవడ మంటే ఏమిటి? భాషను అర్థం చేసుకోకపోవటం. అంటే ప్రజల సుసంపన్న మైనటువంటి, సజీవమైనటువంటి భాషను అర్థం చేసుకోకపోవటం. చాలామంది రచయి తలూ, కళాకారులూ ప్రజలకు ఎడంగా ఉండటం వల్లా, డొల్లగా జీవించడం వల్లా, వారికి ప్రజల భాషతో పరిచయం లేదు. ఆ కారణంగా వారి

రచనలలోని భాష చప్పగా ఉండటమే గాక, వాటిలో వారు స్వయంగా సృష్టించుకున్న విలక్షణమైన నుడికారాలు ప్రజల నుడికారాలకు విరుద్ధంగా కూడా ఉంటాయి. చాలామంది కామ్రేడ్‌లు “ప్రజల భాష” గురించి ఇష్టంగా మాట్లాడతారు. ఆ మాటకు నిజమైన అర్ధమేమిటి? మన రచయితల, కళాకారుల ఆలోచనలూ, భావాలు ప్రజా బాహుళ్యమైన శ్రామిక, కర్షక, సైనికుల ఆలోచనలతోనూ, భావాలతోనూ ఐక్యరూపం పొందాలని అర్థం. ఈ ఐక్యం సాధించడానికి వాళ్ళు చిత్తశుద్ధితో ప్రజల భాష నేర్చుకోవాలి. మీకు ప్రజల భాషే చాలావరకు అవగాహన కానప్పుడు, మీరు సాహిత్య సృష్టి గురించీ, కళాసృష్టి గురించీ ఎలా మాట్లాడగలరు? “తన ప్రతాపం ప్రదర్శించే అవకాశం లేని వీరుడు” అంటే మీరు పోగుచేసిన మహత్తర సత్యాలు ప్రజలకు అవగాహన కావన్నమాట. మీరు ప్రజల ముందు ఆరితేరినట్లు వాలకం ప్రదర్శించి, “మహానాయకుడి” పాత్ర నిర్వహించ యత్నించిన కొద్దీ, ప్రజలకు అలాటి సరుకు (మహత్తర సత్యాలు) అందించిన కొద్దీ, ప్రజలు దాన్ని స్వీకరించే అవకాశం తగ్గిపోతుంది. ప్రజలు మిమ్మల్ని అర్థం చేసుకోవాలంటే, మీరు ప్రజల మనుషులు కావాలంటే, మీరు దీర్ఘకాలం పాటు కష్టానికి ఓర్చి, ఆరితేరడానికి సిద్ధపడాలి.

“ చాలామంది కామ్రేడ్‌లు “ప్రజల భాష” గురించి ఇష్టంగా మాట్లాడతారు. ఆ మాటకు నిజమైన అర్ధమేమిటి? మన రచయితల, కళాకారుల ఆలోచనలూ, భావాలు ప్రజా బాహుళ్యమైన శ్రామిక, కర్షక, సైనికుల ఆలోచనలతోనూ, భావాలతోనూ ఐక్యరూపం పొందాలని అర్థం. ఈ ఐక్యం సాధించడానికి వాళ్ళు చిత్తశుద్ధితో ప్రజల భాష నేర్చుకోవాలి. మీకు ప్రజల భాషే చాలావరకు అవగాహన కానప్పుడు, మీరు సాహిత్య సృష్టి గురించీ, కళాసృష్టి గురించీ ఎలా మాట్లాడగలరు? ”

ఈ సందర్భంలో నా భావాలు ఎలా మారినదీ వివరించ దలచుకున్నాను. నేను విద్యార్థిగా జీవితం ప్రారంభించి, స్కూలులో విద్యార్థి లక్షణాలు అలవరచుకున్నాను. అప్పుడు నేను, నాతోటి విద్యార్థులు చూస్తూ ఉండగా నా సొంత సామాను మోయటం లాంటి చిన్న పనులు చేయడం కూడా నామోషీ అనుకునేవాణ్ణి. వారికి భుజాల మీద గానీ, చేతిలో పట్టుకుని గానీ ఏదీ మోయడం సాధ్యమయ్యేదికాదు. ఆ కాలంలో మేధావులు మాత్రమే ప్రపంచంలో నిర్మలమైన వాళ్ళని అనుకునేవాణ్ణి. వారితో పోల్చితే శ్రామికులూ, కర్షకులూ మురికివాళ్లు అనిపించేవారు. ఇతర మేధావులు పరిశుభ్రంగా వుంటారనే నమ్మకంతో వారి దుస్తులు ధరించడానికి నాకు అభ్యంతరం ఉండేదికాదు. కానీ శ్రామికులూ, కర్షకులూ అపరిశుభ్రంగా ఉంటారనుకొని వారి దుస్తులు ధరించేవాణ్ణికాను. అయితే నేను విప్లవకారుణ్ణయి, శ్రామికులతోను, కర్షకులతోను, విప్లవ సైనికులతోనూ కలిసి జీవించడం ప్రారంభించాక క్రమంగా నేను వారిని బాగా అర్థం చేసుకున్నాను. క్రమంగా వారు కూడా నన్ను అర్థం చేసుకున్నారు. అప్పుడే, అప్పుడు మాత్రమే నాకు బూర్జువా స్కూలులో అలవడిన బూర్జువా, పెటీ బూర్జువా భావాలు క్రమంగా మారాయి. శ్రామికులతోనూ, కర్షకులతోనూ పోల్చితే సంస్కారం పొందని మేధావులు శుద్ధమైనవాళ్ళు కారనీ, ఆ మాటకు వస్తే, అందరికన్నా శుద్ధమైన వాళ్ళు శ్రామికులు, కర్షకులు మాత్రమేననీ, వారి చేతులకు మట్టి ఉన్నప్పటికీ, వారి కాళ్ళకు పేడ అంటుకున్నప్పటికీ, వారు పెటీ బూర్జువా, బూర్జువా మేధావుల కన్నా చాలా శుద్ధమైనవాళ్ళనీ నేను భావించ గలిగాను. భావ పరివర్తన అంటే ఒక వర్గం నుంచి మరొక వర్గానికి మారడం. మేధావి వర్గం నుంచి వచ్చిన మన రచయితలూ, కళాకారులూ తమ కృషిని ప్రజా బాహుళ్యానికి ఆదరించాలనుకున్నట్టయితే వారు మారి, తమ ఆలోచనలనూ, భావాలనూ సంస్కరించుకోవాలి. అలాంటి మార్పు, సంస్కరణ లేక పునర్నిర్మాణం (రీమౌల్డింగ్) లేకుండా వారు నెగ్గలేరు, ప్రజల భాషతో అతకలేరు.

**చివరి సమస్య అధ్యయనం:** అంటే మార్క్సిజం – లెనినిజాన్ని అధ్యయనం చేయడం. అలానే సమాజాన్నీ అధ్యయనం చేయడం. తనను తాను విప్లవ మార్క్సిస్టు రచయిత అనుకునేవాడూ, ప్రత్యేకించి కమ్యూనిస్టు పార్టీలో సభ్యుడుగా ఉండిన రచయిత మార్క్సిజం – లెనినిజం గురించి తప్పక పరిజ్ఞానం కలిగి వుండాలి. అయితే, ప్రస్తుతం కొందరు కామ్రేడ్‌లకు మార్క్సిజం మూలసూత్రాలే తెలియవు. ఉదాహరణకు, “స్థితి” (బీయింగ్) నుంచి “మతి” (కాన్సెషియనెస్) నిర్ణయమవుతుందనీ, వర్గ సంఘర్షణ, జాతీయ పోరాటాల (భౌతిక వాస్తవికతల) నుంచి మన ఆలోచనలూ, భావాలూ పుడతాయన్నది మార్క్సిస్టు మూలసూత్రం. కానీ కొందరు కామ్రేడ్‌లు దీన్ని తలకిందులు చేసి, “ప్రేమ” సమస్తాన్నీ నిర్ణయించాలంటారు. ప్రేమ మాటకు వస్తే, వర్గ సమాజంలో వర్గ ప్రేమ మాత్రమే వుంటుంది. కాని ఈ కామ్రేడ్‌లు కోరేది వర్గాతీతమైన ప్రేమ, ఊహాత్మక ప్రేమ, ఊహాత్మక స్వాతంత్ర్యమూ, ఊహాత్మక సత్యము, ఊహాత్మక మానవ స్వభావమూ వగైరా కూడాను. దీన్ని బట్టి వారిపై బూర్జువా ప్రభావం ఎంత బలంగా ఉన్నదీ తెలుస్తుంది. వారు ఈ ప్రభావాన్ని పూర్తిగా వదిలించుకుని, వినయంతో మార్క్సిజం – లెనినిజం అధ్య యనం చేయాలి. రచయితలూ, కళాకారులూ రచనా సృష్టినీ, కళాసృష్టినీ అధ్యయనం చేయడం సబబే. కానీ విప్లవకారులైన వారందరూ మార్క్సిజం – లెనినిజం శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి. రచయితలకూ, కళాకారులకూ మినహాయింపు లేదు. రచయితలూ, కళాకారులూ సమాజాన్ని అధ్యయనం చెయ్యాలి. అంటే సమాజంలోని వివిధ వర్గాలనూ, వాటి మధ్య సంబంధాలనూ, వాటి వాటి పరిస్థితులనూ, వాటి భౌతిక, మానసిక రూపాలనూ అధ్యయనం చేయాలి. ఇవన్నీ కరతలామలకమైన తరువాతనే మనకు పుష్టికరమైనటువంటి, సరైన దృక్పథం కలిగినటువంటి సాహిత్యం, కళలు లభ్య మవుతాయి.

ఇవాళ నేనీ సమస్యలన్నిటినీ ప్రస్తావన రూపంలో ప్రతిపాదిస్తున్నాను. మీరందరూ వీటిని గురించీ, ఇతర అనుబంధ సమస్యలను గురించి మీ అభిప్రాయాలు తెలియజేస్తారనీ ఆశిస్తున్నాను. ❋

ఈ మాసం ప్రత్యేకం

# 'అమృతకాలం'లో ఆకలి రాజ్యం



రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటర్

ఎస్. వెంకట్రావు

**భా**రత దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి, చైనా ఉత్పత్తిలో సగమే ఉంది. అయినా చైనా ఎందుకు పెద్ద ఎత్తున ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకుంటున్నది, దానిలో సగమే ఉత్పత్తి చేస్తున్న భారత దేశం ఎందుకని పెద్ద ఎత్తున ఆహార ధాన్యాలు ఎగుమతి చేయ గలుగుతున్నది?

భారత్, చైనా రెంటి జనాభా దాదాపు సమానమే. వాస్తవానికి ఇటీవలనే భారత దేశం జనాభాలో చైనాను మించిపోయింది. రెండు దేశాల జనాభా దాదాపు 140 కోట్లు. కానీ ఆహారోత్పత్తిలో చూసుకుంటే భారత దేశం చైనా ఆహార ధాన్యాల్లో సగమే ఉత్పత్తి చేస్తోంది. కానీ భారత దేశం ఏటేటా మరింత ఎక్కువ మొత్తంలో ఆహార ధాన్యాలను ఎగుమతి చేస్తుంటే, చైనా ఏటేటా మరింత ఎక్కువ మొత్తంలో ధాన్యాలను దిగుమతి చేసు కుంటున్నది. కారణమేమిటి? చైనాతో సమా నమైన జనాభా ఉన్న భారత దేశం ఆహార ధాన్యాలను ఎలా ఎగుమతి చేయగలుగు తున్నది, చైనా ప్రపంచంలో అవకాశం ఉన్న అన్ని ప్రాంతాల నుండి ఆహార ధాన్యాలు ఎందుకు దిగుమతి చేసుకుంటున్నది?

2022లో భారత దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 32.2 కోట్ల టన్నులు. అందు లో దాదాపు 2.23 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలను విదేశాలకు ఎగుమతి చేస్తోంది. ఇది ప్రపంచంలో ఆహార ధాన్యాలు ఎగుమతి చేసే నాలుగు ప్రధాన దేశాలైన థాయ్‌లాండ్, వియత్నాం, పాకిస్తాన్, అమెరికాల ఎగుమతుల మొత్తాన్ని మించిపోయింది. కానీ విచిత్రంగా భారత దేశం ఆకలి స్థాయి 29.4 స్కోరుతో మొత్తం 121 దేశాల్లో 107వ స్థానాన్ని ఆక్రమిస్తోంది. ఇది చాలా తీవ్రమైన ఆకలి స్థాయి కింద లెక్క. అంటే భారత ప్రజలు తీవ్రమైన ఆకలితో అలమటిస్తున్నారన్నమాట.

భారత దేశంలో తలసరి ఆహార ఉత్పత్తి ఏడాదికి 222 కిలోగ్రాములు. (మొత్తం వార్షిక ధాన్యం ఉత్పత్తిని జనాభాతో భాగిస్తే వచ్చేది). ప్రపంచ ఆహార ధాన్యాల తలసరి వార్షిక ఉత్పత్తి 400 కిలో గ్రాములు. దీనికన్నా భారత దేశంలో తలసరి ఆహారోత్పత్తి చాలా తక్కువగా ఉన్నదన్న విషయం అర్థమవుతూనే ఉంది.

అంటే ఒక వైపు దేశం ప్రపంచంలోనే అత్యధికంగా ధాన్యాలను ఎగుమతి చేస్తోంది, మరోవైపు దేశంలోని ప్రజలకు రెండుపూటలా తినడానికి సరిపడ్డా ఆహారం లేదు. దేశ ప్రజలు కడుపునిండా తినడానికి ఆహారం లేకపోయినా భారత దేశం పెద్ద ఎత్తున ఆహా రాన్ని ఎగుమతి చేస్తున్నది. పైగా ఎగుమతుల్లో తాము గొప్ప ప్రగతి సాధించామని నరేంద్ర మోడీ ప్రభుత్వ డబ్బా కొట్టుకుంటున్నది.

దేశం గొప్పగా అభివృద్ధి సాధించినట్లు కాషాయ పాలకులు చెబుతున్నప్పటికీ ఇప్పటికీ మనది వ్యవసాయ ప్రధాన దేశమే. నూటికి 80 మంది ప్రజలు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపైనే ఆధారపడి బ్రతుకు తున్నారు. దేశ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవ సాయం వాటా ఇప్పటికీ 20 శాతంగా ఉంది. 58 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి బ్రతుకుతున్నారు.

ఆత్మనిర్భర్ భారత్ అనీ, మేక్ ఇన్ ఇండియా అని మోడీ ప్రభుత్వం ఎన్ని దీర్ఘాలు తీస్తున్నా మన దేశంలో పారిశ్రామికోత్పత్తి చాలా బలహీనంగా ఉంది. పారిశ్రామి కోత్పత్తుల కోసం ఇప్పటికీ దేశం దిగుమతుల మీదనే ఆధారపడుతోంది. అత్యవసరమైన ఇంధనం, యంత్రాలతోబాటు విలాస వంతమైన కార్లు, ఇతర వస్తువులను కూడా పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటున్నందున దానికి విదేశీ మారక ద్రవ్యం అవసరమవు తోంది. మన పారిశ్రామిక ఎగుమతులు, విదేశాల్లోని భారతీయులు పంపించే విదేశీ మారక ద్రవ్యంతో బాటు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున రుణాలు కూడా తీసుకుంటున్నది. అయినా దేశంలోని విదేశీ మారక నిల్వలు సరిపోవడం లేదా?

దేశంలో విదేశీ మారక నిల్వలు పెరుగుతున్నట్లు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా చూపెడుతోంది. ఈ ఏడాది నవంబర్ 17తో ముగిసే వారంలో దేశంలో విదేశీ మారక నిల్వలు 507 కోట్ల డాలర్లు పెరిగి మొత్తం 59,540 కోట్ల డాలర్లకు చేరుకున్నట్లు ఆర్‌బిఐ తెలిపింది.

విదేశీ మారక నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆహారాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నది. ఏ దేశమైనా ప్రజలకు తినగా మిగిలిన ఆహారాన్ని ఎగుమతి చేస్తుంది. ఆహార ధాన్యాలు ఎగుమతి చేసే దేశాలన్నీ అలాగే చేస్తున్నాయి. కానీ భారత దేశంలో ప్రజలు తీవ్రమైన ఆకలితో బాధపడుతుంటే మరోవైపు మోడీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే రేషన్ బియ్యాన్ని కూడా తగ్గించి వాటిని కూడా విదేశాలకు ఎగుమతి చేస్తోంది.

విచిత్రమేమంటే దేశంలో జనాభా పెగుతున్నప్పటికీ, గత కొన్నేళ్లుగా ఆహారోత్పత్తి పెద్దగా పెరగకపోయినా, కొన్ని సంవత్సరాల్లో తగ్గుదల చూపినా ఎగుమతులను మాత్రం ఏమాత్రం తగ్గించకుండా కొనసాగిస్తున్నది.

ప్రపంచంలోనే అత్యంత ఆకలిగొన్న ప్రజలున్న భారత దేశం వ్యవసాయోత్పత్తుల ఎగుమతుల్లో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. 2022-23 సంవత్సరంలో భారత దేశం 5,250 కోట్ల డాలర్ల (సుమారు 4.35 లక్షల

> చైనా జనాభాకు సమానమైన జనాభా ఉండి, చైనా పంటభూమి కన్నా ఎక్కువ పంటభూమి ఉన్న భారత దేశం చైనా పండించే ఆహారంలో సగం మాత్రమే పండించడం ఒక ఎత్తయితే, ప్రపంచ తలసరి ఆహారోత్పత్తి కన్నా చాలా ఎక్కువ పండిస్తున్న చైనా ఆహారాన్ని దిగుమతి చేసుకుంటుంటే ప్రపంచ తలసరి ఉత్పత్తి కన్నా చాలా తక్కువ ఉత్పత్తి అవుతున్న భారత దేశం విదేశాలకు ఏటా కోట్ల టన్నుల ఆహారాన్ని ఎలా ఎగుమతి చేయగలుగుతున్నది?

కోట్ల రూపాయల) ఆహారాన్ని విదేశా లకు ఎగుమతి చేసింది. అంతకు ముందు ఏడాది (2021-22) ఎగుమతి చేసిన 5,020 కోట్ల డాలర్ల కన్నా ఇది 230 కోట్ల డాలర్ల అధికం. 202-21 ఏడాదితో పోలిస్తే ఇది 20 శాతం అధికం.

2021-22లో మోడీ ప్రభుత్వం దేశం నుండి 967 కోట్ల డాలర్ల (సుమారు 80,000 కోట్ల రూపాయల) వరి ధాన్యాన్ని ఎగుమతి చేయగా 2022-23కి దాన్ని 1,114 కోట్ల డాలర్లకు (సుమారు 93, 000 కోట్ల రూపాయలకు) పెంచేసింది. దేశం నుండి ఎగుమతి అవుతున్న ఆహారోత్పత్తుల్లో వరి ధాన్యానిదే అగ్రస్థానం. మొత్తం ఆహార ఎగుమతుల్లో ఇది 19 శాతం ఆక్రమిస్తోంది. 2021-22 సంవత్సరంలో 210 కోట్ల డాలర్ల (17,500 కోట్ల రూపాయల) గోదుమను విదేశాలకు ఎగుమతి చేసింది.

భారత దేశంలో 32.8 లక్షల చదరపు కిలోమీటర్ల భూభాగం ఉంది. అందులో 15.64 కోట్ల హెక్టార్ల అంటే 52 శాతం నేలపై పంటలు పండిస్తోంది. ప్రపంచంలో పంటలు పండే నేల గల దేశాల్లో అమెరికా తరువాత భారత్‌ది రెండవ స్థానం. అమెరికా 15.8 కోట్ల హెక్టార్లలో పంటలు పండి స్తోంది. దీన్ని బట్టి భారత దేశంలో బంగారు పంటలు పండే నేల అధికంగా ఉందని అర్థమవుతుంది.

మరోవైపు చైనాలో పంటలు పండే నేల భారత దేశం కన్నా చాలా తక్కువ. అయినప్పటికీ చైనాలో ఆహారోత్పత్తి భారత్ కన్నా చాలా అధికంగా ఉంది. చైనాలో 2022లో 68.6 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయ్యాయి. అక్కడ తలసరి ఆహారోత్పత్తి ఏడాదికి 483 కిలో గ్రాములు. ప్రపంచ తలసరి ఆహార ధాన్యాల వార్షిక ఉత్పత్తి 400 కిలో గ్రాముల కన్నా ఇది ఎక్కువే. అయినా చైనా 2022వ సంవత్సరంలో 14.7 కోట్ల టన్నుల ఆహారాన్ని దిగుమతి చేసుకున్నది. ఇందులో ప్రపంచంలోని 184 దేశాలు, ప్రాంతాల నుండి 2,000 కోట్ల డాలర్ల ఆహార పదార్థాలను దిగుమతి చేసుకోవడం ద్వారా అది ప్రపంచంలోనే అతి పెద్ద ఆహారం దిగుమతి దేశంగా మారింది. గోదుమ, వరి పంటలో చైనా స్వయం సమృద్ధి సాధించినప్పటికీ సోయాబీన్స్, మొక్కజొన్నను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. వీటిని మనుషులు తినడమే కాకుండా మాంసం ఉత్పత్తి పెంచడానికి కూడా ఉపయోగిస్తారు.

మరి చైనా జనాభాకు సమానమైన జనాభా ఉండి, చైనా పంటభూమి కన్నా ఎక్కువ పంటభూమి ఉన్న భారత దేశం చైనా పండించే ఆహారంలో సగం మాత్రమే పండించడం ఒక ఎత్తయితే, ప్రపంచ తలసరి ఆహారోత్పత్తి కన్నా చాలా ఎక్కువ పండిస్తున్న చైనా ఆహారాన్ని దిగుమతి చేసుకుంటుంటే ప్రపంచ తలసరి ఉత్పత్తి కన్నా చాలా తక్కువ ఉత్పత్తి అవుతున్న భారత దేశం విదేశాలకు ఏటా కోట్ల టన్నుల ఆహారాన్ని ఎలా ఎగుమతి చేయగలుగుతున్నది?

మోడీ సర్కారు ప్రజలను ఆకలితో మాడ్చి ఆహారాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నది. ఈ విషయాన్ని ప్రపంచ ఆకలి సూచీ (గ్లోబల్ హంగర్ ఇండెక్స్-జిహెచ్ఐ) స్పష్టంగా చెబుతున్నది. 2023వ సంవత్సరం ప్రపంచ ఆకలి సూచీ ప్రకారం ఆకలితో అలమటించే ప్రజలున్న 125 దేశాలలో భారత్ 111వ స్థానం ఆక్రమిస్తోంది. ప్రపంచ వ్యాపితంగానూ, ఆయా ప్రాంతాల్లోనూ ప్రజల్లో ఆకలి స్థాయి ఎలా ఉన్నదో గత రెండు దశాబ్దాలుగా జిహెచ్ఐ కొలుస్తున్నది. ఆ విధంగా ప్రజల ఆకలి కేకలను ఆయా ప్రభుత్వాలు వినిపించుకునేట్లు చేయడమే ఈ సంస్థ లక్ష్యం.

ప్రపంచ వ్యాపితంగా అందరూ ఆమోదించిన కొన్ని పరామితులను బట్టి జిహెచ్ఐ ఆకలి సూచీని తయారు చేస్తుంది. దీని కోసం ఐక్య రాజ్య సమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ, యునిసెఫ్, ప్రపంచ బ్యాంకు వంటి ప్రపంచ సంస్థలు సేకరించిన గణాంకాలను ఉపయోగించుకుంటుంది. ఈ వివరాల ప్రకారం ప్రపంచ ఆకలి సూచీలో పెట్టడానికి అర్హత పొందిన 136 దేశాల్లో 11 దేశాలను సరైన వివరాలు ఇవ్వనందున పక్కన పెట్టేసి, మిగిలిన 125 దేశాలతో గత రెండు దశాబ్దాలుగా ఆకలి సూచీ తయారు చేస్తున్నారు. జిహెచ్ఐ ప్రధానంగా నాలుగు అంశాలను కొలమానంగా తీసుకుని ఆకలి సూచీని తయారు చేస్తుంది. 1. పౌష్టికాహార లోపం (తగినన్ని కాలరీల ఆహారం తీసుకోని జనాభా శాతం). 2. ఎదుగుదల కుంచించుకుపోయిన పిల్లలు (అయిదేళ్ల లోపు పిల్లల్లో పౌష్టికాహార లోపం వల్ల వయసుకు తగ్గ ఎత్తు ఎదగని పిల్లల శాతం) 3. బరువు పెరగని పిల్లలు (పౌష్టికాహార లోపం వల్ల బరువు పెరగని అయిదేళ్ల లోపు పిల్లల శాతం) 4. శిశు మరణాల రేటు (అయిదేళ్ల లోపు చనిపోతున్న పిల్లల శాతం),

2015 వరకు ప్రపంచ వ్యాపితంగా క్రమంగా తగ్గుతూ వచ్చిన ఆకలి ఆ తరువాత పెరుగుతున్నదని 2023 ప్రపంచ ఆకలి సూచీ వెల్లడించింది. ముఖ్యంగా ప్రపంచ జనాభాలో 42 శాతంగా ఉన్న యువత కూడా క్షుద్బాధకు గురియవుతున్నారని నివేదిక తెలిపింది. ప్రపంచంలో దక్షిణాసియా, సహారా దిగువ ఆఫ్రికా ప్రాంతాల్లో ఆకలి అధికంగా ఉందని తెలిపింది. మొత్తం 43 దేశాల ప్రజలు అతి తీవ్రమైన క్షుద్బాధను అనుభవిస్తున్నారని వెల్లడించింది.

భారత దేశంలో ఆకలి "తీవ్ర" స్థాయిలో ఉందని ఆకలి సూచీ తెలిపింది. అంటే తక్కువ కన్నా దిగువ స్థాయిలో ఉందని అర్థం. ఇంకా చెప్పాలంటే ప్రమాదకర, తీవ్ర ప్రమాదకర స్థాయికన్నా కాస్త నయంగానే ఉందని సూచీ వివరించింది. 2015తో పోలిస్తే 2023 నాటికి పౌష్టికాహార లోపం పెరిగింది. శిశు మరణాలు ఈ కాలంలో కొంత తగ్గినప్పటికీ ఇంకా హెచ్చు స్థాయిలోనే ఉన్నాయి. భారత దేశంతో సహా అన్ని దేశాలూ ఇచ్చే గణాంకాల నుండి ఆహార బ్యాలెన్స్ షీట్‌లు తయారు చేసి వాటి నుండి తలసరి

" **ఇటీవలి కాలంలో మానవాభివృద్ధి సూచీలో కూడా భారత స్థానం దిగజారిన విషయం విదితమే. 2021లో భారత దేశ మానవాభివృద్ధి సూచీ 0.633 ఉంది. దీని ప్రకారం మొత్తం 191 దేశాల్లో భారత్ 132వ స్థానాన్ని ఆక్రమిస్తోంది. ఈ విషయంలో దక్షిణాసియాలోని అనేక దేశాలు మానవాభివృద్ధిలో భారత్ కన్నా మెరుగైన స్థాయిలో ఉన్నాయి.** "

ఆహార లభ్యతను కొలుస్తుంది. దాని ఆధారంగా పౌష్టికాహార లోపాన్ని నిర్ణయి స్తుంది. అదే విధంగా ఆయా ప్రభుత్వాలు రూపొందించే వినియోగ సర్వే గణాంకాల ఆధారంగా ప్రజలకు రోజుకు ఎన్ని కాలరీల ఆహారం లభ్యమవుతున్నదో అంచనా వేస్తుంది.

అయితే జిహెచ్ఐ నివేదికలో భారత దేశం గురించి ఇచ్చిన సమాచారం సరికాదని మోడీ ప్రభుత్వం అభ్యంతరం తెలుపుతోంది. భారత ప్రభుత్వ పౌష్టికాహారం గణాంకాలను సరిగ్గా తీసుకోకుండా లెక్కలు వేయడం వల్ల ఆకలి సూచీలో భారత స్థితి దిగజారినట్లు కనిపిస్తున్నదని ప్రభుత్వం పేర్కొంది. అయితే గత రెండు దశాబ్దాలుగా తాము అనుసరిస్తున్న అంచనాల పద్ధతిని భారత దేశం తప్ప ఏ దేశమూ అభ్యంతర పెట్టలేదనీ, తాము ఆయా ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు ఇచ్చిన గణాంకాల ఆధారంగానే ఈ సూచీని తయారు చేశామని జిహెచ్ఐ వర్గాలు తెలిపాయి.

నిజానికి ఆకలి సూచీనే కాదు భారత దేశంలో పేదరికానికి సంబంధించి అనేక అంతర్జాతీయ సంస్థలు ఇచ్చిన నివేదికలను మోడీ ప్రభుత్వం విమర్శించడమో, అభ్యంతర పెట్టడమో జరుగుతున్నది. ఇటీవలి కాలంలో మానవాభివృద్ధి సూచీలో కూడా భారత స్థానం దిగజారిన విషయం విదితమే. 2021లో భారత దేశ మానవాభివృద్ధి సూచీ 0.633 ఉంది. (1 ఉంటే పూర్తిస్థాయి మానవాభివృద్ధి ఉన్నట్లు లెక్క) దీని ప్రకారం మొత్తం 191 దేశాల్లో భారత్ 132వ స్థానాన్ని ఆక్రమి స్తోంది. ఈ విషయంలో దక్షిణాసియాలోని అనేక దేశాలు మానవాభివృద్ధిలో భారత్ కన్నా మెరుగైన స్థాయిలో ఉన్నాయి. ఉదాహరణకు 0.782 పాయింట్‌తో శ్రీలంక 75 స్థానంలోనూ, 0.747 పాయింట్‌తో మాల్దీవులు 97వ స్థానంలోనూ, 0.666 పాయింట్‌తో భూటాన్ 125వ స్థానంలోనూ, 0.661 పాయింట్లతో బంగ్లాదేశ్ 128వ స్థానం లోనూ మన కన్నా మెరుగైన స్థానంలో ఉండగా నేపాల్, పాకిస్తాన్‌లు మనకన్నా కింది స్థాయిలో ఉన్నాయి. అలాగే మానవ సంతోషజీవన సూచీ (హాపీనెస్ ఇండెక్స్)లో కూడా 2022లో మొత్తం 150 దేశాల్లో భారత్ 126వ స్థానంలో ఉంది. ఈ విషయంలో కూడా దక్షిణాసియా పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, భూటాన్, పాకిస్తాన్, నేపాల్‌లు భారత్ కన్నా మెరుగైన స్థానంలో ఉన్నాయి. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పత్రికా స్వేచ్ఛా సూచీలో కూడా భారత దేశం పరిస్థితి ఘోరంగా దిగజారిపోయింది. 2023లో మొత్తం 180 దేశాల్లో భారత ర్యాంకు 161కి పడిపోయింది. 2022లో 150 స్థానం నుండి ఇది గణనీయంగా పడిపోయింది. నిజానికి మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండీ పత్రికా స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపుతుండడంతో ఈ సూచీలో భారత స్థానం పడిపోతూనే వస్తోంది. సరిహద్దులు లేని రిపోర్టర్లు (రిపో ర్టర్స్ వితవుట్ బోర్డర్స్) అనే సంస్థ ప్రతి ఏడాదీ మే 3, ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినాన ఈ నివేదికను విడుదల చేస్తుంది. ఈ సూచీలో నూటికి 36.62 పాయింట్లతో భారత దేశం 150వ స్థానానికి దిగజారిపోవడం ఒక ఎత్తయితే ఇందులో కూడా విలేకరులకు రక్షణ విభాగంలో దాన్ని స్థానం మరింగా 172వ స్థానానికి పడిపోవడం అందోళన కలిగించే అంశం

'భారత్ వెలిగి పోతున్నది', 'అచ్చే దిన్ ఆయేగా', 'విశ్వ గురు', ప్రపంచంలో అత్యధిక జిడిపి గల దేశాల్లో అయిదో స్థానంలో భారత్, 2028 నాటికి (అంటే 2024లో మోడీ విజయం సాధించి మూడో దఫా అధికారంలోకి వస్తే, ఆ టెర్మ్ పూర్తయ్యే నాటికి) భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో మూడో స్థానంలోకి వస్తుంది... వంటి భుజ కీర్తులు తగిలించుకుంటున్న మోడీ ప్రభుత్వానికి ప్రజల జీవన స్థితిగతుల గురించి అంతర్జాతీయ సంస్థలు ఒక్కొక్కటిగా వెల్లడిస్తున్న ఈ వాస్తవాలు జీర్ణం కావడం లేదు. అందుకే అది ఆ నివేదికలనే తప్పుపట్టడం, లేకుంటే విస్మరించడం చేస్తున్నది. వాటిని విమర్శించే, లేక ప్రజలకు వాటి సమాచారాన్ని నిష్పక్షపాతంగా అందించే మీడియా పీక నొక్కడానికి ప్రయత్నిస్తున్నది.

అయినా మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన ప్రచార హోరులో ప్రజల జీవన ప్రమాణాలు ఎంతగా దిగజారి పోతున్నాయో వివిధ సంస్థలు అందించే నివేదికలు తెలియజేస్తూనే ఉన్నాయి. అంతే కాదు ఇటీవల ఆయన భారత ప్రజలకు మరో అయిదేళ్ల పాటు (అధికారంలో ఉంటే) అయిదు కిలోల ఉచిత బియ్యం అంద జేస్తానని ప్రకటించారు. మరి ప్రపంచంలోనే అభివృద్ధిలో మూడో స్థానంలోకి వెళుతున్న భారత దేశంలో ప్రజలకు ఉచిత బియ్యం ఇస్తేనే గానీ పూట గడవని పరిస్థితి ఎందు కొచ్చింది? గత పదేళ్ల మోడీ పాలన అంత చక్కగా ఉంటే దేశ ప్రజలకు మరో అయిదేళ్లు 'మోడీ గ్యారంటీ' ఉచిత బియ్యం అవసరం ఎందుకొచ్చింది? అని అనేక మంది విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.

ఇటీవల బీహార్ ప్రభుత్వం చేసిన కుల గణన కూడా మన దేశంలో పేదరికం ఎంత తీవ్ర స్థాయిలో ఉందో వెల్లడిస్తోంది. ఈ సర్వే ప్రకారం బీహార్‌లో 34.1 శాతం ప్రజానీకపు కుటుంబ నెలవారీ ఆదాయం రూ.6,000 కన్నా తక్కువగానే ఉంది. కేంద్ర ప్రభుత్వం పెట్టిన ప్రమాణం ప్రకారం నెలకు రూ.6,000 కన్నా తక్కువ ఆదాయం వస్తున్న కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్టు లెక్క. 2022-23 సంవత్సరానికి ఒక పెద్ద రాష్ట్రం అయిన బీహార్‌లో ఏకంగా 34 శాతం జనాభా దారిద్ర్యంలో మగ్గుతున్నా రంటే అది ఎంత తీవ్రమైన విషయం! ఒకవైపు ప్రభుత్వ అధికార ప్రతినిధులేమో దేశంలో జిడిపి వృద్ధిరేటు పెరుగుతూ వుంటే చాలునని, దాని వల్లనే అన్ని ఆర్థిక సమ స్యలూ తీరిపోతాయని తెగ చెప్పుకుంటు న్నారు. పైగా త్వరలోనే మన దేశ జిడిపి 5 లక్షల కోట్ల డాలర్లకు చేరబోతోందని అదే సర్వరోగ నివారిణి ఔతుందని పదే పదే డబ్బా కొట్టుకుంటున్నారు. కాని ఈ ప్రచారం ఎంత పనికి మాలినదో బీహార్ సర్వే వెల్లడించింది. బీహార్ సర్వే ఫలితాలనే దేశం

> **"దేశంలో నేడు అమృత కాలం వచ్చిన వారు అనేక మంది ఉన్నారు. వారు మోడీ ప్రభుత్వం ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాల వల్ల లాభం పొందిన అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లు. చివరికి మోడీ తన కార్పొరేట్ మిత్రుల బొజ్జలు నింపడం కోసం ఈ దేశ ప్రజలు తినే ఆహారాన్ని కూడా విదేశాలకు అమ్మేస్తూ ప్రజలను తీవ్రమైన ఆకలి మంటలకు గురిచేస్తున్నారు. ఇదీ మోడీ 'అమృత కాలపు' అసలు స్వరూపం."**



దేశంలోని పల్లెలు, పట్టణ మురికి వాడలు ఎక్కడ చూసినా ఈ ఆకలి రాజ్యం మనకు కనబడుతుంది.

మొత్తానికి గనుక వర్తిస్తే దేశంలో మూడింట రెండొంతుల జనాభా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్టు భావించాలి.

ఇంకో విషయం... మోడీ అధికారంలో వచ్చిన వెంటనే, మహాత్మా గాధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ 'రెగా') కాంగ్రెస్ వైఫల్యానికి నిదర్శనమని పెద్ద ప్రకటన ఇచ్చారు. దాని వల్ల ఆర్థికాభివృద్ధి జరగలేదు, ఉపాధి లభించ లేదు, ఆదాయాలు పెరగలేదు అన్నారు. కానీ ఈ రోజు 'రెగా' పథకానికి బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో 93 శాతం ఆర్థిక సంవత్సరం తొలి ఆరుమాసాల్లోనే ఖర్చయి పోయాయి. డిమాండును బట్టి ఈ పథకానికి ఖర్చు చేయాల్సి ఉంటుంది కాబట్టి బడ్జెట్‌లో కేటాయించిన 60,000 వేల కోట్ల రూపాయలకన్నా ఎక్కువే వెచ్చించాల్సి ఉంటుంది. గ్రామీణ పేదరికం ఏ స్థాయిలో ఉందో ఈ పరిస్థితి మన కళ్లకు కట్టడం లేదూ? పదేళ్ల 'మోడీనామిక్స్' వైఫల్యానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి?

దేశంలో రోజురోజుకీ పెరిగిపోతున్న నిరుద్యోగం కథ కూడా మనకు ఇదే విషయాన్ని తెలియజేస్తున్నది. 2022 జులై నుండి 2023 జులై మధ్య కార్మిక శక్తి సర్వే నివేదికను గణాంకాల విభాగం ఇటీవలనే విడుదల చేసింది. ఆర్థిక వ్యవస్థలో ఉపాది పొందిన వారి సంఖ్య దాదాపు 50 కోట్లు కాగా వారిలో సగానికిపైగా రోడ్డుపైడు వ్యాపారాలు చేస్తూ, గృహ సంబంధ సేవల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ స్వయం ఉపాధి పొందిన వారే ఉన్నారు. మొత్తం పనిచేసే వారిలో 2017-18 సంవత్సంలో ఈ విధంగా స్వయం ఉపాధి పొందిన వారి సంఖ్య 52 శాతం ఉండగా 2022-23 నాటికి అది 58 శాతానికి పెరిగిపోయింది. ఇది వస్తూత్పత్తి, ఇతర సంఘటిత రంగంలో ఉపాధి తగ్గిపోవడాన్ని సూచిస్తుంది. స్వయం ఉపాధి రంగంలో కూడా జీతాలు లేని చాకిరీ చేసేవారి సంఖ్య అంటే కుటుంబ వ్యాపా రాల్లో సహాయకులుగా ఉండడం వంటి పనులు చేసేవారి సంఖ్య 2017-18లో 4 కోట్ల మంది నుండి 2022-23 నాటికి 9.5 కోట్లకు పెరిగిపోయిందని ఆర్థిక వేత్త సంతోష్ మల్హోత్రా తెలిపారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) ప్రమాణాల ప్రకారం ఇటువంటి వేతనం లేని చాకిరీ చేసేవారిని ఉద్యోగులుగా పరిగణించరు. 2017-18 నుండి 2022-23 మధ్య సగటు నెలసరి వేతనాలు 20 శాతం తగ్గిపోయినట్లు కార్మిక శక్తి సర్వే వెల్లడించింది. స్వయం ఉపాధి పొందేవారు, అసంఘటిత రంగంలో పని చేసేవారి నిజవేతనాలు కూడా ఈ కాలంలో తగ్గిపోయినట్లు తెలిపింది.

గత అయిదేళ్లలో సగటు వేతనంలో పెరుగుదల లేకపోవడం అనేది ఉద్యోగాల నాణ్యత తగ్గిపోవడాన్ని సూచిస్తోంది. మనం రోడ్డుమీద వెళ్లేటప్పుడు ఏ ఆటోవాలను, లేక కారు డ్రైవరు లేక ఇతర స్వయం ఉపాధి పొందుతున్న వాళ్లను అడిగినా వాళ్లు... ధరలు పెరిగిపోతున్నాయి గానీ మా ఆదాయాలు పెరగడం లేదు అనే చెబుతారు.

ఇప్పటికే తీవ్రంగా ఉన్న ఆర్థిక అసమానతలు రోజురోజుకూ మరింత తీవ్రతరమవుతున్న తరుణంలో పట్టణ, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోలు శక్తి తగ్గిపోవడం వల్ల పారిశ్రామిక వస్తువుల గిరాకీ తగ్గిపోవడమే కాదు ప్రజలు ఆహారాన్ని కూడా కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్నారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల, ముఖ్యంగా ఆహార ధరలు ఆకాశాన్ని అంటుతుంటే మరోవైపు జనాభాలోని క్రింది 80 శాతం ప్రజల నిజ వేతనాలు తగ్గిపోతున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో నరేంద్ర మోడీ "అమృత కాలం" గురించి మాట్లాడ్డం 80 శాతం ప్రజలకు పుండు మీద కారం చల్లడమే కదా! నిజానికి ఈ దేశంలో నేడు అమృత కాలం వచ్చిన వారు అనేక మంది ఉన్నారు. వారు మోడీ ప్రభుత్వ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాల వల్ల లాభం పొందిన అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లు. చివరికి మోడీ తన కార్పొరేట్ మిత్రుల బొజ్జలు నింపడం కోసం ఈ దేశ ప్రజలు తినే ఆహారాన్ని కూడా విదేశాలకు అమ్మేస్తూ ప్రజలను తీవ్రమైన ఆకలి మంటలకు గురిచేస్తున్నారు. ఇదీ మోడీ 'అమృత కాలపు' అసలు స్వరూపం.

❊

చర్చ

# హిందూయిజం అంటే ఏమిటి?

సిబి జయమోహన్



రచయిత హిందూ తత్వవేత్త, పండితుడు నిత్య చైతన్య యతి శిష్యుడు.

ఇది దక్షిణ భారతదేశంలో కొన్ని దశాబ్దాల క్రితం ఒక స్కూలు తరగతి గదిలో ఒకానొక కుర్రవాడికి ఎదురైన అనుభవం. ఆ క్లాస్ టీచర్ "మీలో ముస్లిం విద్యార్థులు ఎవరెవరో లేచి నిలబడండి" అని గట్టిగా అడిగింది. మన కుర్రాడు తన పక్కనే కూచున్న అతని ప్రాణ స్నేహితుడు సులేమాన్ లేచి నిలబడడం చూసి తానూ లేచి నిలబడ్డాడు. కాని " నువ్వు కూర్చో" అని టీచర్ ఈ కుర్రాడిని గదమాయించింది. తర్వాత ఆ టీచర్ క్లాసులో క్రైస్తవులు ఎవరో వారంతా నిలబడాలని కోరింది. తన మరో ప్రాణ స్నేహితుడు పీటర్ లేవడం చూసి మన కుర్రాడు మళ్ళీ తానూ నిలబడ్డాడు. అప్పుడు కూడా టీచర్ ఇతడిని కూర్చోమని గట్టిగా చెప్పింది.

చివర్లో "ఇప్పుడు హిందువులంతా లేచి నిలబడండి'' అని టీచర్ ఆదేశించింది. అప్పుడు ఆ బెంచీ లోని పరమేశ్వర అనే వడ్రంగి కుర్రాడు లేచి నిలబడ్డాడు. కాని మన కుర్రాడు లేవలేదు. ఎందుకంటే ఆ పరమేశ్వరతో తానెప్పుడూ ఆడుకోలేదు కదా. అప్పుడు ఆ టీచర్ మన వాడిని ఎర్రగా చూసి "లేచి నిలబడరా గాడిదా ! నువ్వు హిందువువి" అని గట్టిగా అరిచింది.

"అప్పుడైతే నేను మాత్రం గాడిద అన్న పదానికి హిందువు అన్నది ఒక పర్యాయ పదమేమో అనుకున్నాను. కాని నేను గాడిదనైతే కాదు మరి. మరి ఆ టీచర్ నన్ను హిందువుగా ఎలా పరిగణించింది? ఇంటికెళ్ళాక నేను క్లాసులో జరిగింది మా అమ్మతో చెప్పాను. నేను గాడిదను కాదు కదా, అటువంటప్పుడు గాడిదకు పర్యాయపదమైన హిందువు అన్న పదం నాకెలా వర్తిస్తుందని అడిగాను. అప్పుడు మా అమ్మ నువ్వు హిందువువే అని చెప్పింది. నానెత్తిన పిడుగు పడినట్టయింది. అప్పుడు మా అమ్మ ఇంకా ఇలా వివరించింది. హిందువు అంటే అర్థం గాడిద అని కాదు. ఆదివారం నాడు చర్చికి గానీ, శుక్రవారం నాడు మసీదుకి గానీ వెళ్ళకుండా ఉండే మెజారిటీ భారతీయు లందరూ హిందువులు గానే పరిగణించ బడతారని ఆమె చెప్పింది. ఈ సంఘటనను ఆ కుర్రవాడు దశాబ్దాల తర్వాత, **1981** ఆగస్టు **12**న "నాకు సంబంధించి మతం అంటే ఏమిటి ?" అన్న వ్యాసంలో ప్రస్తావించాడు.

అప్పటికే అతగాడి కుతూహలం అతడని తాత్విక శోధనలో చాలా లోతుల్లోకి పోయేలా చేసింది. ఆ తర్వాత అతడు 'నిత్య చైతన్య యతి' అనే పేరుతో హిందూ సన్యాసిగా ప్రసిద్ధికెక్కాడు. ఆధునిక కేరళ చరిత్రలో ప్రతిభావంతుడైన తత్వవేత్తగా, పండితుడిగా అతడు తన ముద్ర వేశాడు.

యతి (**1924-1999**) తత్వశాస్త్రం, ఆధ్యాత్మికత, కళ, సాహిత్యం, మనస్తత్వ శాస్త్రం వగైరా అంశాలమీద ఇంగ్లీషులో, మలయాళంలో దాదాపు **140** గ్రంధాలవరకూ రచించారు. ప్రఖ్యాత నారాయణ గురు స్థాపించిన ఆధ్మాత్మిక సాంప్రదాయ మార్గాన్నే తానూ కొనసాగించాడు. నారాయణగురు మాదిరిగానే ఈయన కూడా కుల వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించాడు. హిందూయిజం అంటే ఆదొక ఏకశిలారూపమైన వ్యవస్థ వంటిది కాదని విశ్వసించాడు. ఒక మతాన్ని విశ్వసించడం లేదా మతానికి దూరంగా ఉండడం అనేదానిని బట్టి ఒక వ్యక్తి ఆధ్యాత్మిక పురోగతి ఆధారపడి వుండదని ఆయన గట్టిగా చెప్పాడు.

ఇటువంటి మహానుభావులు అద్వైత వేదాంతాన్ని అనుసరించారే తప్ప వైదిక సాంప్రదాయాన్ని కాదు. బ్రాహ్మణ నియమ నిష్టలను అధిగమించి విశ్వమానవ సోదరత్వాన్ని ప్రచారం చేశారు. ఇతరుల యెడల సానుభూతితో వ్యవహరించడం నేర్పారు. ఇదే హిందూ జీవన విధానం అని వారు ప్రకటించారు. ఇదే మన భారతీయ సాంప్రదాయపు ప్రధాన ముద్ర అని చెప్పారు.

మనం దీని గురించి ఇప్పుడెందుకు చర్చిస్తున్నాం? హిందూయిజాన్ని సనాతన ధర్మం అనే ఉక్కు చట్రంతో కలిపి వేయాలని, అదే అసలైన వైదిక హిందూ అవగాహన అని రుద్దడానికి చాలా గట్టిగా ప్రయత్నాలు జరుగుతున్న చారిత్రక దశలో మన దేశం ఇప్పుడు ఉంది.

నిత్య చైతన్య యతికి తాను శిష్యుడిని అని సగర్వంగా చెప్పుకునే బి.జయ మోహన్ ఈ విషయం మీద శక్తివంతంగా, కొత్త వెలుగులు ప్రసరించే విధంగా రాసిన వ్యాసం దిగువన ఇస్తున్నాం. "భారతదేశపు పురాతన సద్ జ్ఞాన సాంప్రదాయం ఏకశిలాసదృశం కాదు. అది సంక్లిష్టమైన, బహుళత్వంతో కూడిన విజ్ఞానం. శతాబ్దాలపాటు కొనసాగిన తాత్విక సంవాదాలద్వారా అది సుసంపన్నమైంది. పరస్పరం విరుద్ధంగా ఉండే భావాల నడుమ సంఘర్షణ, సమన్వయం ఆ సంవాదాల స్వభావం."

*(ఫ్రంట్‌లైన్‌లో ప్రచురితమైన ఈ వ్యాసం అందరూ తప్పకుండా చదవదగ్గది.)*

హిందూయిజాన్ని వైదిక మతంతో కలగలిపివేయడం ఒక ప్రమాదకర వక్రీకరణ.

ఈ మధ్య తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మం మీద చేసిన వ్యాఖ్యలను చాలామంది విమర్శించారు. ఐతే వారిలో అత్యధికులకి అసలు వివాదం మతానికి సంబంధించినది కాదనీ, అది తాత్వికతకు, ఆధ్యాత్మికతకు సంబంధించినది అన్న సంగతి తెలిసినట్టు లేదు.

ఆధ్యాత్మికత అని, హిందూ తాత్వికత అని విడివిడిగా చూడడం బదులు నేను సాధారణంగా "హిందూ సద్‌జ్ఞాన (అసలైన జ్ఞాన) సాంప్రదాయం'' అన్న మాటను వాడతాను. మతానికి సంబంధించి

చర్చించేటప్పుడు జ్ఞానం అనేదానికి ఉన్న ప్రాధాన్యతను నొక్కి చెప్పడం నా ఉద్దేశ్యం. హిందూయిజం ఒక ఏకశిలారూపంగా ఉండే వ్యవస్థకాదు. దానికి ఒకే ప్రామాణిక సిద్ధాంతగ్రంధం అంటూ ఏదీ లేదు. అది ఏదో ఒకే కేంద్రీకృత అధికారం కింద కొనసాగేది కాదు. ఇంత వైవిధ్యంతో కూడుకున్న హిందూయిజం మీద ఒకే కేంద్రీకృత అధికారాన్ని సాధించాలని గానీ, ఒకే వ్యాఖ్యానానికి సాధికారత కల్పించాలని గానీ జరిగిన ప్రయత్నాలన్నీ రాజకీయ ప్రయోజనాలరీత్యా ప్రేరేపించబడినవే తప్ప ఆధ్యాత్మిక ప్రయోజనాలకోసం కాదు. ఇటువంటి ప్రయత్నాలు యావత్ హిందూ సద్‌జ్ఞాన సాంప్రదాయాన్ని అనివార్యంగా నాశనం చేయడానికే దారి తీస్తాయి. ఆ సాంప్రదాయాన్ని పరిరక్షించాలని భావించే ప్రతీ ఒక్కరూ అటువంటి ప్రయత్నాలను గట్టిగా ప్రతిఘటించాలి.

మన దేశపు ఆధ్యాత్మిక, తాత్విక చర్చల పట్ల ఏ కాస్త చిన్న అవగాహన ఉన్నా, ఈ చర్చల్లో ఒకవైపు ఉన్నవారిని రెండోవైపు ఉండేవారు శత్రువుల ముతాగా ఎంతమాత్రమూ పరిగణించేవారు కాదన్న సంగతి గ్రహించవచ్చు. తాత్విక వైఖరుల విషయంలో పరస్పర వ్యతిరేకత ఉండవచ్చు కాని అవతలి పక్షపు నోళ్ళు మూయించాల్సిందేనన్న ధోరణికి ఆస్కారం లేదు.

భారతదేశపు పురాతన సద్‌జ్ఞాన సాంప్రదాయం కూడా ఏకశిలాసదృశం కాదు. అది ఒక సంక్లిష్టమైన, బహుళత్వం కలిగిన జ్ఞానరూపం. అది రూపొందడం వెనుక శతాబ్దాలపాటు తీవ్రంగా కొనసాగిన తాత్విక సంవాదాలు ఉన్నాయి. పరస్పరం విరుద్ధమైన భావాలను సమన్వయం చేయడానికి 'పూర్వపక్షం–సిద్ధాంతం' అనే ప్రక్రియను ఉపయోగించారు. జీవితానికి సంబంధించిన మౌలిక ప్రశ్నలచుట్టూ ఆ సంవాదాలన్నీ నడిచాయి. కాబట్టి ఆ ప్రక్రియ బహుశా ఎప్పటికీ ఆగదు. అదే విధంగా ఆ సాంప్రదాయం కూడా కొనసాగుతుంది. నిరంతరం పెంపొందుతూవుంటుంది. వివిధ దృక్పధాలు, ఆచారాలు పరస్పరం సంపర్కం చెందే క్రమంలోనే, ఒకదానినొకటి పక్కకు నెట్టే ప్రయత్నాలలోనే నిజమైన జ్ఞానాన్వేషి తాత్విక–ఆధ్యాత్మిక శోధనలో కొత్త వెలుగులను దర్శిస్తాడు.

భిన్న భావాలను పరస్పరం ఇచ్చి పుచ్చుకునే ఈ తరహా సంవాదాలు ఈ దేశపు ఆధ్యాత్మిక సంస్థలలో వేలాది సంవత్సరాలుగా వర్ధిల్లుతూవచ్చాయి. ప్రతీ ఒక్క తాత్విక సిద్ధాంతానికీ, ప్రతీ ఒక్క విశ్వాసానికీ ఈ సంవాద ప్రక్రియలో స్థానం ఉండేది. తమ తాత్విక దృక్పధం పూర్తిగా లోపరహితం అని, పరమసత్యం తమ దృక్పధం ద్వారా మాత్రమే లభిస్తుందని ఎవరికి వారు బలంగా వాదించేవారు. అదే సమయంలో ఆ భావాలను వ్యతిరేకించేవారి విశ్వాసాలను వారు చిన్నచూపు చూడడం గానీ, వారిదంతా అజ్ఞానం అంటూ ముద్ర వేయడం గానీ చేసేవారు కాదు.

మన దేశపు ఆధ్యాత్మిక, తాత్విక చర్చల పట్ల ఏ కాస్త చిన్న అవగాహన ఉన్నా, ఈ చర్చల్లో ఒకవైపు ఉన్నవారిని రెండోవైపు ఉండేవారు శత్రువుల ముతాగా ఎంతమాత్రమూ పరిగణించేవారు కాదన్న సంగతి గ్రహించవచ్చు. తాత్విక వైఖరుల విషయంలో పరస్పర వ్యతిరేకత ఉండవచ్చు కాని అవతలి పక్షపు నోళ్ళు మూయించాల్సిందేనన్న ధోరణికి ఆస్కారం లేదు. దాడి చేయడం, అవమానించడం, నిషేధించడం వంటి ధోరణులకు తాత్విక రంగంలోని సత్యాన్వేషకులు అవకాశం ఇచ్చేవారు కాదు.

ఈ కారణం చేతనే "దైవ దూషణ" అన్న పద ప్రయోగాన్ని నేను పూర్తిగా వ్యతిరేకిస్తాను. కొన్ని విశ్వాసాలు, చిహ్నాలు విమర్శలకు అతీతంగా ఉంటాయని విశ్వసించడం మౌలికంగానే విజ్ఞాన సముపార్జనకు, మేధోపరమైన కృషికి వ్యతిరేకం. గత 30 సంవత్సరాలుగా నేను ఇదే నొక్కిచెప్తున్నాను. మేధోపరమైన చర్చల్లో విశ్వాసకులకు స్థానం లేదు. కేవలం నిజాయితీగా సత్యాన్ని అన్వేషించాలనుకునే వారికి మాత్రమే స్థానం ఉంటుంది.

ప్రాచీన సద్‌జ్ఞాన సాంప్రదాయంలోని వివిధ రకాల ధోరణులను స్థూలంగా మూడు తరహాలుగా విభజించవచ్చు. అవి వైదిక, వైదిక–వ్యతిరేక, వేదాంత సాంప్రదాయాలు. వైదిక సాంప్రదాయాలు ప్రాథమిక, పరమ జ్ఞానానికి వేదాలే మూలాధారమని, తక్కినవన్నీ ఆ వేదాలకు కొనసాగింపు మాత్రమేనని భావిస్తాయి. వేదాల్లో నిర్దేశించిన యజ్ఞ కర్మకాండలకు అధిక ప్రాధాన్యతనిస్తాయి. కర్మకాండలకు, ఆచారాలకు, విశ్వాసాలకు ఖచ్చితంగా కట్టుబడివుండాల్సిందేనని నొక్కిచెబుతాయి. ఈ సాంప్రదాయాన్ని అనుసరించేవారిని ఆచారవాదులుగా (ఎట్టి పరిస్థితుల్లోనూ ఆచారాలకు లోబడివుండాలనేవారు) నిష్టాగరిష్టులుగా (కర్మకాండలను విధిగా పాటించేవారు) చెప్పవచ్చు. మన సాంప్రదాయంలో వీరిని పూర్వ మీమాంసకులు అనేవారు.

పూర్వమీమాంసక సాంప్రదాయం మొదట్లో ఇంద్రుడు, వరుణుడు మొదలైన వైదిక దేవతలనే గుర్తించేవారు. శివుడు, విష్ణువు వంటి దేవతామూర్తులను సర్వశక్తిమంతులుగా అంగీకరించలేదు. దేవాలయాలు, పూజా పునస్కారాలు సైతం వీరికి ఆమోదయోగ్యంగా లేవు. భక్తి మార్గానికి కూడా వ్యతిరేకులుగానే ఉండేవారు. అగ్నిలో ఆహుతి చేయడం అనే యజ్ఞ ప్రక్రియను మాత్రమే బలపరుస్తూండేవారు. ఐతే కాలం గడిచినకొద్దీ పూర్వమీమాంసకులు నెమ్మదిగా ఆరు సాంప్రదాయ విశ్వాసాలను కూడా స్వీకరించారు. అవి శైవ, వైష్ణవ, శాక్తేయ, కౌమార, గణపత్య, శౌర్య సాంప్రదాయాలు. సర్వశక్తివంతుడైన దైవానికి, దేవాలయాల్లో ఆరాధనకు, భక్తి మార్గానికి చోటు కల్పించింది పూర్వ మీమాంస. ఈ నాడు వైదిక హిందూయిజంగా ఉనికిలో ఉన్నది ఈ సాంప్రదాయమే.

హిందూ తాత్విక సాంప్రదాయంలో వైదిక సాంప్రదాయాన్ని బలంగా వ్యతిరేకించే ధోరణులు ఎప్పుడూ ఉంటూనేవచ్చాయి. సాంఖ్య, యోగ, న్యాయం, వైశేషిక సాంప్రదాయాలు సైతం అన్ని వైదిక భావనలను, అన్ని ఆచారాలను అంగీకరించలేదు. ఇక చార్వాక, తార్కిక సిద్ధాంతాలు చూస్తే మొత్తంగానే వైదిక సాంప్రదాయాన్ని పూర్తిగా వ్యతిరేకించాయి.

శైవంలోంచి పుట్టుకొచ్చిన ఆరు శాఖలు (పురా–చమయమ్) మౌలికంగానే వేదాలకు వ్యతిరేకం. శైవ శాఖలకు కొనసాగింపుగా వచ్చిన సిద్ధ సాంప్రదాయం కూడా అంతే.

> **సనాతన ధర్మం అనే పదాన్ని మొత్తం హిందూయిజానికి వర్తింపజేస్తున్నారు. కాని సనాతన ధర్మం అంటే మొదటి తరహా సాంప్రదాయానికి మాత్రమే సంబంధించినది. దానినే ఇప్పుడు వైదికమతం అన్న పేరుతో పిలుస్తున్నారు. సనాతనం అంటే ఆదిమ కాలం నుంచీ ఉన్నది అని, లేదా దానికి ప్రారంభం అనేదే లేనిదని అర్థం. ఆ ధర్మాన్ని బలపరిచేవారు దాని ప్రాచీనతే దాని విలువను తెలియజేస్తుందని, అందుచేత దానిని ప్రశ్నించడానికి వీలు లేదని వాదిస్తారు.**

ఇక మూడవ తరహా అయిన వేదాంత సాంప్రదాయం జ్ఞానాన్వేషణలో తొలి మెట్టుగా వేదాలను పరిగణిస్తుంది. ఐతే అక్కడితో మొదలుపెట్టి జ్ఞానాన్వేషణను కొనసాగించడానికి వేదాల పరిధిని అధిగమించి శోధిస్తుంది. ఆ క్రమంలో వేదాంత సాంప్రదాయం కర్మకాండల చట్రాన్ని, యాగాలలో బలులిచ్చే సాంప్రదాయాలను విడిచిపెట్టింది. కొన్ని సందర్భాలలో వేదాల సూత్రాలను విమర్శించింది కూడా.

ఈ సూక్ష్మ వివరాలను విస్మరించిన కొందరు సనాతన ధర్మం అనే పదాన్ని మొత్తం హిందూయిజానికి వర్తింపజేస్తున్నారు. కాని సనాతన ధర్మం అంటే మొదటి తరహా సాంప్రదాయానికి మాత్రమే సంబంధించినది. దానినే ఇప్పుడు వైదికమతం అన్న పేరుతో పిలుస్తున్నారు. సనాతనం అంటే ఆదిమ కాలం నుంచీ ఉన్నది అని, లేదా దానికి ప్రారంభం అనేదే లేనిదని అర్థం. ఆ ధర్మాన్ని బలపరిచేవారు దాని ప్రాచీనతే దాని విలువను తెలియజేస్తుందని, అందుచేత దానిని ప్రశ్నించడానికి వీలు లేదని వాదిస్తారు. అందుచేతనే తమ విశ్వాసానికి సనాతనం అన్న పదాన్ని చేర్చి గట్టిగా సమర్థిస్తారు.

ఐతే, ఈ సాంప్రదాయాన్ని వ్యతిరేకించేవారు కూడా సనాతనం అన్న పదాన్ని వాడతారు. వైదిక సాంప్రదాయాన్ని విమర్శించడానికి కూడా ఆ పదాన్ని ఉపయోగిస్తారు. హిందూ మత పరిధిలోకి వచ్చే అన్ని రకాల శాఖలనూ వ్యతిరేకించడం వాళ్ళ లక్ష్యం కాదు. కాని వాళ్ళు సనాతనం అన్న పదాన్ని ప్రత్యేకంగా ఉపయోగించడానికి కారణం దాని వలన తమ వాదనకు ప్రాచీనత ఉంది అని చెప్పవచ్చు. తద్వారా సాధికారతను కలిగివున్నట్టు చెప్పవచ్చు. అంతే కాక సనాతనధర్మం పేరుతో రుద్దుతున్న ఆచారాలను, సాంప్రదాయాలను వ్యతిరేకించవచ్చు.

చాలా ప్రాచీన వేదాంత వ్యవస్థలు ఇదివరకెప్పుడో వైదిక పరిధిలోకి వచ్చేశాయి. కర్మకాండల సుడిగుండంలో పడిపోయి వేదాంతం తాలూకు తాత్వికతను విడిచిపెట్టేశాయి. ఐతే 18 వ శతాబ్దంలో రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, నారాయణ గురు, నటరాజ గురు తదితరుల ఆధ్వర్యంలో వేదాంత దర్శనం పునరుజ్జీవం పొందింది.

సాంప్రదాయ హిందూ ఆచారవాదులు నిరంతరం, అతి తీవ్రంగా వేదాంత సాంప్రదాయం కిందకు రాని ఇతర సాంప్రదాయాలను వ్యతిరేకిస్తూనేవున్నారు. వేదాంత దర్శనంగా తొలుత మొదలైన వ్యవస్థ వైదిక ఆచారాలకు లొంగిపోయింది. కాని తక్కిన సాంప్రదాయాలు మాత్రం వేదాంత దర్శనంలోని వేధో దార్శనికతను ఆవిష్కరించడానికి ప్రయత్నించాయి. సనాతనవాదులు ఎంతో దూకుడుగా ముందుకు తెచ్చిన వైదిక కర్మకాండలకు, మూఢవిశ్వాసాలకు, ఛాందసత్వానికి, కుల ప్రాతిపదికన తెచ్చిన చీలికలకు, ముఖ్యంగా బ్రాహ్మణాధిపత్యానికి ఎదురునిలిచి వ్యవహరించడంలో ఈ దార్శనికత ఉపయోగపడింది. నేటికీ ఈ విషయాల్లో రాజీ పడడానికి ఆ తక్కిన సాంప్రదాయాలేవీ సిద్ధంగా లేవు.

హిందూయిజంలో నయా వేదాంతులు మాత్రమే మొదటినుంచీ నికరమైన వైఖరితో ఉన్నారు. (అ) మన శ్రుతులలో (తొలినాటి ధర్మశాస్త్రాలు, వేదాలు–వినికిడి ద్వారా మాత్రమే ఒకరినుండి మరొకరు నేర్చుకున్నవి) ఎక్కడా కులం, తెగ ప్రస్తావనలు లేవు. (ఆ) కులం పేరుతో అమలు జరిపిన వివక్షతలన్నీ సాంప్రదాయం పేర రుద్దినవే తప్ప అవి మౌలికంగా హిందూ ఆచారాలు కావు. (ఇ)

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

హిందూ సద్ జ్ఞాన సాంప్రదాయం కాలాలు మారినా, నేటికీ వర్తిస్తుంది. –ఇదీ నయా వేదాంతుల వైఖరి.

వైదిక సాంప్రదాయ వాదులు, లేదా సనాతనులు చాదస్తపు కర్మకాండలనే అత్యంత ప్రధానంగా పరిగణించారు. అందుచేత వాళ్ళు ఈ నయా వేదాంతుల వైఖరిని ఏనాడూ అంగీకరించలేదు. పైగా ఎదురుదాడి చేశారు.

సనాతన సాంప్రదాయానికి పెరుగుతున్న వ్యతిరేకతను గమనించిన కొందరు హిందూయిజం సారాంశం సద్ జ్ఞాన సాంప్రదాయంలో ఉంది తప్ప కర్మకాండల్లో లేదని, కాలం చెల్లిన ఆ కర్మకాండలను, ఆచారాలను కట్టుబాట్లను బట్టి మన సద్ జ్ఞాన సాంప్రదాయాన్ని నిందించకూడదని అంటున్నారు. ఆ కర్మకాండలు, కట్టుబాట్లు, ఆచారాలు కూడా కాలంతోబాటు మారిపోతున్నాయని అంటున్నారు. మరి ఈ వ్యాఖ్యానంతో సనాతనవాదులు, వైదిక సాంప్రదాయ వాదులు ఎంతవరకు ఏకీభవిస్తారో చూడాలి.

సనాతన వైదిక సాంప్రదాయాన్ని పట్టువదలకుండా ప్రతిఘటించడం, వారి వైఖరిని గట్టిగా విమర్శించడం భారతీయ మేధోరంగానికి, హిందూ తాత్విక రంగానికి చాలా అవసరం అని నేను ఎప్పటినుంచో గట్టిగా భావిస్తున్నాను. దానికి కారణం సనాతన సాంప్రదాయం మూర్ఖంగా కర్మకాండలకి, క్రతువులకి, ఆచారాలకి కట్టుబడివుంది. వాటికోసమే ఉంది. ఆ ఆచారాలు ఎంత అమానవీయం అయినా, వాటి ప్రాచీనతకే అది కట్టుబడి, వాటిని యథాతథంగా కొనసాగించాలని భావిస్తోంది.

ఆదిమ తెగల కాలం నాటి పూర్వీకుల దృక్పథాన్ని, జీవనశైలిని అన్ని విధాలా యథాతథంగా కొనసాగించాల్సిందేనని సనాతన, వైదిక సాంప్రదాయవాదులు వాదిస్తారు. తరతరాలుగా అవి కొనసాగి మనకు అందించబడ్డాయి గనుక వాటిని మనమూ కొనసాగించాల్సిందేనంటారు. అప్పటి జీవనశైలి ఇప్పుడు ఉనికిలో లేదన్న విషయాన్ని ఒప్పుకోడానికి మొండిగా నిరాకరిస్తారు. ఆధునిక సమాజపు విలువలకు ఆ నాటి దృక్పథానికి పొంతన కుదరదని, దానినే కొనసాగిస్తే అది అన్యాయం ఔతుందని వారేనాటికీ గుర్తించరు. గతంలోనే ఉండిపోయి ఎదుగూ బొదుగూ లేకుండావుండే సంకుచిత వైఖరి ఇది. ఆ దృక్పథమే గనుక పైచేయి సాధిస్తే ఆధ్యాత్మికంగా, తాత్వికంగా

**“ ప్రతీ పరిణామంలోనూ రెండు పరస్పర వ్యతిరేక శక్తులు ఉంటాయి. ఒకటి చలనరహితం, ఇంకొకటి చలనశీలం. చలనరహితమైన శక్తి లేకపోతే ఆ పరిణామానికి నిలకడ లేకుండా పోతుంది. అప్పడది అదుపు తప్పి అంతిమంగా అంతరించిపోతుంది. ఆ చలనరహితమైన శక్తిదే పైచేయి అయితే, అప్పడు ఆ పరిణామం ఎదుగూ బొదుగూ లేకుండా పోతుంది. అప్పడది శిథిలమౌతుంది. ”**

పురోగతి అనేదే ఉండదు. సమాజం అంధకారమయం అవుతుంది. సామాజిక అణచివేత, మానవశ్రమ దోపిడీ విచ్చలవిడిగా సాగుతాయి. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. ప్రాచీన మత సాంప్రదాయాలన్నీ మనల్ని అంధకారంలోకి నెట్టి ఎదుగూ బొదుగూ లేకుండా అణచివుంచుతాయి. మానవత్వానికి అవి పూర్తి వ్యతిరేకం. ఆ పద్ధతులను అనుసరించిన ఏ దేశమూ ఎప్పుడూ బాగుపడలేదు. ఇప్పుడు మన కళ్ళముందు కూడా అదే కనపడుతోంది.

నేను సనాతనుల పక్షాన లేను. కాని సనాతన సాంప్రదాయాన్ని నేను నా ప్రత్యర్థిగానే పరిగణిస్తాను తప్ప శత్రువుగా కాదు. నేను వేదాలను తిరస్కరించను. వాటిలో ఉన్న మేధోపరమైన జ్ఞానాన్ని గుర్తించి తదనుగుణంగా వాటిపట్ల వైఖరి తీసుకుంటాను. అందుచేత నేను మూడో తరహాకు చెందుతాను. అదే వేదాంతుల శాఖ.

వైదిక మూలాల్లో అనాదికాలం నాటి లోతైన ఆధ్యాత్మిక అనుభవాలు ఇమిడివున్నాయి. మానవజాతికి అవి చాలా విలువైన వారసత్వంగా ఉంటాయి. వాటినుండి నేను నేర్చుకోడానికి ప్రయత్నిస్తాను. అదే సమయంలో వేదాలతో ముడిపడిన ఛాందసత్వాన్ని, కర్మకాండలను నేను తిరస్కరిస్తాను. నారాయణగురు సాంప్రదాయాన్ని అనుసరించే నిత్య చైతన్య యతికి నేను అనుయాయుడిని. ఈ తాత్విక శాఖకు చెందిన గ్రంథాలను పైపైన చూసినా, అది అత్యంత అభ్యుదయశీలమని, అది ఒక బలమైన ధోరణిగా ఉందని కనిపిస్తుంది.

నేను తీసుకున్న వైఖరిని ఛాందసవాదులు, సాంప్రదాయవాదులు తీవ్రంగా విమర్శిస్తారని, అభ్యంతరాలు వ్యక్తం చేస్తారని నాకు తెలుసు. వారిని నేను అర్థం చేసుకోగలను. అటువంటి తాత్విక ధోరణి ఒకటి ఎప్పుడూ కొనసాగుతూనేవుంటుంది. హిందూ సాంప్రదాయంలో స్థిరంగా, మార్పు లేకుండా ఉండే ధోరణికి వాళ్ళు ప్రతినిధులు. ఎటువంటి మార్పునైనా సరే వాళ్ళు వ్యతిరేకిస్తారు. యథాతథ స్థితి అలాగే కొనసాగాలని వారు కోరుకుంటారు. వాళ్ళ ప్రయత్నాలవల్ల మన సాంప్రదాయంలోని కొన్ని అవశ్యమైన అంశాలు అంతరించిపోకుండా కొనసాగుతున్నాయి. హిందూ సద్జ్ఞాన సాంప్రదాయానికి మూలంగా ఉండే ఆధ్యాత్మిక భావజాలం అన్ని రకాల ప్రతికూలతలనూ తట్టుకుని నిలిచిందంటే అది సనాతనవాదుల మొండి పట్టుదల, మార్పును వ్యతిరేకించే స్వభావం వల్లనే.

ప్రతీ పరిణామంలోనూ రెండు పరస్పర వ్యతిరేక శక్తులు ఉంటాయి. ఒకటి చలనరహితం, ఇంకొకటి చలనశీలం. చలనరహితమైన శక్తి లేకపోతే ఆ పరిణామానికి నిలకడ లేకుండా పోతుంది. అప్పుడది అదుపు తప్పి అంతిమంగా అంతరించిపోతుంది. ఆ చలనరహితమైన శక్తిదే పైచేయి అయితే, అప్పుడు ఆ పరిణామం ఎదుగూ బొదుగూ లేకుండా పోతుంది. అప్పుడది శిథిలమౌతుంది. అందుచేత పరిణామ క్రమం పురోగమించాలంటే చలన రహిత పార్శ్వం మీద చలనశీలమైన పార్శ్వం ఆధిపత్యం సాధించాలి. హిందూ సాంప్రదాయం వరకూ చూస్తే నయా–వేదాంతం ఆ చలనశీలమైన పాత్ర పోషిస్తుంది.

వేదాలను తిరస్కరించే రెండో పార్శ్వం ఉంది. వారి వైఖరిని నేను పూర్తిగా ప్రశంసిస్తాను. భారతీయ తాత్విక సంవాద క్రమంలో వారి దృక్పథం శాశ్వతంగా విడదీయలేని అంతర్భాగంగా ఉంటుంది. వారి వాదన అలా ప్రతిధ్వనిస్తూనేవుండాలి. ఆ వాదన గొంతు మూగబోతే అప్పుడు హిందూసాంప్రదాయం కేవలం కర్మకాండల

“ వేద ప్రమాణాన్ని తిరస్కరించే బలమైన ధోరణులు వేద కాలం నుండే ఉన్నాయి. ఈ విషయాన్ని ఆ వేదాలలోనే ప్రస్తావించారు. బృహస్పతి సాంప్రదాయం అగ్నికి ఆహుతి ఇచ్చే క్రతువులను, బలులను వ్యతిరేకించిన వైనం, కణాదుడు, అజిత కేశ కంబళి వంటివారు వైదిక సాంప్రదాయాలను విమర్శించిన సంగతులు వేదాలలో ప్రస్తావించబడ్డాయి. మహాభారతంలో కూడా వేద వ్యతిరేకత వ్యక్తం అయిన సందర్భాలు ఉన్నాయి. ”

వ్యవహారంగా దిగజారిపోతుంది. దాని నైతిక పురోగమనం ఆగిపోతుంది. అప్పుడది ఎదుగూ బొదుగూ లేని స్థితికి చేరి అంతరించిపోతుంది.

వేద ప్రమాణాన్ని తిరస్కరించే బలమైన ధోరణులు వేద కాలం నుండే ఉన్నాయి. ఈ విషయాన్ని ఆ వేదాలలోనే ప్రస్తావించారు. బృహస్పతి సాంప్రదాయం అగ్నికి ఆహుతి ఇచ్చే క్రతువులను, బలులను వ్యతిరేకించిన వైనం, కణాదుడు, అజిత కేశ కంబళి వంటివారు వైదిక సాంప్రదాయాలను విమర్శించిన సంగతులు వేదాలలో ప్రస్తావించబడ్డాయి. మహాభారతంలో కూడా వేద వ్యతిరేకత వ్యక్తం అయిన సందర్భాలు ఉన్నాయి. దాయాదుల నడుమ యుద్ధం ముగిసిన తర్వాత యుధిష్ఠిరుడు సింహాసనం అధిష్టించిన సందర్భంలో చార్వాకుడు అక్కడికి వచ్చి ఆ విజయాన్ని నిరసిస్తూ మాట్లాడతాడు. జైనం, బౌద్ధం కూడా వేద ప్రమాణాన్ని బలంగా వ్యతిరేకించాయి. ఆ మతాలు, వాటి అభ్యంతరాలు నేటికీ ఉనికిలో ఉన్నాయి. శైవం లోని వివిధ శాఖల్లో కూడా తీవ్రమైన వైదిక వ్యతిరేక భావజాలం కనిపిస్తుంది. ఎం.ఎన్.రాయ్, దేవీప్రసాద్ చట్టోపాధ్యాయ, కె.దామోదరన్ వంటి పండితులు ఈ విషయాలపై చాలా విస్తృతంగా రచించారు.

భారతదేశంలో సాంస్కృతిక వికాస ఉద్యమాలు జరిగిన సందర్భాలలో, ఆంగ్లవిద్యను అభ్యసించే అవకాశాలు వచ్చిన నేపథ్యంలో వైదిక వ్యతిరేక సిద్ధాంతాలు తిరిగి ముందుకొచ్చాయి. సంస్కరణవాదం, ఉదారవాదం, మార్క్సిజం వంటి రూపాల్లో ఇవి వ్యక్తం అయాయి. జవహర్‌లాల్ నెహ్రూ, రామ్ మనోహర్ లోహియా, బి.ఆర్.అంబేద్కర్, కె.దామోదరన్ ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్ వంటి మేధావులు ఈ కొత్త భావజాలానికి ప్రతిరూపాలుగా నిలిచారు. ఒక సాంఘిక సంస్కర్తగా ఇ.వి.రామస్వామి నాయకర్ కూడా ఈ జాబితాలో ఉన్నారు. వారు వేదాలను సంపూర్ణంగా తిరస్కరించారు. దానికి సామాజిక, తాత్విక ప్రాతిపదికలు రెండూ ఉన్నాయి. మూర్ఖపు ఛాందసత్వంతో ముడిపడినందువలన వైదిక సాంప్రదాయం మానవత్వాన్ని కోల్పోయిన ఒక వ్యవస్థగా, సాటి మానవులను జంతువుల కన్నా హీనంగా చూసేదిగా దిగజారినందువలన సామాజిక కోణం నుండి దానిని తిరస్కరించారు. ఈ సిద్ధాంతం కారణంగా శతాబ్దాల తరబడి అణచివేతకు, బానిసత్వానికి గురైన తరగతుల ప్రజానీకానికి ఈ వైదిక సాంప్రదాయాన్ని మొత్తంగానే తిరస్కరించేందుకు అన్ని హక్కులూ ఉన్నాయి.

తాత్వికంగా చూసినప్పుడు మొండిగా ధర్మసూత్రాలను పట్టుకుని వేలాడడం అంటే ప్రతీ కొత్త దృక్పథాన్నీ తిరస్కరించడమే ఔతుంది. అటువంటి ధోరణి సహజంగానే ఉదారవాదానికి, ప్రజాస్వామ్య భావాలకి విరుద్ధం. అందుచేత నెహ్రూ గానీ, లోహియా గానీ వైదిక సాంప్రదాయాన్ని తోసిపుచ్చారు.

నారాయణ గురు ప్రధాన శిష్యుడైన సహోదరన్ అయ్యప్పన్ వైదిక సాంప్రదాయ వ్యతిరేక ధోరణికి చెందినవాడు. నవ కేరళలో మొదటి సాంప్రదాయ వ్యతిరేకి, నాస్తికుడు అతడే. అతడి సమకాలీకుడు, నారాయణ గురు సన్నిహిత శిష్యులలో ఒకడు అయిన సి.వి.కున్హిరామన్ రచయిత, సంస్కర్త. అతడు కూడా బలమైన వైదిక వ్యతిరేక ధోరణి తోనే ఉండేవాడు.

చరిత్ర ఇంకా లిఖిత పూర్వకంగా రాయని ప్రాచీన కాలం లోనే వైదిక సాంప్రదాయం తమిళనాడులో ఉండినట్టు పురనానూరు వంటి కొన్ని ప్రాచీన తమిళ గ్రంథాలలో ఆధారాలు ఉన్నాయి. వాటిలోనే ఆనాటికి సమాజంలో వైదిక సాంప్రదాయం పట్ల ఉన్న వ్యతిరేక భావాల ప్రస్తావన కూడా ఉంది. సంగం సంస్కృతి ఉన్న కాలంలోఅప్పటి కొన్ని పాటలు వైదిక బ్రాహ్మణులను హేళన చేస్తూ పాడినవి ఉన్నాయి. వేలపార్వార్ అనే ఒక బ్రాహ్మణుల బృందం యజ్ఞాలను వ్యతిరేకిస్తున్నట్టు శిలప్పాదికారం అనే పురాణగ్రంథంలో కవి ఇలాంగో పేర్కొన్నాడు. ఆనందంగా జీవించడమే తమ విధానంగా ప్రకటిస్తూ ఆ బృందం సంగీతం, మద్యపానం వంటి కార్యకలాపాల్లో ఉండేవారని తెలిపాడు. మణిమేఖలై అనే తమిళ పురాణంలో ఆనాటికి తమిళనాట ఉన్న వివిధ తాత్విక దర్శనాల గురించి ప్రస్తావనలున్నాయి. వాటిలో చాలా భాగం వైదిక సాంప్రదాయానికి వ్యతిరేకంగా ఉన్నవే. క్రీ.శ.7 వ శతాబ్దం వరకూ తమిళనాడులో జైనం, బౌద్ధం ప్రధాన మతాలుగా ఉండేవి. ఈ రెండూ వేదాలను పూర్తిగా తిరస్కరించాయి. తమిళ ఆదర్శాలకి, నైతిక విలువలకి చిహ్నంగా పరిగణించే తిరువళ్ళువార్ జైనుడని, ఆచార్య కుంత కుంత అనే జైన సన్యాసి శిష్యుడని తమిళనాడులో లభిస్తున్న అత్యంత ప్రాచీన ఆధారాలు వెల్లడిస్తున్నాయి.

శైవ, వైష్ణవ రుషులు ప్రారంభించిన భక్తి ఉద్యమం తమిళనాడులో 7వ శతాబ్దం నుంచీ వికసించింది. ఆ తర్వాత దేశమంతటికీ వ్యాపించింది. ఆ ఉద్యమం వేదాలను అంత తీవ్రంగా వ్యతిరేకించలేదు. ఒక ఆధ్యాత్మిక అగ్రస్థానంలో వేదాలు ఉన్నట్టు అవి అంగీకరించాయి. ఐతే ఆ స్థావం మర్యాదపూర్వకంగా ఇచ్చినది మాత్రమే.

ఉదాహరణకి, శైవ భక్తి ఉద్యమం శివుడిని వేదముదల్వన్ (వేదాలకు మూలం) అని ప్రశంసించింది. ఐతే, యజ్ఞాలు తదితర వైదిక ఆచారాలను అది బేషరతుగా ఆమోదించలేదు. యజ్ఞాలకు బదులు దేవాలయాల్లో పూజలను, దైవ భక్తిని ఆచరించాయి. ఈ పద్ధతులు వైదిక సాంప్రదాయానికి చెందినవి కావు. భక్తి ఉద్యమం పైచేయి సాధిస్తున్నకొద్దీ వైదిక సాంప్రదాయం క్రమంగా ఆ ప్రజాదరణ పొందిన పద్ధతులను తనవిగా స్వీకరించి ఇముడ్చుకుంది. ఆ క్రమంలోనే అది బౌద్ధాన్ని, జైనాన్ని పక్కకు తప్పించి తాను ప్రధాన స్రవంతి లోకి రాగలిగింది.

వైదిక సాంప్రదాయంతో ముడిపడిన కర్మకాండలను, విశ్వాసాలను భక్తి ఉద్యమం పదే పదే కొట్టిపారేస్తూవచ్చింది. నిజమైన భక్తుడు అయినవాడు ఆ ఉద్యమానికి కేంద్రం. సాధారణంగా ఒక పేద రైతు గానీ, ఒకవేట గాడు గానీ ఆ కేంద్ర స్థానంలో ఉండేవాడు. గాఢమైన భక్తితో, ఆరాధనతో అటువంటివాళు

ళ్ళ దైవ సాక్షాత్కారం పొందగలిగేవారు. వేద మంత్రాలు వల్లిస్తూ, యజ్ఞాలు నిర్వహిస్తూ ఉండే బ్రాహ్మణులకు ఆ దైవం అందేవాడు కాదు. భక్తి ఉద్యమంలో అగ్రభాగాన ఉండిన చాలామంది రుషులు, బ్రాహ్మణులు కానేకారు. వారిలో అత్యధికులు సమాజంలో అణగారిన తరగతులనుండి వచ్చినవారే. నందనార్ గాథ ఒక మంచి ఉదాహరణ. ఆ దళిత భక్తుడికి చిదంబరంలోని శివాలయంలోకి ప్రవేశం నిషేధించారు. కాని దేవాలయం వెలుపలినుండే నందనార్ శివుడిని దర్శించడానికి వీలు కల్పిస్తూ అడ్డంగా ఉన్న నంది విగ్రహం పక్కకు తొలిగిందని ఆ గాథ చెప్తుంది.

భక్తి ఉద్యమం ప్రధానంగా శూద్రులు, దళితులతో నడిచింది. ఆ తరగతుల ప్రజలకు యజ్ఞాలు నిర్వహించడమే గాక చూడడం కూడా నిషేధించింది వైదిక సాంప్రదాయం. భక్తి ఉద్యమంలో అత్యధికులు శ్రమజీవులు గనుక ఆ ఉద్యమాన్ని శ్రమణక సాంప్రదాయం అని పిలిచేవారు. భక్తి ఉద్యమం కుల కట్టుబాట్లను, కర్మకాండలను తిరస్కరించింది. వాటికి బదులు పవిత్రమైన భక్తితో ఆరాధించాలని చెప్పింది. వైష్ణవ సాంప్రదాయాన్ని నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించిన రామానుజాచార్యుడు వేద ప్రమాణాన్ని ఆమోదించినప్పటికీ, వైష్ణవ సాంప్రదాయం వైపు దళిత ప్రజలను తీసుకువచ్చి వారికి తిరుకులత్తర్ (గౌరవప్రదమైన పుట్టుక కలవారు) అని పేరు పెట్టాడు. అందుచేత తమిళ భక్తి ఉద్యమం వైదిక సాంప్రదాయాన్ని తిరస్కరించిన బలమైన పునాదులమీద రూపొందిందని చెప్పవచ్చు.

తమిళ శైవ సాంప్రదాయం సంక్లిష్టమూ, బహుళ దొంతరలతో కూడినదీ. అందులో 12 ప్రధాన శాఖలున్నాయి. వీటిలో చాలా శాఖలు వేద ప్రమాణాన్ని సవాలు చేశాయి. శైవ సిద్ధాంతంలో వేదాలను పవిత్రమైనవిగానే పరిగణిస్తారు తప్ప వాటిని మూలాలుగా కానీ, విధిగా ఆచరించవలసిన సూత్రాలుగా కానీ అంగీకరించరు. శివ జ్ఞాన బోధం వంటి తాత్విక గ్రంథాలనుండి రూపొందించిన విధానాలను, శైవ ఆగమాలను ప్రమాణాలుగా పరిగణిస్తారు. వైదిక సాంప్రదాయం శూద్రు లను రుషిత్వానికి అనర్హులుగా ప్రకటించింది. కాని శైవ సాంప్రదాయంలో ప్రధాన రుషులంతా శూద్ర కులాలనుండి వచ్చినవారే.

> **“దేశ వ్యాప్తంగా చూసినప్పుడు హిందూయిజం నడక ప్రత్యేకంగా ఉంటుంది. అది మూడు స్థాయిలలో కొనసాగుతుంది. అగ్రభాగాన రూప, గుణ రహితుడైన పరబ్రహ్మ ఉంటాడు. మధ్య దొంతరలలో ప్రజల్లో ప్రాచుర్యం పొందిన శైవ, వైష్ణవ మతాలు ఉంటాయి. ఆ దిగువన స్థానిక దేవతలు, ఆయా కుటుంబాల దేవతలు ఉంటారు. ఈ స్థానిక దేవతలు, కుటుంబ దేవతలు అంతా వైదిక సాంప్రదాయానికి దూరంగానే ఉంటారు.”**

తమిళలనాడులో ప్రధానమైన మతం భక్తి ఉద్యమం ఆధారంగా వచ్చినదే. సనాతన, వైదిక ధర్మం అనేది స్వల్ప పాత్రనే పోషించింది. మహా అయితే పరోక్షంగా కొంత ప్రభావాన్ని కలిగించిందేమో. రాష్ట్రంలోని సామాన్య ప్రజానీకానికి సనాతన, వైదిక సాంప్రదాయంతో ఏ నిమిత్తమూ లేనే లేదు.

దేశ వ్యాప్తంగా చూసినప్పుడు హిందూయిజం నడక ప్రత్యేకంగా ఉంటుంది. అది మూడు స్థాయిలలో కొనసాగుతుంది. అగ్రభాగాన రూప, గుణ రహితుడైన పరబ్రహ్మ ఉంటాడు. మధ్య దొంతరలలో ప్రజల్లో ప్రాచుర్యం పొందిన శైవ, వైష్ణవ మతాలు ఉంటాయి. ఆ దిగువన స్థానిక దేవతలు, ఆయా కుటుంబాల దేవతలు ఉంటారు. ఈ స్థానిక దేవతలు, కుటుంబ దేవతలు అంతా వైదిక సాంప్రదాయానికి దూరంగానే ఉంటారు. ఆ దేవతలలో ఎక్కువ భాగం నిస్సందేహంగా వైదిక సాంప్రదాయ వ్యతిరేకంగానే ఉంటారు.

తమిళనాడులో వైదిక సాంప్రదాయ వ్యతిరేకులు వైదిక సాంప్రదాయాన్ని అనుసరించేవారితో కనీసం సమానమైన బలం కలిగివుంటారు. వైదిక మతాన్ని వ్యతిరేకించేవారంతా దానిని సనాతన ధర్మం అనే అంటారు. అందుచేత సనాతన ధర్మాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఎవరైనా ప్రకటిస్తే దానిని ఆ నేపథ్యంలో చూడాలి.

వైదిక సాంప్రదాయానికి వ్యతిరేకంగా దక్షిణాదిన గళమెత్తినంత బలంగా ఉత్తరాదిన లేదు. వివేకానందుడితో మొదలైన నయా-వేదాంత ఉద్యమం కూడా ఉత్తరాదిన అంత బలంగా లేదు. భక్తి ఉద్యమం ముందుకు తెచ్చిన వైదిక మత వ్యతిరేకత అక్కడ కాలం గడిచినకొద్దీ బలహీన పడింది. వైదిక మూఢ విశ్వాసాలకు వ్యతిరేకత వ్యక్తం అయిన సందర్భాలు ఉన్నా అవి ఒక నికరమైన బలాన్ని పొందలేదు. అందుచేత ఉత్తర భారతంలో హిందూయిజం అంటే కేవలం వైదిక సాంప్రదాయమే అన్న భావన స్థిరపడింది. అది ఒక తిరుగులేని విషయంగా అయి పోయింది. ఒక ఏకశిలారూపమైన విశ్వాసంతో, ఒకే ఒక అధికారిక ధర్మసూత్రాల ప్రాతిపదికన నడిచే వ్యవస్థగా హిందూయిజం చిత్రించబడింది. ఆధిపత్య స్థానంలో ఉన్న సామాజిక శక్తులు, ఉనికిలో ఉన్న రాజకీయ శక్తులు ఒకదానికొకటి తోడై ఈ భ్రమలో జనాన్ని కొనసాగిస్తున్నాయి. ఉదాహరణకి అక్కడ కొందరు వ్యక్తుల్ని లక్ష్యంగా చేసుకుని వీధిలో వారిని చుట్టుముట్టి "జై శ్రీరామ్ " అని అనమని బలవంతం చేస్తారు. దక్షిణాదిన ఒక శివభక్తుడిని అదే విధంగా గనుక వత్తిడి చేసినా, ప్రాణాలకే ముప్పు వచ్చినా అతడు ఆ వత్తిడికి తల వొగ్గడు. అంతమాత్రం చేత అతడు హిందువుగా ఏ విషయంలోనూ తక్కువ కాదు గదా.


ఒక వేదాంత సాంప్రదాయవాదిగా నేనూ ఆ విధంగా అనడానికి తిరస్కరిస్తాను. అలా తిరస్కరించినంత మాత్రాన నేను హిందువును కాకుండా పోను. ఐతే ఇప్పుడు పరిస్థితి ఎలా ఉన్నదంటే అలా తిరస్కరించినందుకు నన్ను మూకగా చంపివేయవచ్చు. నిజానికి వివేకానందుడు గాని, నారాయణ గురు కాని, వల్లవార్ కాని ఇప్పుడు జీవించివుంటే వారు కూడా ఈ విద్వేషమూకల చేతుల్లో చావును చవి చూడాల్సిందే.

సనాతన ధర్మంతో హిందూయిజాన్ని కలగలిపివేసి తాత్వికంగా గానీ, సామాజిక ఉద్యమం రూపంలో గానీ ఎవరైనా సనాతన, వైదిక సాంప్రదాయాన్ని వ్యతిరేకిస్తే దానిని హిందూ వ్యతిరేకతగా చిత్రించడం పనిగట్టుకుని కొందరు సాగిస్తున్న వక్రీకరణ. ఇది హిందూ సద్జ్ఞాన సాంప్రదాయానికి దీర్ఘకాలంలో ఎనలేని హాని చేస్తుంది. అంతర్గతంగా కొనసాగే సంవాదాలను నిర్మూలిస్తుంది. మన సాంప్రదాయాలలో

*(మిగతా 34వ పేజీలో)*

ఆర్థిక రంగం

# విఫలమైన నయా-ఉదారవాదం



రచయిత ఆర్థిక శాస్త్ర నిపుణుడు, జెఎన్‌యులో ఎకనామిక్స్ ప్రొఫెసర్

సి.పి. చంద్రశేఖర్

అమెరికా పరిశ్రమలలో ఉత్పత్తి అవుతున్న సెమి కండెక్టర్స్‌లను చైనాకి అందుబాటులో ఉండకుండా మరింత గట్టి నింబంధనలు విధించడాన్ని, అమెరికా ప్రపంచీకరణకి మరో సారి తూట్లు పొడవడానికి సూచనగా పరిగణించవలసి ఉంటుంది. 2022 అక్టోబర్‌లో అమెరికా వాణిజ్య విభాగం కీలకమైన చిప్ తయారీ ఉపకరణాల ఎగుమతి నియమాలను కఠినతరం చేస్తున్నట్టు ప్రకటిం చింది. చైనా చిప్తయారీ పారిశ్రామికవేత్తలకి మద్దతుగా సేవలను అందించే అమెరికా పౌరులు, కంపెనీల పై నిషేధం విధించింది. 2023 అక్టోబర్‌లో జో బిడెన్ పాలన ఈ నియమాలను మరింత బలోపేతం చేయాలనీ, తద్వారా ఎన్విడియా లాంటి చైనా పరిశ్రమల అమ్మకాల సమర్థతను పరిమితం చేయాలని నిర్ణయించింది.

దీనిని కొంతమంది, ప్రపంచీకరణ నుండి వెనక్కు మళ్లడంగా చూస్తున్నారు. ఈ అవగాహనలో అంతర్లీనంగా రెండు ధోరణులు ఉన్నాయి. మొదటిది ప్రపంచీకరణ అంటే ఏమిటో తేటతెల్లమవుతున్నది. కోవిడ్ కాలంలోనూ ఆ తరువాత ఉత్పత్తి దేశంలో ఎక్కడిక్కడక్కడ ఉత్పత్తులు పేరుకు పోవడంతో, అభివృద్ధి తక్కువ స్థాయిలో ఉండడం వలన, దేశీయ ఉత్పత్తులకి రక్షణ, మద్దతు సమకూర్చాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇది వాణిజ్యం, పెట్టుబడుల సరళీకరణ గురించి తిరిగి ఆలోచించేలా చేస్తున్నది- 1980ల నాటి ప్రపంచ ఉత్పత్తి విధానం వైపు ఆలోచించే విధంగా చేస్తున్నది.

ఈ దిశగా, అమెరికా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల క్రమం మరింతగా పెరిగింది. అది అధిక ధరల తగ్గింపు చట్టం (ఇన్‌ఫ్లేషన్ రిడక్షన్ ఆక్ట్) లో ప్రతిబింబిస్తుంది. ఈ విధానాల కొనసాగింపే, వాతావరణ కాలుష్యం నివారించడం దిశగా తీసుకునే చర్యలలో భాగంగా, స్థానిక కార్పొరేట్లకు అనుకూల విధానాలు అమలు చేసే చర్యలు - విద్యుత్ వాహనాల ఉత్పత్తులలో పెట్టుబడులు పెట్టడానికి ప్రోత్సాహకరంగా పన్నుల మినహాయింపు ఇవ్వడం వగైరా అనేక మినహాయింపులను ఇవ్వడం - తీసుకోవడం జరుగుతున్నది. ఆఖరికి చైనా మీద ఆర్థిక యుద్ధం మొదలైయింది. ఇది ఆ దేశం వాణి జ్యం, పెట్టుబడులపై ఆంక్షలు విధించేందుకు దారి తీసింది.

### మార్కెట్ మూలాధారవాదం

జాతీయ పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్కెట్లో జోక్యం చేసుకోడం అంటే ప్రపంచీకరణ నుండి వెనకడుగు వేయడమే. మార్కెట్ మూలాధారవాదం అంటే, మార్కెట్‌లలో 'స్వేచ్ఛగా ఆర్థిక లావాదేవీలు 'జరగడం, ఇదే అత్యంత సమర్థవంతంగా ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి తోడ్పడుతుందని నయా-ఉదారవాద విధానం భావిస్తుంది. ఇందులో మార్కెట్లదే ప్రాధాన్యత, రాజ్యం జోక్యం అత్యంత కనిష్ట స్థాయిలో ఉండాలి.

ఈ విధానాలు సమర్థవంతమైనవిగా ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడడం వలన, చాలా దేశాలు వీటిని అనుసరించడం వలన, పెట్టుబడిదారీ వ్యవస్థ, 1970,1980 లలో ఎదుర్కొన్న విషమ పరిస్థితుల నుండి బయట పడగలిగింది. రాజకీయ సరిహద్దులు, ఆర్థిక హద్దులు చెరిగిపోయాయి. ద్రవ్య, వస్తు ఉత్పత్తి, సేవలు, దేశహద్దులు దాటాయి. ప్రపంచం ఏకీకృతమైంది. పర్యవసానంగా, పోటీపడగల చోట్లని దుష్టిలో ఉంచుకుని, పెట్టుబడిని పెట్టుబడి దారులు చైనాతో సహా, చాలాదేశాలకి, ఉత్పత్తులు చేసే పరిశ్రమలు విస్తరింపచేసారు.

అయితే 1970 లలో ఆ తరువాత "నయా-ఉదారవాదం" ప్రాచుర్యం పొందిన తరువాత ఆ అర్థంతో వాడబడలేదు. ఆ సమయంలో దానిని ప్రభుత్వాలు జోక్యం చేసుకోవడం నుండి వైదొలగడానికి ఉపయోగించారు. నిజానికి అంతకుముందు పెట్టుబడిదారి వ్యవస్థ స్వర్ణయుగంగా చెప్పుకునే రోజులలో, అంటే, రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత 1970 లలోపు మాద్యం రాకముందు, ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వాల జోక్యం ఎక్కువగా ఉండేది. దానిని నుండి మారాలని ఆనాడు పెట్టుబడిదారులు కోరుకున్నారు.

స్వర్ణ యుగంలో ప్రభుత్వాల జోక్యం రెండు సూత్రాలు మీద ఆధారపడి ఉండేది. ఒకటి, ద్రవ్య విధానం - మార్కెట్ ఒడిదుకులు లోనయినప్పుడు ప్రభుత్వాలు ద్రవ్య విధానం ద్వారా జోక్యం చేసుకుని మార్కెట్ పడిపో కుండా కాపాడడం. తద్వారా నిరంతరంగా అభివృద్ధి జరిగేటట్టు చర్యలు తీసుకోవడం. రెండోది, మార్కెట్‌లను ప్రత్యక్షంగా నియంత్రించడం, ప్రధానంగా ఫైనాన్సియల్ మార్కెట్లను, ఇది బ్యాంకులు దివాళా తీయడం పెరిగిన 1930 ల నుండి మొదలయింది. ''నయా-ఉదారవాదం'' విస్తృతార్థంలో, ఉత్పత్తిని, ద్రవ్యాన్ని, నియంత్రించడానికి వ్యతిరేకంగా చూడబడింది. ద్రవ్య విధానాలకే, విత్త విధానాలపైన కన్నా ఎక్కువ ప్రాధాన్యత నివ్వాలని భావించాయి. అంటే దానర్థం రాజ్యం ఏ విధంగానూ జోక్యం చేసుకోకూడ దని కాదు. ఆర్థిక వ్యవస్థలో దాని పాత్ర ఏమి లేదని కాదు, కానీ జోక్యం చేసుకునే విధానాం మారాలని. ఏయే రంగాలలో జోక్యం చేసుకోకూడదు, ఎంతవరకు జోక్యం చేసుకోకూడదు ఏ రూపాలలో జోక్యం

చేసుకోవాలి అనే విషయాలలోనే తేడా. రాజ్యం కొత్త విధానాలు మొదలు పెట్టాలి, అమలుచేయాలి, కానీ ఈ కొత్తగా జోక్యం చేసుకునే విధానాలు కూడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలి.


### స్వేచ్ఛా మార్కెట్ ఒక భ్రమ

ఇప్పటికీ, రాజ్యం మార్కెట్లో ఎక్కువగా జోక్యం చేసుకుంటూనే ఉంది. చాలా వరకు మార్కెట్లు 'స్వేచ్ఛగా'' లేవు, బడా పెట్టుబడిదారులు వారి కూటముల ఆధీనంలోనే ఉన్నాయి. నిజానికి జనం "నిర్వచించిన" ఆ పదం వలన నయా-ఉదారవాదం లోని అసలైన అర్థం మరుగున పడింది. దాని అసలు రంగు ఆదాయాల పునఃపంపిణీ చేసుకోవడం, సంపదలను, ఆదాయాలను, మధ్య, కింది తరగతుల నుండి పైకి మళ్ళించుకోవడం. బాహాటంగా, అంతరంగికంగా పెట్టుబడి బదలాయించు కోవడం, దానికి రాజ్యం మధ్యవర్తిత్వం వహించడం.

ఇది జరగాలంటే ద్రవ్య విధానంలో పొదుపు చర్యలు తీసుకోవాలి, రాజ్యం సమర్థవంతంగా పన్నులు వసూలు చేయాలి, పునః పంపిణీల ఖర్చులు తగ్గించుకోవాలి. సంక్షోభంలో ఉన్నప్పటికీ, పునరుత్తేజింప చేయడానికి ఆర్థిక ఖర్చులు అవసరమైనప్పటికీ, రాజ్యం నిధులు ఆలస్యంగా విడుదల చేస్తుంది. అదికూడా కొంత సమయానికే పరిమితం చేస్తుంది. ప్రైవేటు పెట్టుబడిదారులకు ప్రభుత్వాలు క్రియాశీలంగా వ్యవహరించడం గిట్టదు కాబట్టి. కానీ, విత్త విధానాలు, ధరలను పెంచి పెట్టుబడి లాభాలు పెంచడానికి అవసరం. పెట్టుబడి దారులను ద్రవ్య సంక్షోభం నుండి బయట పడేయడానికి, సంక్షోభ సమయాలలో దివాళా తీయకుండా కాపాడడానికి అవసరం.

అనుకూలమైన రోజులల్లో, విత్త వినిమయం, సరఫరా పెంచి తద్వారా రుణపరపతి పెంచి ఆర్థిక అభివృద్ధి సాధిస్తారు. ధరలు పెరగడం సమస్యగా మారినప్పుడువిత్త సరఫరా తగ్గించడం, వడ్డీరేట్లు పెంచడం ద్వారా ద్రవ్య సంపద తరిగిపోకూండా కళ్లెలు వేస్తారు. అలాగే, మాద్యం, ధరలు పడిపోవడం, సమస్యలుగా ముందుకొచ్చినప్పుడు, 2008లో లాగా ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఏర్పడి, తదనంతర కాలంలో కూడా కొనసాగుతుంటే, సున్నా వడ్డీలకు రుణాలు అందించే విధానాన్ని అమలుచేస్తారు. ఆ క్రమంలోనే "ద్రవ్య సరఫరా అందుబాటులోకి తెచ్చారు. బ్యాంకుల

❝ వాస్తవానికి, నయా-ఉదారవాద విధానాలలో రాజ్యం జోక్యం అంటే, పన్నులద్వారా, రాయితీల ద్వారా, నష్టాలను పూరించడం ద్వారా, ప్రత్యక్షంగా ఖాతాలలో సొమ్ము జమ చేయడంద్వారా బడా వ్యాపారుల లాభాలు, ద్రవ్య సంపద పెంచడం. మార్కెట్లు, రాజ్యం జోక్యం లేకుండా స్వతంత్రంగా పని చేయవు. పెట్టుబడిదారీ విధానం, పెట్టుబడి, క్రమబద్ధీకరించని మార్కెట్ల నిర్వహణతో విఫలమవుతుంటే, తిరిగి వాటిని దారిలో పెట్టడానికి రాజ్యం జోక్యం నియమితకాలాలలో అవసరమవుతుంటుంది. ❞




బాలన్స్ షీట్స్‌లో నుంచి నిరర్థక ఆస్తులను తొలగించారు. తిరిగి అత్యధిక ఆర్థిక లాభాలను పునరుద్ధరించారు."

### రాజ్యం జోక్యం

ఈ వెలుగులో చూసినప్పుడు, సాంప్రదాయకంగా నయా-ఉదారవాద విధానాలు అంటే, మార్కెట్ శక్తుల వైపుకు తిరిగి మళ్లడం అని, రాజ్యం జోక్యం పరిమితం చేయడమని, ధనిక, పేద దేశాలలోని పురజనులు భావించడం తప్పవుతుంది. వాస్తవానికి, నయా-ఉదారవాద విధానాలలో రాజ్యం జోక్యం అంటే, పన్నులద్వారా, రాయితీల ద్వారా, నష్టాలను పూరించడం ద్వారా, ప్రత్యక్షంగా ఖాతాలలో సొమ్ము జమ చేయడంద్వారా బడా వ్యాపారుల లాభాలు, ద్రవ్య సంపద పెంచడం. మార్కెట్లు, రాజ్యం జోక్యం లేకుండా స్వతంత్రంగా పని చేయవు. పెట్టుబడిదారీ విధానం, పెట్టుబడి, క్రమబద్ధీకరించని మార్కెట్ల నిర్వహణతో విఫలమవుతుంటే, తిరిగి వాటిని దారిలో పెట్టడానికి రాజ్యం జోక్యం నియమితకాలాలలో అవసరమవుతుంటుంది.

అందువలన మార్కెట్ల సూత్రాల కనుగుణంగా వ్యూహరచనలు జరుగుతాయని అనుకోలేము. 2008 సంక్షోభం నుండి బయటపడడానికి విత్త విధానాలపైన ఫెడరల్ రిజర్వ్ ఆధారపడవలసి వచ్చింది. వడ్డీ రేట్లను దాదాపుగా సున్నా చేయాల్సి వచ్చింది. అదే పెట్టుబడి దారీ విధానం. "సంప్రదాయేతర విధానాలు" అమలు చేస్తున్నట్టు చెప్పుకోవడమే కానీ అనుసరించేది లేదు.

ఈ మధ్యే, సిలికాన్ వ్యాలీ బ్యాంకు దివాళా తీయడంతో అమెరికా ప్రభుత్వం అసాధారణ నిర్ణయం తీసుకుని, నిల్వదారుల సొమ్ముకి ప్రభుత్వం గ్యారంటీగా ఉంటుందని ప్రకటించింది. అది అమెరికా బోధించే అన్ని ప్రమాణాలకు విరుద్ధం. మార్కెట్లే సక్రమంగా పనిచేసి, 'దుష్ట' లను శిక్షిస్తుందని, క్రమశిక్షణలో పెడుతుందని, అనే అమెరికా ప్రవచనాలకు పూర్తిగా విరుద్ధం.

ఇదే నయా- ఉదారవాద విధానాలలో రాజ్యం పోషించే పాత్ర. ఈ పాత్రను కార్యాచరణలో పెట్టేటప్పుడు, నయాఉదారవాదానికి ఏ విధమైన సూత్రాలు ఉండవుబీ కేవలం దాని ప్రయోజనాలు కాపాడుకోవడమే ఉంటుంది. ❊

శాస్త్రీయ ఆలోచన

# మూఢ నమ్మకాలు మన పాలకులు

పి.బి.చారి



రచయిత హైదరాబాద్‌లోని ఇసిఐఎల్‌లో రిటైర్డ్ సీనియర్ మేనేజర్

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందని కాలంలో ప్రజలలో మూఢనమ్మకాలు ఉన్నాయి అంటే మనం అర్థం చేసుకోవచ్చు. ఈనాడు అనేకమంది శాస్త్రవేత్తల కృషి ఫలితంగా అనేక కొత్త కొత్త ఆవిష్కరణలు జరిగాయి. 15, 16వ శతాబ్దాల మధ్య కాలంలో కోపర్నికస్, గెలీలియో, న్యూటన్ లాంటి శాస్త్రవేత్తలు ఖగోళ, భౌతిక శాస్త్రాలకు ప్రారంభకులైనారు. అలాగే ఆంద్రియస్ వెసాలియస్, విలియం హార్వే లాంటి వారు చేసిన పరిశోధనల ఫలితంగా మానవ శరీర శాస్త్రం అభివృద్ధి అయింది. 19వ శతాబ్దంలో చార్లెస్ డార్విన్ జీవజాతుల పరిణామ క్రమం ఫలితంగా ఈనాటి ఆధునిక మానవుడిగా ఎలా ఆవిర్భవించాడు అన్న విషయాన్ని రుజువులతో సహా నిరూపించాడు.

కంప్యూటర్లు, ఇంటర్నెట్లు రాకెట్లు సాటిలైట్స్ సెల్ ఫోన్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పరుగులు తీస్తున్న ఈ కాలంలో కూడా ఇంకా మూఢనమ్మకాల ఊబిలో చిక్కుకుపోయి ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. వాస్తవానికి అది ఒక సామాజిక వైఫల్యం. ఈనాడున్న సామాజిక రుగ్మతల వలన సమాజం తగినంతగా అభివృద్ధి కాకపోవటానికి ఈ మూఢనమ్మకాలే కారణం. ఇది కరోనా వైరస్ కన్నా ప్రమాదకారి. ఈ మూఢత్వానికి మూల కారణం మతమౌఢ్యాన్ని పెంచి పోషించడమే ప్రధానమైన కారణం.

పిచ్చి పలు రకాలు అన్నట్లు, ఈ మూఢనమ్మకాలు కూడా బహువిధాలు. అందులో కొన్ని

1. బాణామతి, చేతబడి, చిల్లంగి, దయ్యాలు, క్షుద్ర పూజలు భూత వైద్యం, పూనకాలు లాంటివి.
2. వేళ్ళకు ధరించే ఉంగరాలలో రకరకాల రంగు రాళ్లు పెట్టుకుంటే మహర్దశ వస్తుందని నమ్మటం.
3. పేరులో ఒక అక్షరం మారిస్తేనో లేదా రెండు అక్షరాలు కలిపితేనో, జీవితం మారిపోతుందని భ్రమించటం.
4. రుద్రాక్షలు, కాశీ దారాలు, రంగురంగుల దారాలు, తాయెత్తులు, ధరిస్తే ఏదో మంచి జరుగుతుందని భావించటం.
5. బహిష్టు అయిన స్త్రీని ఎవరిని తాగకుండా ఐదు రోజులపాటు దూరంగా ఉంచుతూ మైల పాటించటం.
6. విధవ స్త్రీ కానీ పిల్లి కానీ ఎదురైతే అశుభం అని అనుకోవటం.
7. బుధవారం నాడు ఆడపిల్ల పుడితే అరిష్టం అని నమ్మటం.
8. మసూచి, ఆటలమ్మ లాంటి అంటు రోగాలకు గ్రామదేవతల ఆగ్రహించటం వలన వచ్చాయని నమ్మటం.
9. గ్రహణాలు పట్టిన సమయంలో భోజనం చేయకూడదు అనటం, ఆహార పదార్థాలలో గడ్డిపరకలు వేయటం, గర్భిణీలు, చిన్నారులు అసలు బయటికి రాకూడదని ఆంక్షలు పెట్టడం.
10. గ్రహణం పట్టిన రోజున గ్రహణం వీడే వరకు దేవాలయాలను మూసివేయటం.
11. గ్రహణం ఏర్పడడానికి కారణం రాహు కేతువులు సూర్యుని, చంద్రుని మింగటమే కారణమని గుడ్డిగా నమ్మటం.
12. బయలుదేరినప్పుడు ఎవరైనా తుమ్మితే వెనక్కు వచ్చి కాసేపు కూర్చొని మంచినీళ్లు తాగి వెళ్ళటం.
13. కాకి తల మీద తన్నితే ఆ కాకి శని వాహనం అని ఆ వ్యక్తికి శని పడుతుందని నమ్మటం.
14. బల్లి శరీరం మీద పడితే పడిన భాగాన్ని బట్టి అరిష్టం, లేదా ఫలితం ఉంటుందని నమ్మటం. బల్లి పడినవారు స్నానం చేసి కంచి ఆలయంలో ఉన్న బంగారు బల్లిని ముట్టుకొచ్చిన వారిని తాగితే అరిష్టం పోతుంది అని అనుకోవటం.
15. కేరళలో నాడీ శాస్త్రం పేరుతో మీరు గత జన్మలో ఫలానా అని వచ్చే జన్మలో ఫలానాగా జన్మిస్తారని చెప్తే నిజమని భ్రమ పడటం.
16. గోదానం చేసిన వారు చనిపోయిన తర్వాత వైతరణి నదిని సులభంగా దాటేయగలరని, గోదానం చేయని వారు సలసల కాగుతూ ఉండే నదిలో దిగి నడవవాల్సిందేనని పూజారులు చెబితే నిజమే కాబోలు అని అనుకోవటం.
17. చనిపోయిన మనిషిని బ్రతికిస్తామని ఆ శవం వద్ద పూజలు నిర్వహిస్తే నిజంగానే బ్రతికి వస్తాడని అనుకోవడం.
18. మానసిక స్థిమితం లేని మనిషిని డాక్టర్ వద్దకు కాక భూత వైద్యుడు పాలు చేయడం. వాడు కొట్టే దెబ్బలు తట్టుకోలేక చివరకు మరణించడం.
19. బ్రదర్ అనిల్ కుమార్ అనే క్రైస్తవ మత ప్రచారకుడు నేను కరోనాను తొక్కేశాను. ఇక మనకు కరోనా రాదని చెప్తే నమ్మటం.
20. చిలుకూరు బాలాజీ గుడి పూజారి అయిన రంగరాజన్ అనే ఆయన తనకుబాలాజీ కలలో కనబడి మన దేశానికి కరోనా అసలే రాదని చెబితే అది నిజమేనని విశ్వసించటం.
21. ఏ మాత్రం వాస్తవం లేని వాస్తు, జ్యోతిష్యాన్ని నమ్మటం.
22. కల్వరి ఆయిల్ పూయటం, లేదా సేవించటం వలన స్వస్థత చేకూరుతుంది అని అనుకోవటం.
23. హస్త సాముద్రికం అంటే చేతిలోని రేఖలు చూసి భవిష్యత్తు చెప్పటం. ఇలాంటివన్నీ మూఢనమ్మకాలే. మనం నిత్యం మన

జీవితంలో చూస్తున్నవే. ఎదురవుతున్నవే. ఇలాంటి మూఢనమ్మకాలు ఇంకా చాలానే ఉన్నాయి.

> "కంప్యూటర్లు, ఇంటర్నెట్లు రాకెట్లు సాటిలైట్స్ సెల్ ఫోన్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పరుగులు తీస్తున్న ఈ కాలంలో కూడా ఇంకా మూఢనమ్మకాల ఊబిలో చిక్కుకుపోయి ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. వాస్తవానికి అది ఒక సామాజిక వైఫల్యం. ఈనాడున్న సామాజిక రుగ్మతల వలన సమాజం తగినంతగా అభివృద్ధి కాకపోవటానికి ఈ మూఢనమ్మకాలే కారణం."

ఒక ప్రక్క శాస్త్రవేత్తలు విశ్వ రహస్యాలను ఛేదిస్తూ సమాజానికి దిక్సూచిగా, దశ దిశను చూపిస్తూ ఉంటే మరోపక్క మూఢనమ్మకాలతో ప్రాణాలపహరణం జరుగుతూ ఉండటాన్ని చూస్తూనే ఉన్నాము. దైవదూతలం అని చెప్పుకు తిరిగే ఈ పూజారులు, బాబాలు, మఠాధిపతులు, పీఠాధిపతులు, మౌల్వీలు పాస్టర్లు, వీరందరూ కరోనా సమయంలో మాస్కులు పెట్టుకోక తప్పలేదు. దైవదూతలకు భయము ఎక్కువగా కాబోలు కరోనా పాజిటివ్ వస్తే హాస్పిటల్ లో చేరి వైద్యం చేయించుకున్నారు. వీరికి ఎలాంటి మహత్తులు లేవని వీరు కూడా సాధారణ మనుషులేనని కరోనా ముందు అందరూ సమానులే అని కరోనా తేల్చి చెప్పింది.

ఈ మూఢనమ్మకాలవలన మన సమాజం అనేక దుష్ఫలితాలను ఎదుర్కొంటుంది. చేతబడి చేశారని పళ్ళు పీకటం, సజీవ దహనం చేయటం, వివస్త్రలను చేసి ఊరేగించడం, కొట్టి చంపడం లాంటి దుశ్చర్యలకు పాల్పడటం మనం చూస్తూనే ఉన్నాం. జగిత్యాల జిల్లా మేడిపల్లిలో నాలుగేళ్ల క్రితం మంత్రాలు చేశాడన్న నెపంతో ఓ వ్యక్తిని ఇద్దరు వ్యక్తులు దారుణంగా చంపివేశారు. నేషనల్ క్రైమ్ బ్యూరో ప్రకారం 2000-2012 మధ్యకాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో "వశీకరణం" మంత్ర విద్య నిర్వహిస్తున్నారని నెపంతో దాదాపు 350 మందిని చంపారు. అంతెందుకు మదనపల్లిలో జరిగిన సంఘటన ఏమిటి? విద్యాధికులైన తల్లిదండ్రులు బాగా చదువుకున్న ఇద్దరు కూతుళ్లను, పునర్జన్మ ఉన్నదని నమ్మి, శివుడు బ్రతికిస్తాడు అన్న గుడ్డి నమ్మకంతో వారిద్దరి కూతుళ్ళను చంపటం సమాజం చేష్టలుడిగి చూస్తూనే ఉన్నది. ఇలాగా ఈ మూఢనమ్మకాలు మనిషిని మానసికంగా వైజ్ఞానికంగా ఎదిగే క్రమాన్ని ధ్వంసం చేస్తుంది.

కాశ్మీర్ లోని కథువా గ్రామంలో 8 సంవత్సరాల అసిఫా అనే అమ్మాయిని దుర్గామాత గుడిలోనే పూజారితో పాటు ఆరుగురు అత్యంత కిరాతకంగా అత్యాచారానికి తెగబడి చంపేశారు. ఆలయంలోనే అంత దారుణం జరుగుతుంటే ఆయుధాలు ధరించిన దుర్గామాత చూస్తూ ఉండిపోయిందేమి? ఆ అమ్మాయిని కాపాడలేదు ఎందుకు? అలాంటి క్రూరత్వానికి పాల్పడిన వారిని శిక్షించలేదు ఎందుకు? అల్లా కానీ యేసులు కానీ ఎవరూ కాపాడలేకపోయారు ఎందుకు? ఇలాంటి ప్రశ్న మనం వేసుకోవాలి కదా! మనిషే దేవుడు అనే భావనను సృష్టించుకుని, తను సృష్టించిన ఆ దేవుడి ముందు సాగిల పడుతున్నాడని ఈ సంఘటన రుజువు చేయటం లేదా?

మహిళలలో ఏర్పడే నెలసరి రుతుక్రమాన్ని అన్ని మతాలలో కూడా అశుభ సూచికంగానే చూస్తారు. ఐదు రోజులపాటు అస్పృశ్యతను పాటిస్తూ ఒకే గదికి పరిమితం చేస్తారు. ఇటీవల కాలంలో వివాదాస్పద అయ్యప్ప గుడిలోకి మహిళలు ప్రవేశించడానికి ఈ నెలసరి రుతుక్రమాన్ని సాకుగా చూపిస్తున్నారు. అన్ని వయస్సుల మహిళలు గుడిలో ప్రవేశించి దర్శించుకోవచ్చునని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ ఈ మనువాద... మతవాదులు మహిళల ప్రవేశాన్ని అడ్డుకోవడం చూసాము. అజ్ఞానం, రాజకీయ లబ్ధి పొందటం కోసం ఈ మతవాదులు ఆడుతున్న నాటకం కాదా ఇది? స్త్రీలకు వచ్చే నెలసరి అనేది ప్రకృతి సహజమైన ప్రక్రియ. రుతుస్రావం అన్నది స్త్రీల శరీరంలోని వ్యర్థపదార్థం. ఆ వ్యర్థాన్ని విసర్జించాల్సిందే కదా! మగవారు వాళ్ళ శరీరంలోని వ్యర్థాన్ని ప్రతిరోజు విసర్జించటం లేదా? మరి వారు పవిత్రులు ఎలా అయ్యారు? వారికి ఆ గుడిలోకి ప్రవేశ అనుమతి ఉన్నది కదా! అలాగే వ్యర్థాన్ని విసర్జించే ఆడవారు అపవిత్రులు ఎలా అయ్యారు? మరి దీన్ని హేతు బద్ధంగా ఆలోచించే పనే లేదా? గుడ్డిగా మూఢత్వాన్ని పట్టుకు వేలాడటమేనా?

దేవుడి వద్ద సేవికులుగా నియమించబడ్డ స్త్రీలు జోగిని, దేవదాసి, బసివి పేర్లతో ఉన్నవారు వారి జీవితాలు దుర్భరంగా, సామాజిక వివక్షతకు గురైై తీవ్ర బాధలు అనుభవిస్తూనే ఉన్నారు. వీరికి పేరుకు మాత్రమే దేవుడితో పెళ్లి చేస్తారు. కానీ వారు మాత్రం ఊరుమ్మడి ఆస్తి. ఒక మాటలో చెప్పాలంటే దేవుడి పేరుతో చేస్తున్న వ్యభిచారం. దానికి బలైై ఆ స్త్రీలు దుర్భర జీవితాలను వెళ్ళతీస్తూనే ఉన్నారు. ఇది మూఢత్వం నుండి పుట్టిన దురాచారం కాదా? అజ్ఞానం నుండి ఆవిర్భవించింది కదా? పెత్తందారీ తన నుంచి పుట్టింది కాదా? ఈ ఆధునిక సమాజంలో కూడా ఇలాంటివి కొనసాగటాన్ని మనం ఎలా చూడాలి?

పిల్లలు పుట్టకపోయినా, మగ పిల్లవాడు కలగకపోయినా అదంతా భార్యదే తప్పు అన్నట్లుగా ఆమెను ఇంటి నుండి వెళ్లగొట్టడానికి సైతం వెనకాడరు భర్త అత్తమామలు. పురుషుడి వీర్యంలో స్పెరండెన్సిటీ 20 మిలియన్ల నుండి 200 మిలియన్ల వరకు ఉండాలి. 20 మిలియన్ల కన్నా తక్కువ ఉంటే పిల్లలు పుట్టరు. ఈ విషయం తెలుసుకోవటానికి డాక్టర్ల వద్దకు వెళ్లాలి కానీ భూత వైద్యులను, తాయత్తులను, గుడుల చుట్టూ ప్రదక్షిణాలను చేస్తే ఉపయోగం ఏమిటి?

అలాగే స్త్రీ పురుషులలో చెరి 23 జతల క్రోమోజోములు ఉంటాయి. 22 జతలు ఇద్దరిలో ఒకేలాగునే ఉంటాయి. పురుషుడిలోని 23వ జత కారణంగానే పుట్టబోయే బిడ్డ లింగ నిర్ధారణ జరుగుతుంది. స్త్రీలు 23 జతలలోనూ ''ఎక్స్ ఎక్స్''క్రోమోజోములు ఉంటే, పురుషుడి 23వ జాతిలో "ఎక్స్ వై "క్రోమోజోములు ఉంటాయి. స్త్రీలో అండం ఫలదీకరణ చెంది పిండంగామారాలంటే పురుషుడిలో ఏదో ఒక క్రోమోజోము స్త్రీ అండంతోకలవాలి. మగవాడిలో 23వ జతలో ఉన్న "ఎక్స్" క్రోమోజోమ్ వెళ్లి స్త్రీలోని "ఎక్స్, ఎక్స్" క్రోమోజోములతో కలిస్తే ఆడపిల్ల పుడుతుంది. అలాగే పురుషుడిలోనే 23వ జతలోని "వై "క్రోమోజోమ్ వెళ్లి స్త్రీ అండంలో "ఎక్స్, ఎక్స్" తో కలిస్తే మగ పిల్లవాడే పుడతాడు. అంటే పుట్టబోయే బిడ్డ ఆడ లేదా మగ అన్నది

> **"మానవ సమాజాలు సైశవ దశలో ఉన్నప్పుడు ప్రకృతిలో జరిగే పరిణామాలు చూసి గాబరాపడ్డారు. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, ఉరుములు, మెరుపులు, వరదలు, కార్చిచ్చు ఏర్పడి అడవులు దహనం అవటం, అగ్నిపర్వతాలు పేలిపోవడం ఇలాంటివన్నీ ఎలా సంభవిస్తున్నాయో తెలియక తికమకపడ్డారు. అందువలన ప్రకృతి శక్తులకు మానవీయ రూపకల్పన చేసుకుని ఆరాధించారు. అలా అజ్ఞానం నుండే దైవ భావన అంకురించింది."**

నిర్ధారించేది పురుషుడిలోని "ఎక్స్, వై" క్రోమోజోములే. ఆడ లేదా మగ పుట్టడానికి పురుషుడే కారణం కానీ స్త్రీ ఏమాత్రం కాదు. మగ పిల్లవాడిని కనలేదని భార్యలను నిందించే భర్తలది అజ్ఞానంతో కూడుకున్న మూఢత్వమే. ఈ అజ్ఞానమే మూఢత్వానికి నాంది. మూడత్వం అన్నది చీకటి కన్నా గాఢమైనది. ఈ రకమైన మూఢత్వాలను వదిలించుకోకుంటే ఎంతో మంది అబలలు నిందలపాలవుతారు కదా!

ఈ రోజున చదువుకున్న వారిలో, మరీ విద్యాధికులలో కూడా వాస్తు పిచ్చి బాగా పట్టుకుంది. శీకాకాయ పౌడర్ వేసి కడిగిన వదలని జిడ్డు లాగా ఇది సమాజాన్ని పట్టి పీడిస్తున్నది. వాస్తు శాస్త్రం ఏం చెబుతున్నది? తెల్లని భూమి ఉత్తమమైనదట, అది తీయగా ఉంటుందట, అందులో బ్రాహ్మణులకు ఇళ్ల నిర్మాణమునకు సరైనదట.

ఎర్రని భూమి మధ్యమమట, అది కారంగా ఉంటుందట. దానిలో క్షత్రియులు ఇల్లు కట్టుకోవటానికి శ్రేయస్కరమట.

పసుపు రంగు భూమి అధమం అట, అది పుల్లగా ఉంటుందట. అది వైశ్యులకు యోగ్యమైనదట.

నల్లని రంగు భూమి అధమాధమం అట, అది చేదుగా ఉంటుందట. అందులో శూద్రులు ఇల్లు కట్టుకోవాలట. ఇల్లు కట్టుకోవాలి అంటే భూమి రంగు రుచి వాసన చూడాలని వాస్తు శాస్త్రం చెబుతుంది ఏంటి? అంటే వాస్తు శాస్త్రం కుల వ్యవస్థను స్థిరీకరిస్తుందన్నమాట. అంతేకానీ అది ఇంజనీరింగ్ ఎంత మాత్రం కాదన్నమాట. అందుకే ముఖ్యమంత్రులు మారినప్పుడల్లా వారి కులాలను బట్టి సచివాలయంలో మార్పులు చేయిస్తూ ఉంటారు ఈ వాస్తు మార్తాండ పండితులు. వాస్తు నిజంగా అంత గొప్పదే అయితే వాస్తు శాస్త్రం ప్రకారం కట్టిన సోమనాథ దేవాలయం మీద మహమ్మద్ ఘజిని అన్నిసార్లు దండయాత్రలు ఎందుకు చేసినట్లు? ధ్వంసం ఎందుకు చేసినట్లు? అందులోని ధన కనక వస్తు వాహనాదులను ఎందుకు దోచుకుని పోయినట్లు? ఈ ప్రశ్నకు మన వాస్తు మార్తాండ పండితులు సమాధానం చెప్పగలరా?

ఇక జ్యోతిష శాస్త్రం సంగతి చూద్దాం. గ్రహాల పరిభ్రమణము, నక్షత్రాల గమనము పరిశీలించిన ఒకనాటి ఖగోళ మేధావులు గ్రహణాలు ఎలా ఏర్పడుతున్నాయో, సూర్యోదయం సూర్యాస్తమయం ఎప్పుడు జరుగుతుందో, ఋతువుల చక్రం క్రమం తప్పకుండా ఎలా వస్తుందో నిర్దిష్టంగా చెప్పగలిగారు. దీనినే ఖగోళ విజ్ఞానం లేదా ఖగోళ జ్యోతిష్యం అని అన్నారు. గ్రహగతులు, నక్షత్రాల పరిశీలన కారణంగా ప్రకృతిలో నిర్దిష్టంగా కొన్ని జరుగుతున్నాయి కాబట్టి, అవి మనుషుల జీవిత చక్రం మీద కూడా ప్రభావం చూపుతాయి అనే ఫలిత జ్యోతిష్యాన్ని సృష్టించారు కొందరు పకీర్లు. మానవుల జీవిత చక్రానికి ఆకాశంలోని నక్షత్రాలకు గ్రహాలకు లంకె వేసి జీవితంలో జరిగే మంచి చెడువులను జాతకాలుగా రాసి ఆ కట్టు కథలను జ్యోతిష్యం అని పేరు పెట్టి నమ్మించే ప్రయత్నం జరుగుతున్నది. అసలు జ్యోతిష్యం కానీ వాస్తు గాని భూమి చుట్టూ గ్రహాలు, నక్షత్రాలు తిరుగుతున్నాయి అని తప్పు సిద్ధాంతం నుంచి పుట్టాయి. జ్యోతిష పండితులు నవగ్రహాలని వాటి చుట్టూనే వీరి లెక్కలు తిరుగుతూ ఉంటాయి. వీరి లెక్క ప్రకారం సూర్యుడు, చంద్రుడు, బుధుడు, శుక్రుడు, అంగారకుడు, గురువు రాహువు, కేతువు, శని, వీటిని నవగ్రహాలని అంటారు. ఈ గ్రహాలకు కూడా మళ్లీ కులం ఉన్నది. మీరు చెప్పే ఈ నవగ్రహాలలో సూర్యుడు అసలు గ్రహం కాదు అది స్వయం ప్రకాశకమైన నక్షత్రం. చంద్రుడు గ్రహం కాదు కేవలం భూమికి ఉపగ్రహం మాత్రమే. భూమి ఒక గ్రహం కానీ వీరి జ్యోతిష్యంలో అంటే నవగ్రహాలలో అది లేదు. రాహు కేతువు అనే గ్రహాలే లేవు. ఇవి చాయాగ్రహాలంటారు మరి వేటి చాయనోచెప్పలేరు. అలాగే నెప్ట్యూన్, ప్లూటో వీరి గ్రహాల జాబితాలో లేనే లేవు. అంటే వీరి జ్యోతిష్యం అని చెప్పే దానికి ప్రాతిపదికగా తీసుకునే గ్రహాల జాబితానే ఒక తప్పులతడుక. ఇలా చెప్పటం మూఢత్వమేకాదు మోసం కూడా. ఇలాంటి జ్యోతిష్యాన్ని చెప్పేవారిని గురించి వివేకానందుడు ఈ మూఢనమ్మకాల ఊర కుక్కలను బయటికి తోలెయ్యండి అని అన్నాడు. మహర్షి దయానంద సరస్వతి, చక్రవర్తి రాజగోపాల చారి, స్వామి అగ్నివేష్, సివి రామన్, భారత ప్రభుత్వ సాంకేతిక సలహాదారుగా పనిచేసిన సి.ఎన్.ఆర్. రావు గారు లాంటి ప్రముఖులు ఈ జ్యోతిష్య శాస్త్రం పరమ బూటకం అన్నారు. అయినా మన దేశంలో ఈనాడు 2500 కోట్ల రూపాయల జ్యోతిష్య వ్యాపారం జరుగుతున్నది. పైసా పన్ను కట్టకుండా. పాలకవర్గాలు వీళ్ళ మీద చర్యలు తీసుకోవడం మాని ఇంకా ప్రోత్సహించడం అత్యంత విషాదం.

ఇప్పుడు విశ్వవిద్యాలయాలలో భూత వైద్యం ప్రవేశపెడుతున్నారట మన ఏలికలు. తాంత్రిక మాంత్రికా టక్కు టమార విద్యలలో ఆరితేరిన మాంత్రికులే అధ్యాపకులన్నమాట. సైన్స్ చదువుకునే విద్యార్థులకు పరిశోధనలు, ప్రాక్టికల్స్ చేయటం కొరకు విద్యాలయాల్లో లేబరేటరీలు ఉంటాయి. మరి భూత వైద్య విద్యార్థులకు స్మశానాలేనా లేబరేటరీలు. దెయ్యాలు పిశాచాల మీద ప్రాక్టికల్స్ నేర్పిస్తారా? ఇది వినటానికే ఎబెట్టుగా లేదూ! మనం మధ్యయుగాల్లోకి వెళుతున్నామా లేక ఇంకా అంతకు ముందున్న రాతి యుగానికి చేరుతున్నామా ఆలోచించు వద్దా!

మానవ సమాజాలు సైశవ దశలో ఉన్నప్పుడు ప్రకృతిలో జరిగే పరిణామాలు చూసి గాబరాపడ్డారు. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, ఉరుములు, మెరుపులు, వరదలు, కార్చిచ్చు ఏర్పడి అడవులు దహనం అవటం, అగ్నిపర్వతాలు పేలిపోవడం ఇలాంటివన్నీ ఎలా సంభవిస్తున్నాయో తెలియక తికమకపడ్డారు. అందువలన ప్రకృతి శక్తులకు మానవీయ రూపకల్పన చేసుకుని ఆరాధించారు. అలా అజ్ఞానం నుండే దైవ భావన అంకురించింది. ప్రకృతి విపత్తుల నుండి కాపాడమని వారు ఏర్పరచుకున్న దైవభావనకు వారే లొంగిపోయి

(మిగతా 33వ పేజీలో)

# వేద కాలంలో మహిళలు : లింగ వివక్ష

జాఫర్ హబీబ్

వేదకాలం 'మహిళల స్వర్ణ యుగం' అని, మహిళల హక్కులు, సమాజంలో వారి పాత్ర, స్థానం, ప్రాచీన కాలంలో దేదీప్యమానంగా వెలిగేవని, మొఘలులు భారతదేశానికి రాకముందు మహిళలకు సమానహోదా ఉండేదని, నిజానికి పురుషులకంటే ఉన్నతంగా చూడబడేవారనే భ్రమలో ఇప్పటికీ మనమున్నాము. ఈ వ్యాసంలో ఆ విషయం గురించి చర్చించుకుందాము.

కొన్ని మాధ్యమాలలో వేదకాలంలో మహిళలు సమున్నత స్థానాన్ని అనుభవించారని దావా చేయడం, ప్రచారం చేయడం కద్దు. వేదకాలం మహిళల స్వర్ణయుగంగా చెప్పుకోవడం చూస్తుంటాము. కృష్ణగోపాల్ అనే ఆర్ ఎస్ ఎస్ నాయకుడయితే, "వేదకాలంలో మహిళలు సమాన హోదా కలిగి ఉండేవారు. అది వారి స్వర్ణ యుగం. కేవలం ముస్లింల దండయాత్రల తరువాతే మహిళల పరిస్థితి దిగజారింది" అనే వరకు వెళ్లారు. ఈ వాదన మనల్ని మరో అడుగు ముందుకు తీసుకెళుతుంది. వేదకాలం మహిళల స్వర్ణ యుగం అని గనక ఒప్పుకుంటే, ఈనాటి మహిళల దుర్భర పరిస్థితులకు కారణాలు ఏమిటో చర్చించుకోవలసి వస్తుంది. ఈ ప్రశ్నకు మొగలులు భారతదేశం దండెత్తిన తరువాతే మహిళల పరిస్థితి దిగజారిందని సమాధానం చెపుతున్నారు. ఇది నిజమేనా? ఈ ప్రశ్నకు సమాధానం వెతికేందుకు ఇప్పుడు మనం, వేదకాలంలో, ఆ తరువాత మహిళల పరిస్థితిని పరిశీలించవలసిన అవసరం ఏర్పడింది.

ప్రాచీన భారతంలో మహిళల పరిస్థితి ఎలా ఉండేదో తెలుసుకోడానికి అనేక బ్రాహ్మణుల గ్రంథాలు – ఋగ్వేద కాలం నుండి మహాభారతం వరకు, మనుస్మృతి – పరిశీలించవలసి ఉంటుంది. అయితే ఈ గ్రంథాల నుండి గ్రహించగల చరిత్ర పరిమితమైనదనే విషయం గుర్తించాలి. మరింత శాస్త్రీయమైన, బోధక గ్రంథాలు పరిశీలించినపుడు కూడా, ఇవి బ్రాహ్మణ పురుషులు రచించిన గ్రంథాలన్న విషయం గమనంలో ఉంచుకోవాలి. అందువలన ఈ గ్రంథాలన్నిటిలో పురుష బ్రాహ్మణులకు అనుకూలమైన విషయాలు ఉంటాయి. లేదా వారి దృక్పథంతో సమాజంలోని వివిధ మౌలికాంశాల పనితీరు కనిపిస్తుంది. అందువలన వీటి ఆధారంగా ప్రాచీన మహిళల చరిత్రను గ్రహించ గలగడానికి పరిమితులు ఉంటాయి. ఒకవేళ చరిత్రను గ్రహించగలిగినా, అది మహిళ లందరికి సంబంధించిందా, లేక మహిళలలో ఒక తరగతి చరిత్ర మాత్రమేనా అనే మీమాంస కూడా వస్తుంది. మహాభారతం లాంటి పౌరాణిక గ్రంథాలలో పాత్రలు ప్రత్యేకమైనవి. సర్వ సాధారణమైనవి కావు. అంటే భారతంలోని ఒక స్త్రీ పాత్ర మహోన్నతంగా చిత్రించబడినంత మాత్రాన, ఆనాటి సాధారణ స్త్రీ సమాజంలో అంతటి మహత్తర పాత్ర పోషించగలదని భావించలేము. ఆ గాథలలో స్త్రీలు అసాధారణ వ్యక్తులు కనకనే వారు ఆయా పాత్రలలో నిలిచారు.

తరచి చూస్తే, ఈ కథలలో కూడా సామాన్య మహిళలు కుటుంబాలకే పరిమితయ్యారు. కేవలం కూతుళ్ళగానో, అమ్మలగానో, భార్యలగానో చిత్రించబడ్డారు. ఆర్ ఎస్ ఎస్ వారు మహిళలు నిర్వహించే ఈ పాత్రలలోనే వారికి సముచిత గౌరవం దక్కేదని అంటారు. కొంతమందయితే పురుషులకంటే మహిళలకే ఎక్కువ గౌరవం దక్కేదని కూడా వాదిస్తూ ఉంటారు. మరికొందరంటారు, ఆ నాటి సమాజంలో ఒక్క భార్యను తప్ప మిగిలిన స్త్రీలందరిని తల్లితో సమానంగా చూసేవారని, ఆడపిల్లలందరిని తమ సొంత పిల్లలుగా చూసేవారని దావా చేస్తుంటారు. అందువలన ఆనాటి మన ప్రాచీన గ్రంథాల ప్రకారం అమ్మలను, ఆడపిల్లలను, భార్యలను ఎలా చూసేవారో తెలుసుకోవలసిన అవసరం ఏర్పడింది.

వేదకాల సమాజంలో చాలాగ్రంథాలను పరిశీలిస్తే, ఆడపిల్లలను ఏమాత్రం ఇష్టపడేవారు కాదని, కేవలం మగ పిల్లలనే కోరుకునే వారని అర్థం అవుతుంది. అయిత్రేయ బ్రాహ్మణం లోని ఒక పద్యం లో "భార్య సహచరి, కూతురు దుఃఖం, కొడుకు అత్యుత్తమ స్వర్గలోకంలో ఉన్నతమైన కాంతి" అని ఉంది. దీనివలన కూతురిని దుఃఖదా యినిగా పరిగణించేవారని అనుకోవలసి వస్తుంది. అదే కొడుకుని కుటుంబానికంతటికీ రక్షకుడుగా భావించేవారు అని స్పష్టంగా తెలుస్తుంది. ఇక అథర్వణ వేదంలో చూలాలి గర్భంలో ఉన్న మగ బిడ్డను ఆడబిడ్డలుగా రాక్షసులు మార్చేస్తారు కాబట్టి ఆమెను దానవుల నుండి రక్షించాలని వ్రాసుకున్నారు. "మగపిల్లలను అడపిల్లలుగా, మార్చనీయకూడదు" అన్నారు. ఆడపిల్లలు కేవలం వస్తువులుగా పరిగణించబడేవారు అని ఆయా గ్రంథాలు పరిశీలిస్తే అవగతం అవుతుంది. ఉమా చక్రవర్తి అనే ప్రముఖ చరిత్రకారిణి, "రాజకుమార్తెలు కూడా రాచరిక సంపదలాగా తమ తండ్రులచేత పరిగణించబడే వారని" వ్రాసారు. "జనశృతి పౌత్రేయుడు, తాను జ్ఞానం పొందడానికి తన అందమైన పుత్రికను రైక్వ అనే నిమ్న జాతి వానికి కట్టబెట్టడానికి ఏ మాత్రం వెనకాడలేదు."

ఆడపిల్లగా, భార్యగా, తల్లిగా, మహిళపై ఆనాడు కూడా అనేక పరిమితులు విధించబడేవి. మనుస్మృతి, మహిళలు స్వతంత్రంగా ఏ నిర్ణయం, ఆఖరికి గృహానికి సంబంధించిన విషయాలలో కూడా, తీసుకోకూడదని స్పష్టం చేసింది. పైగా మహిళ తన జీవిత కాలంలో ఎవరెవరికి విధేయంగా ఉండాలో స్పష్టం గా చెప్పింది. "బాల్యంలో తండ్రికి, యవ్వనంలో భర్తకి, ఆయన తదనంతరం వృధాప్యంలో కుమారుడికి విధేయంగా ఉండాలి. ఏనాడూ స్వతంత్రంగా ఉండకూడదు." మహిళలు ఎంత ఆస్తులను తమ అధీనంలో ఉంచుకోవాలో, అవి ఏ రూపంలో ఉండాలో కూడా నిర్ణయించబడ్డాయి. ఈ గ్రంథాలు వివాహం కాని అమ్మాయిలు –కుమారిలు – ఎటువంటి ఆస్తులు తమపేరులో ఉండడానికి అర్హులు కారని అన్నాయి. కేవలం వివాహమైన మహిళలు మాత్రమే కొంత పరిమిత మైన ఆస్తులు తమ అధీనంలో ఉంచుకోవచ్చు. అది స్త్రీ ధనం రూపంలో ఉండవచ్చు. ఇది వివాహ సమయంలో ఆమె తల్లితండ్రులు ఇచ్చినది అయి ఉంటుంది. అయితే దానిమీద కూడా ఆమెకు సర్వాధికారాలు ఉండవు. అదికూడా చివరికి ఆమె భర్తకు చెందుతుంది.

ఇక క్రతువులలో కూడా, ఆడపిల్లలకి, అక్క చెల్లెళ్ళకి, అమ్మలకి ఏ బాధ్యతలు అప్పచెప్పబడ లేదు. భార్య సంతానాన్ని కంటుంది కాబట్టి, ఆమెకు కీలకమైన పాత్ర

**“ ప్రాచీన కాలంలో మహిళల స్థితి గతులు మెరుగుగా ఉండేవని, మహిళల స్థాయి ఆనాటి పురుషుల స్థాయికి మించి ఉండేదని చెప్పేందుకు చేసే ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. అవన్నీ మహిళా ఉద్యమాలను అవమాన పరిచేవే. ఈ క్రమం, శతాబ్దాలుగా తమ గొంతుకలు వినిపించేందుకు మహిళలు చేస్తున్న అనేక పోరాటాలను విస్మరిస్తున్నది. ఈనాడు సాధించిన పురోగతి అనాదిగా ఉందనడం అంటే మహిళలు తమ అభివృద్ధి కోసం చేస్తున్న పోరాటాలను ఉపేక్షించడమే. ”**

ఉంది. పిల్లలను కనడానికి అవసరమైన క్రతువులో ఆమె భాగస్వామ్యం తప్పనిసరి. సన్యాసినుల ప్రస్తావన కూడా అంతంత మాత్రంగానే ఉంది. మహిళల సమానత్వం గురించి ప్రము ఖంగా చెప్పుకునే ఉదంతం, గార్గి ఉదంతం. గార్గి అనే మహిళ ముని కన్య, ఒకానొక రాజ సభలో జరిగిన చర్చలో యజ్ఞ వల్క్యుడిని ఆమె ప్రశ్నించింది. ఈ ఉదంతాన్ని ఆనాడు మహిళ లకి విద్య అభ్యసించే అవకాశాలు పుష్కలంగా ఉండేవని, రాజ సభలలో కూడా ప్రశ్నించే అవకాశాలు ఉండేవని, బ్రాహ్మణులను స్త్రీలు ప్రశ్నించేవారని చెప్పడానికి ఉటంకిస్తుంటారు. కానీ ఆ సభలోనే యాజ్ఞవల్కుడు సమాధానం చెప్పలేని ప్రశ్నని గార్గి అడగగానే, యాజ్ఞవల్క్కు డు ఆమెను అణచేస్తాడు. "గార్గి, నీ ప్రశ్నించడాన్ని మరీ ముందుకు పోనియ్యకు. అదే జరిగితే నీ తల నేల వాలుతుంది" అంటా డు . ఫలితంగా గార్గి మౌనం వహిస్తుంది. అంటే గార్గి అడగరాని ప్రశ్న అడిగిందన్న మాట. యాజ్ఞవల్కుడి ప్రకటనను ఏ విధంగా అర్థం చెప్పుకున్నప్పటికీ, నిండు సభలో అలా మాట్లాడడం అంటే, మహిళల నోరు నొక్కేయడం, బెదిరించడం అన్నది స్పష్టం.

ఇంకో గమనించాల్సిన అంశం, ఈ గ్రంధాలలో ఉదంతాలు అన్నీ ఉన్నత తరగతి మహిళలకు సంబంధించిన కథలే. గార్గి, జనశృతి పౌత్రేయ రాజు కూతురు. అనేక ఇతర తరగతులకు, కులాలకు చెందిన మహిళలు ఏ రకమైన అణచివేతలు ఎలా అనుభయ వించారో తెలుసుకోగలిగితే బాగుంటుంది. అణగారిన తరగతుల మహిళలు ఎదుర్కొన్న అణచివేత, ఉన్నత మహిళలు ఎదుర్కొన్న అణచివేతకు రెట్టింపు ఉంటుంది. కులాలు, తరగతుల ఆధారంగా కూడా అణచివేత ఉంటుందన్న విషయాన్ని గమనంలో ఉంచుకో వాలి. కొన్ని రకాల అణచివేతలు కొన్ని సమూ హాలకి ప్రత్యేకంగా పరిమితం అయి ఉండవచ్చు.

అందువలన, సమగ్రమైన అవగహన ఏర్పరచుకోడానికి చరిత్రకారులు వివిధ రకాల మౌలికాంశాలపై ఆధారపడతారు. ఈ సంద ర్భంలో, అటువంటి మౌలికాంశాలలో ఒకటి తెరిగథాగా పరిగణించవచ్చు. తెరిగ థాలు బౌద్ధ తెరీలు, లేదా ముసలి సన్యాసినుల నుండి సేకరించిన పాటలు. వీటిని 80 సిబిసి లలో వ్రాసారు. ఉమా చక్రవర్తి, కుంకుం రాయ్ లు తమ 'విమెన్ రైటింగ్ ఇన్ ఇండియా 'పుస్త కంలో ఈ పాటల అనువాదాలు ప్రచురిం చారు. ముత్త అనే ఒక బౌద్ధ మహిళా సన్యాసిని పాడిన పాట ఇది :

“నేను విముక్తి పొందాను
మహోజ్వలంగా,
చిల్లర పనుల నుండి,
భౌతిక శ్రమ నుండి,
బండ చాకిరి నుండి,
నా యజమాని అర్థం పర్థం లేని ఆజ్ఞలనుండి.
పునర్జన్మ నుండి,
చావునుండి,
నేను విముక్తి పొందాను.
నన్ను నేలచూపులు చూసేట్టు చేసిన ప్రతి భావనను,
దూరంగా విసిరేసాను కసితో.”

సుమంగళ మాత అనే మరో సన్యాసిని పాట కూడా ఈ విధంగానే ఉంది.

‘‘మహాద్భుత విముక్తి పొందిన మహిళను నేను,
ఎంతటి స్వేచ్ఛ, ఎంతటి అద్భుతం,
వంటింటి పోరు లేదు, ఆకలిబాధ లేదు,
చుట్టూ వంట పాత్రలు లేవు, అనైతిక పురుషులు లేరు,
చిక్కని నేతలా నా చుట్టూ నీడ నల్లిందీ విముక్తి.”

ఈ పాటలన్నీ ఆనందోత్సాహంతో పాడుకున్నవే. బౌద్ధ సన్యాసినులు సమాజంలో తమ గత జీవితలలోని బంధనాలను వదిలిం చుకోగలిగిన ఆనందంలో పాడుకున్నవే.

ఆర్ఎస్ఎస్ వారు ఈనాటి సమాజంలో మహిళల దిగజారిన పరిస్థితులకి కారణం మొగలులని అంటుంటారు. వారిని బలిపశువులను చేస్తుంటారు. నిజానికి తరతరాలుగా మహిళలు అనుభవిస్తున్న వివక్షత, అన్యాయం మొగలుల కాలంలో కూడా కొనసాగింది. సతీసహగమనం, మేలిముసుగులు వేసుకోవాల్సి రావడం మొగలుల కాలంలో కొనసాగడం మనకు తెలుసు. ఇది ముఖ్యంగా ఉన్నత వర్గాలలో అమలయ్యేది. అయితే, మొఘలులు బలవంతంగా సతినహగమనం చేయించడాన్ని తమ పాలనలో ఉన్న ప్రాంతాలలో ఆపేందుకు చేసిన ప్రయత్నాల ఉదంతాలు అనేకం. అక్బర్ బలవంతంగా సతీసహగమనం చేయించడాన్ని నిషేధిస్తూ శాసనం చేసాడు. ప్రతి నగరం లోనూ అధికారులను నియమించి బలవంతంగా సతీ సహగమనం చేయించ కుండా నివారించడానికి చర్యలు తీసుకు న్నాడు. తానే స్వయంగా కొన్ని సందర్భాలలో జోక్యం కూడా చేసుకున్నాడు. జహంగీరు భ్రూణ హత్యలను కూడా నివారించేందుకు చర్యలు తీసుకున్నాడు. ఇంతచేసినా, సతీసహగమనం కొనసాగింది. అయితే, వాటి సంఖ్య తగ్గించడంలో మాత్రం సఫలీకృతు లయ్యారు. భారత సమాజాలలో మహిళల అణచివేత చారిత్రికంగా నిరంతరంగా కొనసాగుతూనే ఉంది. కేవలం ఆధునిక కాలంలోనే సాపేక్షికంగా మహిళలు మెరుగైన స్థాయిని చేరుకోగలిగారు. మెరుగైన జీవితాలు అనుభవించగలుగుతున్నారు.

ప్రాచీన కాలంలో మహిళల స్థితి గతులు మెరుగుగా ఉండేవని, మహిళల స్థాయి ఆనాటి పురుషుల స్థాయికి మించి ఉండేదని చెప్పేందుకు చేసే ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. అవన్నీ మహిళా ఉద్యమాలను అవమాన పరిచేవే. ఈ క్రమం, శతాబ్దాలుగా తమ గొంతుకలు వినిపించేందుకు మహిళలు చేస్తున్న అనేక పోరాటాలను విస్మరిస్తున్నది. ఈనాడు సాధించిన పురోగతి అనాదిగా ఉందనడం అంటే మహిళలు తమ అభివృద్ధి కోసం చేస్తున్న పోరాటాలను ఉపేక్షించడమే. పురుషులతో సమాన హక్కులు, స్థానం, ఆధు నిక సమాజంలో కొంతమేరకు సాధించినా, ఆ దిశగా మహిళలు సాధించ వలసినది ఇంకా ఏంతో ఉంది. అటువంటప్పుడు ఈ రకమైన తప్పుడు ప్రకటనలు నిర్మాణాత్మకంగా ముందు కెళ్లడానికి ఏమాత్రం ఉపయోగపడవు. ❋

అంతర్జాతీయం

# యుద్ధ విస్తరణకు ఉవ్విళ్లూరుతున్న ఇజ్రాయిల్, అమెరికా


రచయిత మాజీ భారత దౌత్యవేత్త


**ఎంకె భద్రకుమార్**

పాలస్తీనాకు చెందిన గాజా ప్రాంతంపై ఇజ్రాయిల్ సైన్యం దాడులు జరుపుతున్న సమయంలో నవంబర్ 5, ఆదివారం అర్ధరాత్రి దోహాలోని అమెరికన్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) సైనిక స్థావరం ఒక ప్రకటన చేసింది. ఓహియో-తరగతి అమెరికన్ అణు జలాంతర్గాములను (సబ్‌మెరైన్స్) తనకు "బాధ్యత కలిగిన ప్రాంతంలోకి" తరలిస్తున్నామని ఆ ప్రకటన సారాంశం. ఇది పాలస్తీనా-ఇజ్రాయిల్ యుద్ధాన్ని మరింత విస్తరించేట్లు ఉంది.

వాస్తవానికి ఇటువంటి అణు జలాంతర్గాములను ఉపయోగించబోతున్నామని చాలా అరుదుగా మాత్రమే బహిరంగంగా ప్రకటిస్తారు. ఈజిప్టులోని సూయజ్ కాలువ వంతెన వద్ద ఓహియో-తరగతి అణు అణుజలాంతర్గామి ఉన్న చిత్రాన్ని స్పష్టంగా చూపుతూ సెంట్‌కామ్ పోస్ట్ చేసింది. ఆసక్తికరంగా పశ్చిమాసియాలో ఉన్న అణు బాంబర్ విమానమయిన "బి-1 బాంబర్" చిత్రాన్ని కూడా విడిగా షేర్ చేసింది.

పై సబ్‌మెరైన్లతో పాటుగా రెండు అణుయుద్ధ నౌకలనూ, యుద్ధ విమానాలనూ వాటితోపాటు వందలాది జెట్ ఫైటర్లను, రెండు విమాన నౌకలు, యుద్ధనౌకల్ని మోహరిస్తున్నట్లు అమెరికా విదేశాంగ కార్యదర్శి ఆంటోనీ బ్లింకెన్ ప్రకటించారు. ఇదంతా హమాస్, హిజ్బొల్లా, ఇరాన్‌లను దృష్టిలో పెట్టుకుని చేసిన పనే.

దీనికి సంబంధిచిన మరో పరిణామం ఏమంటే, అమెరికన్ కేంద్ర గూఢచారి సంస్థ


రచయిత అంకారాలోని భారతీయ జర్నలిస్టు

# దురాక్రమణే సమస్యకు మూలం

*మౌస్సా అబూ మార్జౌక్ అనే ఆయన కతర్ రాజధాని దోహాలో 'హమాస్' అంతర్జాతీయ సంబంధాల కార్యాలయం అధిపతి. ఫ్రంట్ లైన్ పత్రికకు ఆన్‌లైన్‌లో ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ విశేషాలను అక్టోబరు 23, 2023 ఫ్రంట్‌లైన్ పత్రిక ప్రచురించింది. అతడు హమాస్ మాజీ పోలిట్‌బ్యూరో అధిపతి. ఆ కాలంలో అతడు, హమాస్ నేత ఖలీద్ మషాల్‌కు వారసునిగా పరిగణించబడ్డాడు. 2017 మేలో హమాస్ అంతర్గత ఎన్నికల్లో ఓడిపోయాడు. కానీ, ఆ గ్రూపు రాజకీయ విభాగం కోర్ సభ్యునిగా కొనసాగుతున్నాడు. ఆయన కుటుంబం స్వతహాగా ఇజ్రాయిల్‌లోని 'యావ్‌నే' నుండి తరలి వచ్చింది. 1948లో రఫా శరణార్థుల శిబిరానికి బలవంతంగా తరలించబడింది. అక్కడే ఆయన జన్మించాడు. ఆయన 'ఫ్రంట్ లైన్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ విశేషాలు :*

**ఇఫ్తెఖర్ గిలానీ**

**ప్రశ్న :** అక్టోబరు 7న, ప్రపంచంలోని అత్యంత బలమైన సైనిక శక్తుల్లో ఒకటైన ఇజ్రాయిల్‌పై హమాస్ తలపడింది. ఆ చర్య ప్రపంచాన్ని ఆశ్చర్యపరచింది. అందుకు ప్రతిగా ఇజ్రాయిల్ అక్కడి పౌరులు, పసిపిల్లలను పాశవికంగా సంహరిస్తున్నది. హమాస్ వైఖరి సరైనదేనా అన్న ప్రశ్న ఉదయిస్తుంది. మీరేమంటారు?

**జవాబు :** ఈ అంకం అక్టోబరు 7నే ప్రారంభం కాలేదు. అనేక దశాబ్దాలుగా మా గడ్డపై (పాలస్తీనాపై) సాగుతున్న దురాక్రమణలే ఈ సమస్యకు మూలం. ఈ కాలమంతా మా ప్రజలపై వందలాది సామూహిక హత్యాకాండలు జరిగాయి, జరుగుతున్నాయి. ప్రతిఘటన ఉన్నా లేకున్నా ఇజ్రాయిల్ ప్రతి నిత్యం మా ప్రజలను సంహరిస్తున్నది. గాజా ప్రాంతంపై ఈ క్రూరమైన ముట్టడి గత 17 సంవత్సరాలుగా కొనసాగుతున్నది. ఈ దురాక్రమణల ద్వారా వారు గాజాలో ప్రజలు తినే ఆహారంలో కాలరీల వినిమయంపై కూడా పరిమితిని విధించగల్గుతున్నారు. ఇక్కడ పెద్ద సంఖ్యలో బాధితులున్నాయి. భారీ నష్టాలున్నాయి. గాజాలోని మెజారిటి యువజనుల భవిత ఛిద్రమౌతున్నది. అన్నింటికీ పరిష్కారం లొంగుబాటేనా? లొంగుబాటును కూడా ఇజ్రాయిల్ ఆమోదించటం లేదు. పాలస్తీనా వాసులను సమూలంగా సంహరించాలనీ, లేదా వారిని తమ మాతృభూమి నుండి తరిమేయాలని మాత్రమే ఇజ్రాయిల్ పాలకులు వాంఛిస్తున్నారు.

మాదొక విమోచన ఉద్యమం. పశ్చిమ దేశాలు బలపరుస్తున్న దురాక్రమణలకు వ్యతిరేక పోరాటమది. భారతీయులు బ్రిటీష్ దురాక్రమణను తిరస్కరించారు. అంతిమంగా వారిని బహిష్కరించారు. అలాగే, మేము కూడా దురాక్రమణల కింద

> "అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) తన త్రివిధ దళాలలో భాగమైన అణు జలాంతర్గాములను, అందులోనూ తన ఆయుధాగారంలో అతి పెద్దవైన ఓహియో తరగతి అణు జలాంతర్గాములను యుద్ధ ప్రాంతానికి తరలించడం అంటే అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈ యుద్ధాన్ని లెబనాన్‌కు విస్తరించి హిజ్‌బొల్లాను, చివరికి ఇరాన్‌ను కూడా యుద్ధంలోకి లాగడానికి చేస్తున్న ప్రయత్నమేనని అర్ధమవుతున్నది."

(సిఐఏ) డైరెక్టర్ విలియం బర్న్స్ అత్యవసర సంప్రదింపుల కోసం ఆదివారం ఇజ్రాయిల్ చేరుకున్నారు. "ఇజ్రాయిల్‌తో తమ గూఢచారి రహస్యాల మార్పిడిని మరింత విస్తరింపజేసే విషయంపై'' ఆయన చర్చలు జరిపారని న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది.

అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) తన త్రివిధ దళాలలో భాగమైన అణు జలాంతర్గాములను, అందులోనూ తన ఆయుధాగారంలో అతి పెద్దవైన ఓహియో తరగతి అణు జలాంతర్గాములను యుద్ధ ప్రాంతానికి తరలించడం అంటే అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈ యుద్ధాన్ని లెబనాన్‌కు విస్తరించి హిజ్‌బొల్లాను, చివరికి ఇరాన్‌ను కూడా యుద్ధంలోకి లాగడానికి చేస్తున్న ప్రయత్నమేనని అర్ధమవుతున్నది.

హిజ్‌బొల్లా అధినేత హస్సన్ నస్రుల్లా ఈ పరిణామాన్ని ముందుగానే ఊహించినట్లుంది. ఈ యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకుంటే 1980వ దశకం ప్రారంభంలో లెబనాన్ అంతర్యుద్ధంలో జోక్యం చేసుకున్నప్పుడు అమెరికాకు ఏమైందో ఇప్పుడూ అదే అవుతుందని ఆయన హెచ్చరించారు. లెబనాన్ అంతర్యుద్ధంలో పాల్గొన్న అమెరికాను నాడు హెజ్‌బొల్లా పెద్ద దెబ్బతీసింది. 1983 అక్టోబర్‌లో బీరుట్ అంతర్జాతీయ విమానాశ్రమం వద్ద అమెరికా సైన్యాలున్న స్థావరం వద్ద హెబ్బొల్లా ఆత్మాహుతి దాడిలో 220 మంది అమెరికా నౌకాదళ సైనికులు, 18 మంది నావికులు, ముగ్గురు సైనికులు మరణించారు. దాంతో అమెరికా వెనువెంటనే లెబనాన్ నుండి ఉపసంహరించుకుంది. విశేష మేమంటే ఆ ఘటన జరిగి ఈ ఏడాదికి సరిగ్గా నాలుగు దశాబ్దాలు అవుతోంది.

పశ్చిమాసియాలో అమెరికా దౌత్యం విఫలమైందని తేలిపోయింది. దాంతో ఇప్పుడు అది కొత్త మార్గం పట్టినట్లుంది. ఇజ్రాయిల్ చేస్తున్న ఘోరమైన యుద్ధ నేరాలపై అంతర్జాతీయంగా తీవ్రమైన విమర్శలు రావడంతో ఇప్పుడు బ్లింకెన్ కొత్త పల్లవి అందుకున్నారు. "మానవత్వంతో కూడిన కాల్పుల విరమణ" గురించి మాట్లాడుతున్నారు. కానీ ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ దీన్ని తీసి పక్కన పెట్టేశారు.

---

బతకాలని కోరటం లేదు. అందుకే మాకు స్వేచ్ఛ కావాలి.

గాజా సంక్షోభ టైం బాంబు పేలేందుకు సిద్ధంగా ఉంది.

**ప్రశ్న :** హమాస్ అనేక మంది పౌరులను చంపేసింది. పలువురిని బందీలుగా తీసుకెళ్లింది. వారిలో ఇజ్రాయిల్ పౌరహక్కుల నేత వివియన్ సిల్వర్ కూడా ఉన్నారు. ఆ చర్యల ఉద్దేశం ఏమిటి?

**జవాబు :** సాధారణ పౌరుల మరణాలపై ఇజ్రాయిల్ తప్పుడు లెక్కలిస్తున్నది. ఆ ప్రక్రియలో సజీవులుగా ఉన్న ఇజ్రయిలీల సాక్ష్యాలు, మా స్వాతంత్ర్య పోరాట యోధులకు ఆ మారణకాండతో సంబంధంలేదని ధృవపరుస్తున్నాయి. అంతేకాదు, ఆ సందర్భంగా ఆ యోధులు ఇజ్రాయిలీ పిల్లలను కాపాడేందుకు శ్రద్ధ తీసుకున్నట్లు వీడియో క్లిప్పింగులు నిరూపిస్తున్నాయి. మా స్వాతంత్రోద్యమ నాయకులొకరు ఒక అరటి పండు తీసుకుని తినేందుకు తన అనుమతి కోరినట్లు ఒక ఇజ్రయిలీ మహిళ చెప్పారు. అలా తినేందుకు అనుమతి కోరినవారు సాధారణ పౌరులను చంపగలరా?

ఇజ్రయిలీ సాధారణ పౌరులను, వారి సైనికులే చంపినట్లు ఆధారాలు కూడా ఉన్నాయి. మా పోరాట యోధుల పరిసరాల్లోని ఇళ్లపై వారి సైన్యం బాంబులు వేసింది. అనేక మంది సాధారణ పౌరులను మట్టుపెట్టింది. ఇజ్రాయిలీల చేతలే ఆ దుశ్చర్యలకు కారణమైనట్లు నిరూపితమౌతున్నది. మా యోధల వద్ద తేలికపాటి ఆయుధాలు మాత్రమే ఉన్నాయి. ఆ ప్రాంతంలో సంగీత ఉత్సవం జరుగుతున్నదన్న విషయమే హమాస్‌కు తెలియదు. ఆ ఉత్సవానికి హాజరైన వారిని హమాస్ చంపిదన్న ఇజ్రాయిల్ ప్రచారంలో వాస్తవంలేదు. మా పోరాట యోధులు ఆ ప్రాంతానికి చేరక ముందే ఇజ్రాయిల్ సైనికులు, రక్షక దళాలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరాయి. అందుకే ఆ ప్రాతం ఒక మిలిటరీ జోన్‌గా మారింది. ఘర్షణలు జరిగాయి. ఆ ఉత్సవంలో పాల్గొన్న కొందరు ఇజ్రాయిలీల ప్రకటనలు ఇలా ఉన్నాయి : " ఇజ్రాయిల్ సైనికులు మిసైళ్లు కాల్చారు. అనేక మంది సాధారణ పౌరులను చంపేశారు."

గాజా సరిహద్దుల్లో ఇజ్రాయిల్ సైన్యం గుమిగూడినప్పుడు గందరగోళం ఏర్పడింది. గాజా నుండి వందలాది మా పౌరులు, ఇతరులు ఆక్రమిత ప్రాంతాల్లో ప్రవేశించారు. అనేక మంది ఇజ్రాయిలీ సైనికులను పట్టుకున్నారు. వారిలో సాధారణ పౌరులు, విదేశీయులను విడుదలచేస్తామని సంబంధిత పక్షాలన్నింటికీ సమాచారమందించాము. వారిని మా వద్ద ఉంచుకోవాలని కోరుకోవటంలేదని తెల్పాము. వారిని పట్టుకోవటం మా విధానం కాదు. కానీ వారిని విడుదలచేసేందుకు అవసరమైన సరైన పరిస్థితులను సృష్టించాలని మేము కోరుతున్నాము. గాజాపై ఎడతెగని బాంబులు వర్షం కురిపిస్తున్న తరుణంలో ఆ పనిచేయటం మాకు కష్టతరం. ఈ పరిస్థితుల్లో అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ (ఐసిఆర్‌సి) కూడా తమ గిడ్డంగులకు చేరుకోజాలదు. అందుకే వారెక్కడున్నారో తెలియనపుడు వారిని మేమెలా విడుదలచేయగలం?

మొత్తం మీద మేము స్వేచ్ఛను కోరుకుంటున్నాము. దురాక్రమణలతో కలసి జీవించటం మాకు అంగీకారం కాదు. బ్రిటీష్ దురాక్రమణను భారతీయులు తిరస్కరించారు. అంతిమంగా వారు బ్రిటీష్‌ను తరిమేశారు. అట్లే మేమూ చేయదల్చుకున్నాము

అరబ్ ఒప్పందాన్ని, అరబ్ దేశాలతో ఇజ్రాయిల్ సంబంధాలు సాధారణ స్థితికి రావటాన్ని తప్పించటం తమ దాడి లక్ష్యమని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించాడు.

ఇజ్రాయిల్, అరబ్‌దేశాల సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చే

యుద్ధానంతరం గాజాలో పాలస్తీనా పాలన, శాంతి సైన్యం ఏర్పాటు చేయాలంటూ అమ్మన్‌లో జరిగిన అరబ్ విదేశాంగ మంత్రుల సమావేశంలో అమెరికా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అస్పష్ట ప్రతిపాతనపట్ల అరబ్బు దేశాలేవీ పెద్దగా స్పందించలేదు. ఈ సమావేశానికి జోర్డాన్, ఈజిప్టు, సౌదీ అరేబియా, కతర్, యుఏఈ లు హాజరయ్యాయి. తక్షణం ఇజ్రాయిల్ కాల్పుల విరమణ పాటించాలని ఈ దేశాలు అమెరికాను డిమాండ్ చేశాయి. బ్లింకెన్ అమ్మన్ నుండి పశ్చిమ తీరంలోని రమల్లా వెళ్లి పాలస్తీనా అధిపతి మొహమ్మద్ అబ్బాస్‌ను కలిసినప్పుడు అక్కడ కూడా ఆయనకు అటువంటి పరాభవవమే ఎదురైంది. పాలస్తీనాను ఇజ్రాయిల్ దురాక్రమించడం ఆగిపోయి, తూర్పు జెరూసలెం రాజధానిగా పాలస్తీనా రాజ్యం ఏర్పాటు చేయడం అనే "సమగ్ర రాజకీయ పరిష్కారం" మాత్రమే తమకు ఆమోదయోగ్యమని అబ్బాస్ ప్రకటించారు. అప్పుడు మాత్రమే తాము గాజా ప్రాంత బాధ్యతలు తీసుకుంటామని ఆయన చెప్పారు. గంటసేపు జరిగిన ఈ సమావేశం ఎటువంటి రాజకీయ ప్రకటన లేకుండానే ముగిసింది.

ఈలోగా కాల్పుల విరమణకోసం ఐక్య రాజ్య సమితి వెంటనే సమావేశం జరపాలని చైనా, యుఏఈలు కోరాయి. (అంతర్జాతీయ ఒత్తిడితో ఇజ్రాయిల్ తాత్కాలికంగా కాల్పుల విరమణ పాటించినప్పటికీ త్వరలోనే మళ్లీ యుద్ధం ప్రారంభిస్తానని ఘీంకరిస్తోంది)

ముస్లిం దేశాల్లో కొత్త పొత్తులు పొడుస్తుండడం పట్ల అమెరికా ఆందోళన చెందుతోంది. ఈ ప్రాంతంలో శత్రువులుగా ఉన్న ఇరాన్, సౌదీ అరేబియా విదేశాంగ మంత్రులు మరోసారి టెలిఫోన్‌లో మాట్లాడుకున్నారు. నవంబర్ 12న రియాద్‌లో ఇస్లామిక్ దేశాల కూటమి సమావేశాన్ని ప్రస్తుత ఓఐసి అధ్యక్షురాలైన సౌదీ అరేబియా ఏర్పాటు చేసింది.

**"ముస్లిం దేశాల్లో కొత్త పొత్తులు పొడుస్తుండడం పట్ల అమెరికా ఆందోళన చెందుతోంది. ఈ ప్రాంతంలో శత్రువులుగా ఉన్న ఇరాన్, సౌదీ అరేబియా విదేశాంగ మంత్రులు మరోసారి టెలిఫోన్‌లో మాట్లాడుకున్నారు. నవంబర్ 12న రియాద్‌లో ఇస్లామిక్ దేశాల కూటమి సమావేశాన్ని ప్రస్తుత ఓఐసి అధ్యక్షురాలైన సౌదీ అరేబియా ఏర్పాటు చేసింది."**

ప్రస్తుతం చైనా మధ్యవర్తిత్వంలో ఇరాన్–సౌదీల మధ్య సయోధ్య కుదిరింది. ఇది ఈ ప్రాంత భద్రతా వాతావరణాన్ని సమూలంగా మార్చే అవకాశం ఉంది.

ఒప్పందాలపై దాడులు చేయాల్సిన అవసరంలేదు. కారణం, ఆ ఒప్పందాలు అరబ్ ప్రజల అభిప్రాయాలను వ్యక్తంచేయటం లేదు. ఈపాటికే ఈ ప్రజలు ఆ ఒప్పందాన్ని తిరస్కరించారు. ఉదాహరణకు 40 సంవత్సరాల క్రితమే ఈజిప్టు, జోర్డాన్‌లు ఇజ్రాయిల్‌తో శాంతి ఒప్పందాలు చేసుకున్నాయి. కానీ అక్కడి ప్రజలు దురాక్రమణలను బలంగా తిరస్కరించారు. అందుకే మేము 'నార్మలైజేషన్ ఒప్పందాలు' గురించి భయపడటం లేదు. కారణం ఆ ఒప్పందాలు వాటంతటవే రద్దైపోతాయిగనుక.

**ప్రశ్న :** నేడు ప్రపంచమంతటా, సాయుధ ప్రతిఘటనోద్యమాలకు అతి తక్కువ అవకాశమున్నట్లు కన్పిస్తున్నది. అలాంటి వాటిని ఉగ్రవాద గ్రూపుల ప్రేరితాలుగా పరిణిస్తున్నారు. పశ్చిమ దేశాలు ఇజ్రాయిల్ పక్షాన నిలుస్తున్నాయి. ఈ నూతన నైసర్గిక వ్యూహాత్మక వాతావరణంలో, హమాస్ తనకుతాను ఎలా నిలదొక్కుకోగల్గుతున్నది? లేదా, శాంతియుత పురోగతికి అవకాశమున్నదా?

**జవాబు :** భారత్‌ను బ్రిటన్ తన వలసగా మార్చినపుడు అది ప్రపంచ మహాశక్తిగా ఉండేది. అయినప్పటికీ భారతీయులు దురాక్రమణను ప్రతిఘటించారు. మేము గత 30 సంవత్సరాలుగా శాంతియుత మార్గాన్నే అవలంబించాము. ఫతా ఉద్యమం 'ఓస్లో ఒప్పందం' పై సంతకంచేసింది. ఫలితం ఏమిటి? వారి వాగ్దానం మేరకు, మాకు పాలస్తినా రాజ్యం దక్కలేదు. పశ్చిమ తీరం ఒక ఒంటరి ద్వీపంలా మారింది. ఒప్పందాలు దాన్ని మింగేశాయి. గాజాను ముట్టడించాయి. దానితో గాజాలో లేదా పశ్చిమ తీరంలోని ఒక పాలస్తినీయుడికి తన దేశంలోని వేరొక ప్రాంతానికి చేరటం కంటే, వేరే దేశాన్ని చేరటం ఎంతో సులభమౌతున్నది. అది గాజా కావచ్చు. లేదా పశ్చిమ తీరం కావచ్చు.

అందుకే మా ప్రజలు, శాంతియుత ఒప్పందాలు మాత్రమే ఏకైక పరిష్కారమని ఎంతో కాలం నమ్మలేరు. మేము సాయుధ ప్రతిఘటన, ప్రజా ప్రతిఘటనలతో కూడిన సమగ్ర ప్రతిఘటనను విశ్వశిస్తాము.

**ప్రశ్న :** "మీరు 2007లో, గాజాలో అధికారాన్ని చేపట్టారు. పరిపాలనపై కేంద్రీకరించి వుంటే, మీరు గాజాను ఒక హాంగ్‌కాంగ్ లేదా సింగపూర్‌లా దాన్నొక విశ్వవాణిజ్య కేంద్రంగా మార్చివుండే వారు. మీరొక గొప్ప నమూనాగా నిలిచివుండేవారు. కానీ మీ చర్యలు దాన్నొక యుద్ధ భూమిగా తయారుచేశాయి" అని కొందరంటున్నారు.

**జవాబు :** జరుగుతున్న పరిణామాలన్నింటికీ, మా చర్యల పర్యవసానాలేనని వినేందుకు మాకు వింతగా ఉంది. దొంగలు, నేరగాళ్ల గ్యాంగులతో పూర్తిగా నిండిన ఒక నగరాన్ని ఒక ఏకైక జయప్రదమైన ఆర్థిక ప్రాజక్టుగా మీరు నిర్మించగలరా? అది అసాధ్యం. ఒక సమ్మిళితమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించమని మీరెలా కోరతారు? అభివృద్ధిని సాధించేందుకు ముందు చర్యగా నేరగాళ్లను వదిలించుకోవాలి. తర్వాత రాజ్యాన్ని నిర్మించాలి. వాస్తవంగా ఈ ప్రాంతంలో, దురాక్రమణకు ముందు మాది బాగా అభివృద్ధిచెందిన దేశం. దురాక్రమణలు, యుద్ధాలు మధ్య స్థానభ్రంశాలతో, సగం మంది ప్రజలు పాలస్తినా బైట శరణార్థులుగా జీవిస్తున్నారు.

1987లో హమాస్ ఉద్యమం ప్రారంభమైంది. 2007లో మేము అధికారాన్ని చేపట్టాము. మేము సరిగ్గా పాలించలేమని, వారు మమ్మల్ని ముట్టడించారు. మేము విఫలమయ్యేలా ఇజ్రాయిల్, అమెరికా, పశ్చిమ దేశాలు కుట్రలు పన్నాయి. అయినా మేము ధృడంగా నిలిచాము. మమ్మల్ని సంహరించేందుకు, ఇజ్రాయిల్ ఒక క్రమపద్ధతిలో ఉద్దేశపూర్వకంగా దాడిచేసింది. మేము అభివృద్ధితో, మంగళకరంగా

> **"పాలస్తీనా ప్రతిఘటనా గ్రూపులతో తనకు సంబంధాలున్నట్లు ఇటీవలి కాలంలో ఇరాన్ బాహాటంగానే చెబుతోంది. పశ్చిమాసియాలో బలాబలాల్లో వచ్చిన మార్పును ఇది సూచిస్తోంది. దీనికి ప్రతిగా అమెరికా, ఇజ్రాయిల్ సైనిక చర్యలతో సమాధానం చెబుతున్నారు. ఇరాన్‌ను ఏకాకిని చేయడంలో అమెరికా విఫలమయిందనేది విస్పష్టం."**

ఎందుకంటే ఈ ప్రాంత దేశాలు బయటి వారి జోక్యం లేకుండా తమలో తావే పాలస్తీనా-ఇజ్రాయిల్ సమస్యకు పరిష్కారం కుదుర్చుకోవాలని అనుకుంటున్నాయి. అమెరికా తన ఆధిపత్యం కోసం ఈ ప్రాంతంలో రెచ్చగొట్టిన పగలూ, పట్టింపులను ఇప్పుడు పట్టించుకునేవారెవరూ లేరు.

గాజాలో వేలాది మంది చనిపోవడంతో ముస్లిం దేశాల్లో తీవ్రమైన ఉద్రేకాలు పెంపొందాయి. "యుద్ధాన్ని కొనసాగించడంలో అమెరికా ప్రత్యక్ష పాత్ర ఉన్నదన్న విషయాన్ని నిరూపించే అన్ని ఆధారాలు ఉన్నాయి" అని ఇరాన్ అధినాయకుడు ఆలీ ఖమేనీ పేర్కొన్నారు. పాలస్తీనా ప్రతిఘటనా గ్రూపులకు మద్దతివ్వాలన్నది తమ స్థిరమైన విదేశాంగ విధానం అని ఇటీవల తనను కలిసిన హమాస్ పొలిట్‌బ్యూరో అధిపతి ఇస్మాయిల్ హనియేతో ఆలీ ఖమేనీ అన్నట్లు ఫార్స్ వార్తా సంస్థ తెలిపింది.

పాలస్తీనా ప్రతిఘటనా గ్రూపులతో తనకు సంబంధాలున్నట్లు ఇటీవలి కాలంలో ఇరాన్ బాహాటంగానే చెబుతోంది. పశ్చిమాసియాలో బలాబలాల్లో వచ్చిన మార్పును ఇది సూచిస్తోంది. దీనికి ప్రతిగా అమెరికా, ఇజ్రాయిల్ సైనిక చర్యలతో సమాధానం చెబుతున్నారు. ఇరాన్‌ను ఏకాకిని చేయడంలో అమెరికా విఫలమయిందనేది విస్పష్టం.

ఇజ్రాయిల్ పదాతి దళాల అధిపతి హెర్జి హాలెవి ఇటీవల నార్తరన్ కమాండ్ సమావేశంలో మాట్లాడుతూ, ''మేము ఏ క్షణాన్నయినా ఉత్తర గాజామీద దాడి చేస్తాం. మా లక్ష్యం గాజా ఒక్కటే కాదు, ఇజ్రాయిల్ సరిహద్దులన్నీ భద్రంగా ఉండాలి'' అని అన్నారు. అందువల్ల ఇజ్రాయిల్‌ను ప్రస్తుతం ఆపే శక్తి ఏదీ లేదు. తన స్థిరత్వం, రక్షణ పేరుతో అది యుద్ధం చేస్తుంది. తన ప్రపంచ వ్యూహంలో భాగంగా దానికి అమెరికా మద్దతిస్తుంది. అందువల్ల ఇజ్రాయిల్ తన మనుగడ పేరుతో గాజాలో యుద్ధాన్ని అమెరికాతో భుజం భుజం కలిపి లెబనాన్‌కు చివరికి సిరియాకు కూడా విస్తరిస్తుంది.

ఈ సందర్భంగా సూయజ్ కాలువకు తూర్పున అమెరికా అణు జలాంతర్గామిని మోహరించడం అనేది ఇరాన్‌ను హెచ్చరించడానికే నన్న విషయంలో సందేహం లేదు. మరో వంక అమెరికా అండతో ఇజ్రాయిల్ లెబనాన్‌లో రెండవ యుద్ధ రంగాన్ని తెరుస్తుంది. అందుకే లెబనాన్ సరిహద్దుల్లో అయిదు కిలోమీటర్ల వరకు యూదు సెటిల్‌మెంట్లను ఇజ్రాయిల్ అధికారులు ఖాళీ చేయిస్తున్నారు.

వీటన్నిటిని బట్టి పశ్చిమాసియాలో ఎప్పటికి ముగుస్తుందో తెలియని యుద్ధం ప్రారంభం కాబోతోంది. దానికి ప్రతిగా వచ్చే జిహాద్ పిలుపును 80 ఏళ్ల అమెరికా అధ్యక్షుడు ఎలా ఎదుర్కొంటారో తెలియదు.

అయితే ఇది ప్రపంచ యుద్ధంగా పరిణమించే అవకాశం లేదు. ఇది పశ్చిమాసియాకు మాత్రమే పరిమితమవు తుంది. కానీ ఒకవైపు అమెరికా ప్రభావం తగ్గిపోతూ, మరోవంక రష్యా - ఉక్రెయిన్ యుద్ధ నేపథ్యంలో ఈ యుద్ధం పర్యవసానాలు మాత్రం సరికొత్త బహుళ ధ్రువ ప్రపంచంవైపు మరింతగా తీసుకుపోతాయన్న దాంట్లో సందేహం లేదు.

**(అనువాదం: విష్ణువర్ధని)**

---

జీవించాలనుకుంటున్నాము. కానీ నాకు సమాధానం చెప్పండి : "ప్రపంచంలో ఎక్కడైనా, దురాక్రమణలో ఉండగా ఒక మంగళకరమైన రాజ్యాన్ని నిర్మించిన ఒక్కరినైనా చూపగలరా?"

**ఇజ్రాయిలు - పాలస్తినా వివాదాన్ని అర్ధచేసుకుందాం**

**ప్రశ్న :** మీరు యుద్ధాన్ని ప్రారంభించారు. ఇపుడు ముగింపు ఏమిటి?

**జవాబు :** నా మాతృ భూమిని ఎవరు దురాక్రమణ చేసి, మా ప్రజలను బహిష్కరించారో, మమ్ము చుట్టుముట్టారో వారే యుద్ధాన్ని ప్రారంభించారు. ఇజ్రాయిల్ సైన్యం లక్ష్యంగా మా కార్యాచరణ ఉద్దేశించబడింది. ఇది ఏ దురాక్రమణకు వ్యతిరేకంగానైనా సాగే న్యాయసమ్మతమైన పరిధిలోనే సాగుతున్న ప్రతిఘటన. దిగ్బంధనంలోని వందలాది యువకులు, ఈ ప్రాంతంలో అత్యంత శక్తివంతమైన సైన్యాన్ని చిన్నబుచ్చగల్గుతున్నారు. స్వాతంత్ర్యాన్ని సాధించే వరకూ మా ప్రతిఘటనను కొనసాగిస్తాము. మా స్వాతంత్ర్య సాధనే యుద్ధానికి ముగింపు అంకమౌతుంది.

**ప్రశ్న :** అరబ్బు దేశాల నుండి, ఈ సారి అరబ్బు ప్రపంచం వెలుపల నుండి కూడా మీకు సానుభూతి, అనితర సాధ్యమైన మద్దతు లభిస్తున్నది. దాన్ని, మొత్తం పాలస్తినా సమస్య పరిష్కారానికి ఎలా వినియోగించుకుంటారు? ఇరాన్‌ను అధిగమించి మద్దతు కోసం చూస్తున్నారా ?

**జవాబు :** ఇరాన్‌లో విప్లవానికి ముందు నుండే పాలస్తినా ప్రతిఘటన కొనసాగుతున్నది. మాకు ఇరాన్ మద్దతునందించింది. అందుకు ఇరాన్‌కు ధన్యవాదాలు. అనేక దేశాలు, పార్టీల నుండి అన్ని విధాలైన మద్దతును స్వీకరించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. ఈ విషయంలో, భారత ప్రభుత్వ వర్తమాన వైఖరి, భారత్ ప్రయోజనాలకు హానికరంగా ఉందని నేను నొక్కి వక్కాణిస్తున్నాను. పాలస్తినా ప్రజలకు, అరబ్ దేశాలతో భారతదేశ సంబంధాలకు ఒక చారిత్రక నేపథ్యం ఉంది. ప్రస్తుతం భారత ప్రభుత్వం, ఇజ్రాయిల్‌తో కూటమిగా ఏర్పడటం ఆ చారిత్రక వారసత్వాన్ని ఉల్లంఘించే కుత్రపూరితంగా ఉంది. అరబ్ ప్రాంతంలో భారతదేశానికి ప్రాణప్రదమైన ప్రయోజనాలున్నాయి. ఇజ్రాయిల్‌తో ప్రస్తుత సంబంధాలు, భారతదేశాన్ని ఒక శత్రు సంబంధమైన దేశంగా అరబ్బు ప్రజలు వర్గీకరిస్తారు. దానితో అది, ఒక మానసికమైన ఆటంకంగా మారుతుంది. భారత ప్రయోజనాలకు హానికల్గిస్తుంది.

**ప్రశ్న :** 'మేము ఇజ్రాయిల్‌ను గుర్తించబోము'అని, మీరు తరచూ ప్రకటించేవారు. కానీ, ఇజ్రాయిలు ఒక వాస్తవం. రెండు రాజ్యాల పరిష్కారాన్ని మీరు ఆమోదించకపోతే, మార్గాంతరమేమిటి?

*(మిగతా 34వ పేజీలో)*

# మూఢ నమ్మకాలు - మన పాలకులు

*(26వ పేజీ తరువాయి)*

ఆరాధించారు. ఆనాటి జ్ఞానం అంతవరకే. ప్రపంచంలోనే అన్ని నాగరికతలలోనూ అన్ని సంస్కృతులలోనూ కాస్త ముందు వెనకలుగా ఇలానే జరిగింది. వాస్తవాలను అధ్యయనం చేసే పరిపూర్ణ పరిపక్వత గాని, పరిశోధనా స్థాయి గాని ఆనాటి సమాజాలకు లేవు. అలాంటి స్థితిలో ఉన్న సమాజాల మానవులు ఇలాంటి మూఢ భావనలుకు గురి అవ్వటాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. మనం ఇప్పుడు ఆధునిక యుగంలో ఉన్నామనుకున్న వాళ్ళం కూడా అదే భావనలను కొనసాగించటం మూఢత్వమే అవుతుంది. మానవుడు చంద్రమండలం మీద కాలు పెట్టి అక్కడి చంద్ర శిలలను భూమికి తెచ్చిన కాలంలో నివసిస్తున్నాము మనం. చంద్రుడు మీద ఉన్నవన్నీ రాళ్లు రప్పలు పర్వతాలు లోయలు అన్న విషయం తెలియని కాలంలో చంద్రుని దేవుడుగా ఆరాధించటంలో ఆశ్చర్యం లేదు. కానీ ఏ గ్రహాల మీద నైనా మనలాంటి మానవులు కానీ మనల్ని పోలిన వారు గానీ లేక జీవం కానీ ఉన్నదేమోనని పరిశోధిస్తున్న యుగంలో ఉన్న మనం మూఢత్వంలో కొట్టుకుపోకూడదు.

కానీ మన దేశంలో ఏలికిలే ఇలాంటి మూఢనమ్మకాలను, ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతి పేరుట పెంచి పోషిస్తున్నారు. మానవజాతి స్పేస్ యుగంలో ఉన్నప్పటికీ మన భారత జాతి వైజ్ఞానిక స్పృహ ఇంకా నేర్చుకోలేదు. బూజు పట్టిన భావాలను జీర్ణించిపోయిన వ్యవస్థలకు "భారతీయ సంస్కృతి" అని పేరు పెట్టి దానిని పునర్జీవనం చేయడానికి పాలకులు ప్రజా సమస్యలు గాలికి వదిలేసి రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. దీని కారణంగానే జాతి, మతం, కులం, భాష, ప్రాంతీయ దురభిమానాలు పుట్టి పెరుగుతున్నాయి. దేశ సార్వభౌమత్వానికి గుండెకాయ లాంటి రాజ్యాంగం మీద ప్రమాణం చేసి మంత్రులు, ప్రధాన మంత్రులు అయిన వారు మతం మౌఢ్యాన్ని పెంచి పోషిస్తున్నారు. ఈ నాయకులే స్వామీజీలు, బాబాలు, మత గురువుల ముందు మోకరిల్లినప్పుడే మన రాజ్యాంగం మసకబారింది. ప్రపంచం ముందు దేశ గౌరవ ప్రతిష్టలు అభాసుపాలు అవుతున్నాయి. ఈ నాయకులే చప్పట్లు కొట్టి, దీపాలు వెలిగించి, పళ్ళాలు మోగించితే కరోనా వైరస్‌ను చంపవచ్చునని ప్రచారం చేశారు. రామాయణ కాలంలోనే పుష్పక విమానం ఉన్నదని ఎంతమంది ఎక్కినా మరొక సీటు ఖాళీగా ఉండేదని, రావణాసురుడు 24 రకాల విమానాలు వాడే వాడని అవన్నీ లంకలో విమానాశ్రయాల్లో ఉండేవని ఏమాత్రం రుజువు లేని, రుజువు కానీ విషయాలను ప్రచారం చేయడం మనం చూస్తూనే ఉన్నాం. అలాగే మహాభారతంలో 100 మంది కౌరవుల పుట్టుకకు మూల కణాల వైద్యం ఆనాడే ఉండేదని, టెస్ట్ ట్యూబ్ బేబీ సాంకేతిక పరిజ్ఞానం మన పురాణాల్లో పుష్కలంగా ఉందని, సీత కూడా టెస్టు ట్యూబ్ బేబీయేనని ఆధునిక సైన్సు పదాలను కొన్ని అడ్డం పెట్టుకుని గతం ఎంతో గొప్పదని ప్రచారం చేస్తున్నారు. వినాయకుడికి ఏనుగు తల అతికించడం అంటే ఈనాటి ప్లాస్టిక్ సర్జరీ లాంటిదని, అది ఏనాడో మా మునులు, మహర్షులు ఆవిష్కరించారని, ఇవన్నీ అసలు మా వేదాల్లోనే ఉన్నాయని ఇలాంటి హేతుబద్ధత లేని ప్రచారాలు మన ప్రధాని నుండి ఇతర మంత్రుల వరకు, చివరికి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సర్ల దాకా ఇలా సూడో సైన్స్ ను ప్రచారం చేయడం మనం చూస్తూనే ఉన్నాము. ఒక సెక్యులర్ దేశంగా ప్రభుత్వాలు మత సంబంధిత విశ్వాసాలకు, కార్యక్రమాలకు దూరంగా ఉండాలని రాజ్యాంగంలోని 51 A(H) అధికరణ ప్రకారం ప్రజలలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని చాలా స్పష్టంగా రాసుకున్నాము. కానీ దానికి భిన్నంగా ప్రజలలో మూఢవిశ్వాసాలు పెంచి పోషించడానికి ఆ ప్రభుత్వాలే ఆ ప్రభుత్వ ప్రతినిధులే స్వయంగా పుష్కరాలు, చండీయాగాలు, జాతరలు, కుంభమేళాలు లాంటి వాటిల్లో పాల్గొని జరిపి ప్రజలలో అజ్ఞానాన్ని పెంచుతున్నారు. ప్రజల వ్యక్తిగత నమ్మకాలను పాలకులు తమ ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారు.

అంతరిక్షంలోకి పంపే రాకెట్ల నమూనాను తిరుపతి వెంకన్న పాదాల ముందు పెట్టి పూజించిన తర్వాతనే ప్రయోగిస్తున్నారు కొందరు సైంటిస్టులు. రోడ్డుమీద పసుపు అంటిన నిమ్మకాయనో, మిరపకాయనోచూసి జడుసుకొని చెమటలు పడుతున్న పాస్టర్లు ఉన్నారు. భూమిపై పుట్టిన పిల్లలకు ఆకాశంలో నక్షత్రాలను బట్టి పేర్లు పెట్టే డాక్టర్లు ఉన్నారు. అలాగే స్త్రీకి సహజ ప్రసవం అంటే నార్మల్ డెలివరీ అయ్యే అవకాశం ఉన్నప్పటికీ డబ్బుకు కక్కుర్తి పడి ముహూర్తం కోసం పొట్ట కోసి బిడ్డను తీసే డాక్టర్లకు అలా చేయమని అడిగే తల్లిదండ్రులకు కొదువలేదు మనదేశంలో. పేరులో ఒక అక్షరం మారిస్తే సినిమా హిట్ అవుతుందని నమ్మే హీరోలు, నిర్మాతలు ఉన్నారు. ఇలాంటి వారు ఉంటే మన దేశంలో వైజ్ఞానిక ఆవిష్కరణలు జరుగుతాయా? నోబుల్ ప్రైజులు కనుచూపు మేరలోనైనా కనపడతాయా? ఇది ప్రతి ఒక్కళ్ళు ఆలోచించుకోవాలి.

ఇక మన చదువులు కూడా అలానే ఏడ్చాయి. ఏమాత్రం శాస్త్రీయంగా ఆలోచించటానికి పునాదులు పడటం లేదు. "య" అంటే యజ్ఞం అని చెప్తారే కానీ "య" అంటే యంత్రం అని చెప్పరు. గణితంలో కూడా పది లీటర్ల పాలలో మూడు లీటర్లు నీళ్లు కలిపితే నీళ్ల శాతం ఎంత? పాల శాతం ఎంత? ఇలా చిన్నప్పుడు నుంచే కల్తీ ఎలా చేయ వచ్చో, అలానే పదివేల రూపాయలు మూడు రూపాయల వడ్డీకి ఇస్తే అది బారు వడ్డీ ప్రకారము లెక్క కడితే ఎంత లాభం వస్తుంది? చక్రవడ్డీ ప్రకారం కడితే ఎంత లాభం వస్తుంది? అని ఇలా వడ్డీ వ్యాపారం చేసుకునే లెక్కలను చిన్నప్పటినుంచే నేర్పుతుంటారు. ఇలా ఏమాత్రం శాస్త్రీయత లేని చదువుల వల్ల విద్యాలయాలలో సైన్సు ఇతర సబ్జెక్టు పాఠాలను బట్టి కొట్టించటం వలన డిగ్రీ పట్టాలు అరకొరా ఉద్యోగాలు వస్తాయేమో తప్ప విజ్ఞానం, వివేకం, విచక్షణ వస్తాయి అనుకోవడం కంటే అంతకు మించిన మూఢనమ్మకం మరొకటి ఉండదు. అజ్ఞానం, మూఢత్వం మన సమాజంలో నాలుగు చెరుగుల వ్యాపించేందుకు పాలకుల శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ప్రస్తుత విద్యా విధానానికి లౌకిక తత్వానికి ఏ మాత్రం లంకె కుదరటం లేదు. అసలు చారిత్రక దృక్పథమే లేదు. అనేక తరాల నుండి వారసత్వంగా వచ్చిన ప్రగతి నిరోధక భావాలు, చాదస్తాలు, మూఢనమ్మకాలు మన విద్యా విధానంలో పుష్కలంగా చోటుచేసుకున్నాయి.

ప్రజల దయనందిన జీవిత సమస్యల పరిష్కారం చూపనందువల్ల వచ్చిన అసంతృప్తి,

ఆగ్రహ జ్వాలలు, రాజకీయ నిరసనలుగా, తిరుగుబాట్లుగా మారకుండా ఉండేందుకు ఇహ లోకంలోని ఈతి బాధలకు పరలోకంలో పరిష్కారం చూపే మతాన్ని పాలకులు ఆయు ధంగా వాడుకుంటున్నారు. మూఢనమ్మకాలను పెంచి పోషించే బాబాలను, స్వామీజీలను, సాధువులు, సంతులు రూపంలో ఉన్న రౌడీ మూకలను ప్రోత్సహిస్తున్నారు. వాస్తు మారి స్తేనో, రుద్రాక్షలు ధరిస్తేనో, యాగాలు హోమాలు జరిపిస్తేనో, హాజీయాత్రలు చేస్తే నో, పాస్టర్ల, లామాల మలమూత్రాలు సేవిస్తేనో, స్వస్థత చేకూరుతుందని విస్తృత ప్రచారం ఈ బాబాలు స్వామీజీల ద్వారా తీవ్రంగా ప్రచారం చేయిస్తున్నారు. సామాజిక సమస్యలే ముడిసరుకుగా వారి మత విశ్వాసాలు, వెనుకబాటుతనాన్ని , పెట్టుబడిగా వారి ఆశలు, ఆకాంక్షలే, వ్యాపార మార్కెట్లుగా మారుస్తూ, భక్తిని ఒక పరిశ్రమగా వేలకోట్ల రూపాయల ఆధ్యాత్మిక సామ్రాజ్యాలను పెంచుకునేలా పాలకవర్గాలు ప్రోత్సహిస్తూనే ఉన్నాయి. ఇలాంటి మూఢత్వం పాతుకు పోతే ప్రజల సామాజిక స్పృహ ప్రశ్నించే చైతన్యం నీరుగారిపోతుంది. పాలకుల ఉద్దేశం కూడా అదే.

ప్రజలలో అజ్ఞానాన్ని, అంధ విశ్వాసాలను మత మౌఢ్యాన్ని, పెంచే పాలకుల విధానాలను, అభివృద్ధి నిరోధక శక్తులను తీవ్రంగా వ్యతిరేకించాలి. ఈ మూఢ భావజాలానికి వ్యతిరేకంగా అసలైన సైన్సు విజ్ఞాన పరిమళాలను ప్రజలకు అందించాలి. ప్రజల జీవితాలు మెరుగుపడాలంటే సైన్సు సాంకేతిక రంగాలను అభివృద్ధి పరచాలి. సైన్సు ఫలితాలను ప్రజలకు అందుబాటులోకి తేవాలి. విజ్ఞాన శాస్త్రాన్ని శాస్త్రీయ, హేతు దృక్పథాన్ని ఆలోచించే శాస్త్రీయ విద్యావిధానానికై పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నమ్మకాలు సంప్రదాయాలు, ఆచారాల పేరిట అశాస్త్రీయ భావాలను ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలి. బాణామతి, చేతబడి, చిల్లంగి అంటే బ్లాక్ మ్యాజిక్ పేరుతో మోసం చేసే వారిని, నర బలులు ఇవ్వమని ప్రోత్సహించే వారిని, బాబాల ముసుగులో లైంగిక అకృత్యాలకు పాల్పడే వారిని శిక్షించే విధంగా మూఢనమ్మ కాల నిరోధక చట్టాన్ని చేసి దేశంలో అమలు పరచాలి.

❋

# హిందూయిజం అంటే ఏమిటి?

*(21వ పేజీ తరువాయి)*

తీసుకురావలసిన సంస్కరణల కోసం జరిగే కృషిని అడ్డుకుంటుంది. యథావత్తు హిందూ ఆధ్యాత్మిక సాంప్రదాయాలనూ నిర్జీవంగా మార్చి సంకుచిత కర్మకాండల మధ్య, సాంప్రదాయాల మధ్య ఛాందసత్వం మధ్య పాతిపెట్టేస్తుంది. అంతిమంగా అది హిందూయిజానికి ఆత్మహత్యాసదృశమే ఔతుంది.

భారతదేశ నేపథ్యంలో ఈ ధోరణికి వ్యతిరేకత ఎక్కడనుంచి వచ్చినా దానికి తగిన ప్రాధాన్యతనివ్వాలి. అది హైందవేతరులనుండి వచ్చినా, ఉదారవాదులనుండి వచ్చినా, మార్క్సిస్టులనుండి వచ్చినా ముఖ్యమైనదే ఔతుంది. హిందూయిజం లోని సంకుచిత శక్తులను నిలవరించి, వారి అమానవీయ ధోరణులను కట్టడి చేయడంలో దాని ఉపయోగం చాలా ఉంది. అందుచేత ఎవరి నిరసననైనా సరే, అణచివేయడాన్ని మనం వ్యతిరేకించాలి. ఏ అభిప్రాయాన్నీ అగౌరవంగా చూడకూడదు. దైవదూషణ ముద్ర వేయ కూడదు.

నా భావాలను వ్యతిరేకించే హక్కు సనాతనవాదులకు ఉన్నది. కాని వారు తమను వ్యతిరేకించేవారిని సంవాదం ద్వారా ఓడించాలే తప్ప భయ భ్రాంతులకు గురి చేసే ఎత్తుగడలత , అమానవీయ దాడులతో కాదు. కొత్త దృక్పథాలు ఆవిష్కరించబడాలన్నా, కొత్త వాదనలు ముందుకు రావాలన్నా అందుకు అవసరమైన ఆరోగ్యకర వాతావరణం ఉండాలి.

విద్యావంతులైన పండితులు, విజ్ఞాన ఖనులైన ఋషులు హిందూయిజానికి మార్గదర్శకులుగా ఉండాలే తప్ప విద్వేషంతో రగిలిపోయే రాజకీయనాయకులు కారాదు, అధికార దాహంతో తపించిపోతున్న దారిదోపిడీ ముఠాలూ కావు. హిందూ మేధావులు, ఋషులు మనకు అన్ని నదులూ సాగరంలో సంగమిస్తాయని నేర్పారు. ఆ పాఠాన్ని మనం మరిచిపోవద్దు.

**(అనువాదం: జీవీఎన్ చలపతి)**

# దురాక్రమణే సమస్యకు మూలం

**(32వ పేజీ తరువాయి)**

**జవాబు :** ఇజ్రాయిల్ కంటే నాటి బ్రిటన్ ఒక సూపర్ పవర్‌గా ఉండేది. అయినప్పటికీ, బ్రిటీషు దురాక్రమణను ఒక వాస్తవంగా భారత్ ఎందుకు ఆమోదించలేదు? ఇజ్రాయిలు ఒక ప్రాంతీయ శక్తి. నేడు దాని శక్తి దిగజారిపోతున్న విషయం ఒక వాస్తవం కాబట్టి, ఇజ్రాయిల్‌ను ఆమోదించమంటున్నారు. ప్రతిఘటనను త్యజించి ఇజ్రాయిల్‌ను ఆమోదించటమే సులభమైన ఎంపికగా ఉంటుందని చెబుతున్నారు. కానీ, "సరైన మార్గమనేది నిరంతరం అత్యంత కష్టభూయిష్టంగా ఉంటుంది." –అన్న మహాత్మా గాంధీ మాటల్లోని సత్యాన్ని చూడగల్గాలి.

**ప్రశ్న :** శాంతి కోసం ఇజ్రాయిల్, పాలస్తీనాలు సహజీవనం సాగించటం సాధ్యమా? అది హమాస్‌కు అంగీకారయోగ్యమా?

**జవాబు :** నీవు గొర్రె పిల్లను అడుగుతున్నావు, "తోడేలుతో సహజీవనం చేసేందుకు నీవు అంగీకరిస్తావా?" అని. ఈ ప్రశ్నను అడగాల్సింది ఒక శక్తిని. ఎందుకంటే, ఆ శక్తే సమస్యకు మూల కారణం కాబట్టి. అది అణ్వాయుధాలను కలిగివుంది. దాని వద్ద అత్యంత ఆధునిక ఆయుధాలు గుట్టలుగా ఉన్నాయి. పాలస్తీనా వాసులమైన మాకు సంబంధించి, రెండు రాజ్యాల విధానమైన ఓస్లో ఇప్పందానికి కట్టుబడి ఉన్నాము. కానీ దురాక్రమణదారు తన రాజ్యాన్ని నిర్మించుకున్నాడు. ఒక పాలస్తినా రాజ్యం స్థాపన కోసం జరిగే మా కృషిని ఆటంకపరుస్తున్నాడు. వాస్తవానికి, "పాలస్తినా రాజ్యాన్ని స్థాపించుకోవాలన్న ఆలోచన పాలస్తినా వారి బుర్రల్లోకి ప్రవేశించటాన్ని అడ్డుకోవాలని" ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు ప్రకటించాడు. ఈ దురాలోచనలతో సహజీవనం చేయటం సాధ్యమా? ఒక మంచి పాలస్తీనా వాసిని, ఒక చెడ్డ పాలస్తినా వాసియని నమ్మింపజూచే వారితో సహజీవనం సాధ్యమా?

పాలస్తినా వాసులు ముఠాలుగా చీలివున్నారన్న ఒక అపోహ ఉంది. చీలిక ఉద్యమంతో వ్యవహరించేందుకు ఎవ్వరూ ఇష్టపడరు. అదొక అసహజమైన వాదన. ఎందుకంటే, పాలస్తినా చీలిక 2006లో సంభవించింది. అంటే ఇజ్రాయిల్ ఏర్పాటయ్యాక ఆరు దశాబ్దాలకు అది జరిగింది. ఈ కాలంలో, పాలస్తినా ప్రజల విముక్తిని ప్రపంచం ఎందుకు ఆమోదించలేదు? నేటి ప్రపంచం, పాలస్తీనా ప్రజల విభజనను ఒక సాకుగా చూపేందుకు ప్రయత్నిస్తున్నది. మాకు అంతర్జాతీయ మద్దతు క్షీణించటం వెనుక పాలస్తినా ప్రజలే ఉన్నట్లు నిందింపజూస్తున్నది. భారత ప్రజల విప్లవ చరిత్రలోకి తిరిగి వెళ్లవసిందిగా మీకు, నేను సలహాయిస్తున్నాను. విముక్తిని సాధించే క్రమంలో సరైన స్థానాలు, ఎంపికల్లో భారతీయుల్లో కూడా తేడాలుండేవి. ❋

# యుద్ధతంత్ర యోధుడు మార్షల్ చూ టే (ఝు డే)

(2వ పేజీ తరువాయి)

కమ్యూనిస్టు బృందంలో పూర్తి సభ్యుడిగా చేర్పించాడు. మొదట తిరస్కరించబడినా తరువాత చౌ.ఎన్.లై సహాయంతో పూర్తి సభ్యుడైనాడు.

చింగ్ కాంగ్షన్ పర్వత శ్రేణుల్లోని తాలుంగ్ పట్టణంలో జరిగిన సమావేశంలో కలుసుకున్న మావో – చూటేలు వారి భావాలను, అనుభవాలను పంచుకున్నారు. అప్పటి కమ్యునిస్టు పార్టీ నాయకుడు లిలిసాన్ ఎత్తుగడలు నష్టం చేస్తాయని చూటే, మావోలు అభిప్రాయపడ్డారు. దీర్ఘకాల రైతాంగ సాయుధ పోరాటమే సరైనదని భావించారు. అనేక పరిణామాలు అనంతరం 1931 డిసెంబరులో జరిగిన మహసభలో మావో అధ్యక్షుడిగా చూటే సర్వసైన్యాదిపతి గాను ఎన్నికయ్యారు.



కామ్రేడ్ మావోతో చూ టే

**రెడ్ ఆర్మీ నాయకుడు**

1934 అక్టోబరు 16వ తేదిన దక్షిణాది నుండి ఉత్తర చైనాకు లాంగ్ మార్చ్ ప్రారంభమైంది. మొత్తం 6000 మైళ్ళు, 10 రాష్ట్రాలు, 18 పర్వత శ్రేణులు, 24 నదులూ దాటుకుంటూ ఒక సంవత్సరం పాటు సాగింది. ఎండ, వాన, వడగాల్పులు తట్టుకుంటూ, మంచు పర్వతాలు దాటుకుంటూ, అడుగడుగునా శత్రు మూకలతో పోరాడుతూ యాత్ర ముందుకు సాగింది. 2లక్షల సైన్యంతో ప్రారంభమైన యాత్ర 50 వేల సైన్యంతో గమ్యస్థానం చేరుకుంది. ఈ లాంగ్ మార్చ్‌లో చూటే, చౌఎన్ లై లు కొన్ని యుద్ధాలకు నాయకత్వం వహించారు. 1935లో చూటే, లియు బోచెంగ్ తో కలసి 4వ రెడ్ ఆర్మీకి నాయకత్వం వహించారు. 1949లో పీపుల్ లిబరేషన్ ఆర్మీకి కమాండర్ ఇన్ చీఫ్ గా చూటే నియమించబడ్డారు. 1956–1966 వరకు కమ్యూనిస్టు పార్టీకి వైస్ చైర్మన్ గా, 1955లో మార్షల్ గా పనిచేశారు.

చూటే నాయకత్వాన విప్లవ సేనల సమర వ్యూహం అద్భుతంగా ఉంది. వారి పునాది ప్రజాబలం, పర్వతాల్ని కోటలుగా మల్చుకుంటూ శత్రు సేనలదాడిని త్రిప్పి కొట్టారు. యుద్ధాన్ని ఎక్కడ ప్రారంభిం చాలో, ఎక్కడ వెనక్కి తగ్గాలో మెలుకువలు నేర్చుకున్నారు. మావో దార్శనికత, చూటే విప్లవ దీక్షతో ఎర్ర సైన్యం పురోగమించింది. చూటే అనుసరించిన ఎత్తుగడలు ఫలితాలిచ్చాయి. యుద్ధం అంటే చంపటం మాత్రమే కాదు. నిర్మించడం, మార్చటం అని నిరూపించాడు చూటే "షిపింగ్" ప్రాంతాన్ని రెడ్ ఆర్మీ హస్తగతం చేసుకున్న అనంతరం "చెన్ జియన్" ప్రాంతం వైపుకు సాగిపోతుంది. అక్కడ యుద్ధ ప్రభువు టాంగ్ షెండ్–చీ 11 కంపెనీల సైన్యంతో అధికారం చెలాయిస్తున్నాడు. ఇందులోని 6 కంపెనీల్లో 20 ఏళ్ల కుర్రాళ్లు ఉన్నారు. వాళ్లని ఆఫీసర్లు చేస్తామని మభ్యపెట్టి శిక్షణా దళంలో చేర్చుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న చూటే దాడి చేసే వ్యూహన్ని మార్చుకుని ఏ కుర్రాడి ప్రాణం పోకుండా నిర్బంధించాడు. వాళ్లని సమీప కొండల్లోకి తీసుకుపోయి, రెడ్ ఆర్మీ స్వభావం గురించి కమ్యూనిస్టు పార్టీ గురించి, కార్యక్రమం గురించి పాఠాలు బోధించి ఒప్పించారు. ఈ పోరాటం సుధీర్ఘమైంది, చైనా యువకులైన మనం బానిసత్వ కన్నా బాధలంటే భయపడవచ్చా...? అని వాళ్లని ఆకర్షించి ఎర్ర సేనలో కలిపేసుకుసుకున్నారు.

1969 సంవత్సర కాలంలో చైనా ని కుదిపేసిన సాంస్కృతిక విప్లవ కల్లోలంలో చూటే కూడా భాదితుడే. గ్యాంగ్ ఆఫ్ ఫోర్‌ని వ్యతిరేకించినందుకు పొలిట్ బ్యూరో స్టాండింగ్ కమిటి నుండి తొలగించబడ్డారు. కార్యకలాపాలకు దూరం కావాల్సి వచ్చింది. అయినా సిద్ధాంత దీక్ష చెదరలేదు. దృఢంగా చూటే నిలబడ్డారు. 1976 జూలై 6వ తేదిన మరణించేంతవరకూ కామ్రేడ్ గానే బ్రతికాడు. అమెరికా రచయిత "ఎగ్నెస్ స్మెడ్లీ" రచించిన (ది గ్రేట్ రోడ్) జైత్ర యాత్ర పుస్తకం ద్వారా చూటే ఎత్తుగడలు, వ్యూహ రచన, త్యాగం విస్తృత ప్రచారంలోకి వచ్చాయి. ఆనాటి చైనా విప్లవ కాలంలోని విలువైన విషయాలు తెలుసుకోవడానికి ఈనాటి యువతకు పుస్తక అధ్యయనం తోడ్పడుతుంది. డిసెంబర్ 1న జనరల్ చూటే జయంతి సందర్భంగా స్మరించుకుందాం. ❀


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 19, issue: 7 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# బీహార్ కులగణన వెల్లడిస్తున్న వాస్తవాలు

బీహార్ కుల గణన నివేదిక 2023 ఆ రాష్ట్రంలో అణగారిన కులాల పరిస్థితిని కళ్లకు కట్టినట్లు చూపించడమే కాకుండా వారి అభ్యున్నతికి ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతోంది. అంతే కాదు ఇది దేశం మొత్తంగా కులగణన నిర్వహించాల్సిన అవసరాన్ని కూడా ముందుకు తెస్తోంది.

బీహార్ కులగణనలో వెల్లడైన ముఖ్యమైన వాస్తవాలు:

రాష్ట్రంలో ఉన్నత కులాలు మొత్తం జనాభాలో 16 శాతంతో మైనారిటీగా ఉన్నా భూమి, ఇతర వనరులు అత్యధికంగా వారిచేతుల్లోనే ఉన్నాయి.

రాష్ట్రంలో మొత్తం 63 శాతం మంది వెనుకబడిన తరగతుల వారున్నారు. వారిలో ఇతర వెనుక బడిన తరగతుల వారు (ఓబిసి) 27.12 శాతం కాగా అత్యంత వెనుకబడిన తరగతుల వారు (ఇబిసి–ఎక్స్‌ట్రీమ్‌లీ బాక్‌వార్డ్ కాస్ట్స్) 36.01 శాతం మంది ఉన్నారు.

రాష్ట్ర జనాభాలో ఎస్సీలు 19.65 శాతం, ఎస్టీలు 1.68 శాతం ఉన్నారు.

రాష్ట్రంలోని భూమి, పరిశ్రమలు 16 శాతంగా ఉన్న ఉన్నత కులాల వారి (బ్రాహ్మణులు, భూమిహరులు, రాజ్‌పుట్‌లు) చేతుల్లో ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థల అధిపతుల్లో కూడా వారే అధికం.

జనాభాలో అత్యధికంగా ఉన్న దిగువ తరగతులవారు అంటే బిసి, ఎస్సీ, ఎస్టీలలో అత్యధికులు భూమి లేని వ్యవసాయ కూలీలుగా, పట్టణాల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు.

గతంలో జరిగిన సర్వేల్లో కూడా భూమి, ఇతర ఆర్థిక వనరులు ఉన్నత కులాల చేతుల్లోనే ఉన్నాయని తెలిపాయి. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో బిసి కులాలైన యాదవులు (జనాభాలో 14.26 శాతం), కుర్మీలు (2.87 శాతం) రాజకీయాల్లో కొంత ముందుకు వచ్చినట్లు కనిపించినా ఇప్పటికీ భూమి, ఇతర వనరులు అగ్రవర్ణాలతో పోలిస్తే వారి వద్ద తక్కువగానే ఉన్నాయి.

అఖిల భారత స్థాయిలో కూడా ఎస్సీ, ఎస్టీ, బిసిల పరిస్థితి దాదాపు ఇలానే ఉంది.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిప్రతి: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా రూ. **180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు .........................................
వీధి .........................................
గ్రామం .........................................
మండలం లేదా పట్టణం .........................................
జిల్లా .........................................

email : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.